జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

రంగారెడ్డి | మంగళవారం 4 ఫిబ్రవరి 2025 | సంపుటి : 17 | సంచిక : 278 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from: GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంచార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989894528

# ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేలా చర్యలు



- సంపద దోచుకునేవాళ్లు కాదు.. పంచేవాళ్లు కావాలి
- కేంద్రం నుంచి ఏపీకి నిధులు ఎలా తెచ్చుకోవాలో మాకు తెలుసు
- కేంద్ర బడ్జెట్ లో ఏపీ పేరు ప్రస్తావించలేదని ప్రతిపక్షాల విమర్శలకు సమాధానం ఇదే
- అభివృద్ధి ఎవరు చేస్తారో వారికే ఓటు వేయాలని ఢిల్లీ ప్రజలకు విజ్ఞప్తి
- మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు

**ఢిల్లీ**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నిధులే లక్ష్యంగా సీఎం నారా చంద్రబాబునాయుడు ఇవాళ(సోమవారం) 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగడియాతో భేటీ అయ్యారు. ఈ సమావేశం సుమారు రెండు గంటలపాటు జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. తొలుత 45 నిమిషాల అనుకున్న భేటీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, గత ఐదేళ్ల పరిణామాలు, ప్రస్తుతం చేపట్టాల్సిన చర్యలపై రెండు గంటల పాటు చర్చ జరిగింది. ఏపీ ఆర్థిక పరిస్థితి, గత ఐదేళ్ల వైసీపీ దుష్పరిపాలన, పలు రంగాల - మిగతా3లో



## త్వరలో 100 అమృత్ భారత్ రైళ్లు

- తెలుగు రాష్ట్రాలకు భారీగా కేటాయింపులు
- సికింద్రాబాద్‌లో కవచ్ సెంటర్ ఫర్ ఎక్సలెన్సు ఏర్పాటు చేస్తాం
- రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్
- తెలంగాణ నుంచి మరిన్ని వందే భారత్ రైళ్లు నడుపుతాం
- కాజీపేట రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నాం
- 2026 లోపు దేశమంతా కవచ్ టెక్నాలజీని అందుబాటులోకి తెస్తాం



## ఏపీకి నటుడు సోనూసూద్ 4 అంబులెన్స్‌లు

'సూద్ ఛారిటీ ఫౌండేషన్' ద్వారా అందజేత

అభినందించిన సీఎం చంద్రబాబు


ఏపీ సీఎం చంద్రబాబును కలిసి అంబులెన్స్‌లను విరాళంగా ఇచ్చిన సోనూ సూద్

అమరావతి వచ్చిన సోనూ సూద్

చంద్రబాబుతో మర్యాదపూర్వక భేటీ

**అమరావతి**

ముఖ్యమంత్రి చంద్రబాబును సినీ నటుడు, 'సూద్ ఛారిటీ ఫౌండేషన్' వ్యవస్థాపకుడు సోనూసూద్ సోమవారం అమరావతిలోని సచివాలయంలో కలిశారు. ఏపీ ప్రభుత్వానికి సోనూసూద్ ఫౌండేషన్ నాలుగు అంబులెన్స్‌లను అందించింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబును కలిసిన సోనూసూద్.. ఫౌండేషన్ అంబులెన్స్‌లను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించారు. అనంతరం నాలుగు అంబులెన్స్‌లను సీఎం ప్రారంభించారు. మర్యాద పూర్వకంగా తనను కలవడానికి వచ్చిన సోనూసూద్‌ను ఈ సందర్భంగా చంద్రబాబు అభినందించారు.



## నా అమెరికా పర్యటనపై రాహుల్ వ్యాఖ్యలు నిరాధారం

- రాహుల్ మాటల్లో ఎంతమాత్రం వాస్తవం లేదు
- బైడెన్ అడ్మినిస్ట్రేషన్‌లోని సెక్రటరీ, ఎన్ఎస్ఏను కలిసేందుకు వెళ్లాను
- ఆ తర్వాత మన కాన్సుల్ జనరల్ సమావేశానికి అధ్యక్షత వహించాను
- కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్

## నా పోరాటం ఆగదు.. వారిని వదలను



- రఘురామఅసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు
- ఎమ్మెల్యే ఎవరైనా 60 రోజులపాటు లీవ్ అడగకుండా సభకు రాకుంటే.. అనర్హత పడుతుందని
- ప్రజా ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందని నమ్ముతున్నా
- దోషులకు శిక్ష పడుతుందనే సంపూర్ణ విశ్వాసం ఉంది
- ప్రభుత్వానికి తాను ఒక బాధితుడిగా పిర్యాదు చేశా

## దేశంలో మకాం వేసిన చైనా

- కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ
- 'మేక్ ఇన్ ఇండియా' ఆలోచన మంచిదే అయినా దానిని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైంది
- ఉత్పత్తి రంగంలో భారత్ నిలదొక్కుకోలేకపోయింది
- అందువల్లే చైనా ఇక్కడ మకాం వేసింది

## ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తాం



- ప్రైవేటు పాఠశాలలకు గుడ్ న్యూస్ చెప్పిన మంత్రి నారా లోకేశ్
- ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ ప్రతినిధులతో మంత్రి లోకేశ్ సమావేశం
- ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తాం
- ప్రైవేటు పాఠశాలల గుర్తింపు గడువును పదేళ్లకు పెంచుతామని వెల్లడి
- గత వైసీపీ ప్రభుత్వ అసమర్థత వలన లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు తరలివెళ్లారు

ఏపీలోని ప్రైవేటు పాఠశాలలకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తియ్యని కబురు చెప్పారు. రాష్ట్రంలోని ప్రైవేటు పాఠశాలల గుర్తింపు గడువును పదేళ్లకు పెంచుతామని వెల్లడించారు. ఉండవల్లిలోని నివాసంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ ప్రతినిధులు, యాజమాన్యాలతో మంత్రి నారా లోకేశ్ నేడు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పోటీ పడదాం... అందరం కలిసి విద్యావ్యవస్థను బలోపేతం చేద్దాం అని పిలుపునిచ్చారు. "కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలైంది. విద్యాశాఖ మంత్రిగా నాపై పవిత్ర బాధ్యత ఉంది. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తాం. గత వైసీపీ ప్రభుత్వ అసమర్థత - మిగతా3లో

## పిల్లల భవిష్యత్తును ఆప్ నాశనం చేస్తోంది



- చెట్టు కింద విద్యార్థులతో మోదీ ముచ్చట్లు..
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- విద్యార్థుల భవిష్యత్తు కంటే సొంత ప్రతిష్టను పెంచుకునేందుకే ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది
- సరైన రిజల్ట్ రాకపోతే ప్రభుత్వం పరువు పోతుందని వారు భావిస్తున్నారు
- ఇది విద్యావ్యవస్థలో నిజాయితీ లోపించడమే అవుతుంది

# త్వరలో 100 అమృత్ భారత్ రైళ్లు



సికింద్రాబాద్‌లో కవచ్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేస్తామని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. సోమవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణ నుండి మరిన్ని వందే భారత్ రైళ్లను నడుపుతామని తెలిపారు. కాజీపేట రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నామని, కొన్ని పనులకు అనుమతులు రావాల్సి ఉన్నందున ఆలస్యమవుతోందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమైన స్టేషన్ల పరిధిలో రక్షణ వ్యవస్థ కవచ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు. 2026లోపు దేశమంతా కవచ్ టెక్నాలజీ ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర రైల్వే, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. ముఖ్య స్టేషన్ల పరిధిలో కవచ్ టెక్నాలజీని వేగంగా ఏర్పాటు చేస్తున్నామని, త్వరలో అన్ని చోట్ల పూర్తిచేస్తామని తెలిపారు. అలాగే.. సికింద్రాబాద్‌లో కవచ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. రైల్వే బడ్జెట్‌లో తెలుగు రాష్ట్రాలకు కేటాయింపులు జరిగాయని తెలిపారు. ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో సోమవారం అశ్విని వైష్ణవ్ మాట్లాడారు. త్వరలో దేశవ్యాప్తంగా 100 అమృత్ భారత్ రైళ్లు కూడా వస్తాయని అశ్విని వైష్ణవ్ తెలిపారు. 200 వందే భారత్ రైళ్లు కూడా అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. మొత్తం రైల్వే నెట్‌వర్క్‌లో ఆటోమేటిక్ రైలు రక్షణ టెక్నాలజీ కవాచ్‌ను అమలు చేస్తామని తెలిపారు. 2026 నాటికి కవాచ్ వ్యవస్థను దేశవ్యాప్తంగా అమలు చేస్తామని.. రైల్వే భద్రత కోసం ఎన్నో సంస్కరణలు చేపట్టినట్లు తెలిపారు. ఇండియన్ రైల్వే కోసం 2.52 లక్షల కోట్లను కేంద్ర బడ్జెట్‌లో కేటాయించినట్లు తెలిపారు. తెలంగాణలో 1,026 కిలోమీటర్ల మేరకు కవచ్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. 2026 నాటికి దేశమంతటా కవచ్ టెక్నాలజీ అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇందులో భాగంగా సికింద్రాబాద్‌లో కవచ్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేస్తామని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ నుంచి ఐదు వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయని ఆయన అన్నారు. రాష్ట్రంలో అన్ని రైల్వే లైన్ల విద్యుదీకరణ పనులు పూర్తయ్యాయని ఆయన తెలియజేశారు. పేదల కోసం తాము నమో భారత్ రైళ్లను నడుపుతున్నామని, త్వరలో దేశమంతటా దాదాపు వంద నమో భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన వెల్లడించారు. రైల్వేబడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు రూ.9,417 కోట్లు కేటాయింపులు జరిగాయని తెలిపారు. ఏపీలో రూ.84,559 కోట్ల పనులు నిర్మాణంలో ఉన్నాయని వివరించారు.. అలాగే.. ఏపీలో 73 రైల్వేస్టేషన్లు అభివృద్ధి చేస్తున్నామని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. 1560 కి.మీ.కొత్త రైల్వేలైన్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఏపీకి యూపీఏ హయాం కంటే.. ఎక్కువ నిధులను కేటాయించినట్లు తెలిపారు. ఏపీకి 11 రెట్ల కేటాయింపులు పెరిగాయని వివరించారు. ఇక రైల్వే బడ్జెట్‌లో తెలంగాణకు రూ.5337 కోట్లు నిధులు మంజూరు చేశామని అశ్విని వైష్ణవ్ తెలిపారు. కాజీపేటలో రైల్వేప్రొడక్షన్ యూనిట్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటి వరకు తెలంగాణకు రూ.41,677 కోట్లు మంజూరు చేసినట్టు చెప్పారు. తెలంగాణ వ్యాప్తంగా 1326కి.మీ కవచ్ టెక్నాలజీ పనిచేస్తోందని తెలిపారు.

# పిల్లల భవిష్యత్తును ఆప్ నాశనం చేస్తోంది



**న్యూఢిల్లీ:** విద్యార్థుల భవిష్యత్తు కంటే సొంత ప్రతిష్టను పెంచుకునేందుకే ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తును ఆప్ నాశనం చేస్తోందని అన్నారు. ఢిల్లీ విద్యార్థులతో మోదీ సోమవారంనాడు ముఖాముఖీ సంభాషించారు. ఆప్ విద్యా విధానంపై విమర్శలు గుప్పించారు. "తొమ్మిదవ తరగతి దాటి చదివేందుకు ఢిల్లీ పాఠశాలల్లో విద్యార్థులను వాళ్లు (ఆప్ ప్రభుత్వం అనుమతించడం లేదని విన్నాను. పాస్ గ్యారెంటీ అనుకున్న వాళ్లనే పైతరగతులకు పంపిస్తున్నారని తెలిసింది. సరైన రిజల్ట్స్ రాకపోతే ప్రభుత్వం పరువు పోతుందని వారు భావిస్తున్నారు. ఇది విద్యావ్యవస్థలో నిజాయితీ లోపించడమే అవుతుంది" అని విద్యార్థులతో ప్రధాని అన్నారు. 9,11 తరగతుల్లో ఫెయిలవుతున్న విద్యార్థుల సంఖ్య అధికంగా ఉందంటూ గతంలో పలు కథనాలు వచ్చిన నేపథ్యంలో ప్రధాని వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

**అభివృద్ధి గాలులు వీస్తున్నాయి..**

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రం ముగియనుండటంతో ప్రధానమంత్రి గత కొద్దిరోజులుగా వరుస ర్యాలీల్లో పాల్గొంటూ ప్రజలు మార్పు కోరుకుంటున్నారంటూ ప్రచారం సాగించారు. ఆదివారంనాడు ఆర్కే పురం ర్యాలీలో వసంత పంచమి రాకతో వాతావరణంలో కొత్త ఉత్సాహం కనిపిస్తోందని, ఢిల్లీలో మరికొద్ది రోజుల్లో అభివృద్ధి గాలులు వీచనున్నాయని అన్నారు. ఈసారి ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం రాబోతోందన్నారు. ఆప్ ప్రభుత్వం 11 ఏళ్లు వృథా చేసిందని, ఢిల్లీ ప్రజలకు సేవ చేసే ఒక్క అవకాశం తమకు ఇవ్వాలని ఆయన కోరారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఎలాంటి సమస్య పరిష్కారానికైనా తాను వెనుకాడేదని లేదని హామీ ఇచ్చారు. ఢిల్లీలో డబుల్ ఇంజన్ ప్రభుత్వం వస్తే ప్రతి పేద, మధ్యతరగతి కుటుంబాల్లో వెలుగులు నిండుతాయని అన్నారు. ఒక్క మురికివాడను కూడా కూల్చే ప్రసక్తి లేదని, మురికివాడల్లో నివసించే వారికి కేవలం రూ.5కే పూర్తి పోషకాహారం అందిస్తామని, ఆటోడ్రైవర్లు, డొమెస్టిక్ వర్కర్ల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, ప్రస్తుతం అమల్లో ఉన్న పథకాలను కొనసాగస్తామని హామీ ఇచ్చారు. 70 మంది సభ్యులున్న ఢిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరి 5న పోలింగ్ జరుగనుండగా, ఫిబ్రవరి 8న ఫలితాలు వెలువడతాయి.

# 'శీష్ మహల్'ను తెరుస్తాం: అమిత్‌షా



న్యూఢిల్లీ: కోట్లాది రూపాయల ప్రజాధనంతో అరవింద్ కేజ్రీవాల్ నిర్మించిన "శీష్ మహల్" ను ప్రజా సందర్శన కోసం తెరుస్తామని కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా హామీ ఇచ్చారు. రూ.51,000 కోట్ల ప్రజాధనంతో అద్దాలమేడ (శీష్ మహల్)ను కేజ్రీవాల్ నిర్మించారని అన్నారు. జాంగ్‌పుర అసెంబ్లీ నియోజకవర్గంలో సోమవారంనాడు జరిగిన ఎన్నికల ర్యాలీలో అమిత్‌షా మాట్లాడుతూ, కేజ్రీవాల్‌కు ఒక ఇల్లుతో సంతృప్తి లేకనే 'అద్దాలమేడ' నిర్మించుకున్నారని చెప్పారు. "ముఖ్యమంత్రి అయ్యాక ఇల్లు కానీ, కారు కానీ, సెక్యూరిటీ కానీ తీసుకోనని 2013లో కేజ్రీవాల్ చెప్పారు. అయితే ఆ తర్వాత కారు, బంగ్లా తీసుకున్నారు. ఒక బంగ్లాతో ఆయనకు తృప్తి కలగలేదు. దాంతో శీష్ మహల్ నిర్మించారు. అందుకైన రూ.51,000 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయి? అదంతా ఢిల్లీ ప్రజలకు చెందిన సొమ్ము. శీష్ మహల్‌ను ప్రజాసందర్శన కోసం ఉంచుతామని నేను వాగ్దానం చేస్తున్నారు. కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడిన కేజ్రీవాల్‌కు తిరిగి ఓటు వేసి అధికారం కట్టబెట్టాలా?" అని అమిత్‌షా ప్రశ్నించారు.

ప్రతాప్‌గంజ్ ప్రజలను మోసం చేసిన సిసోడియా

ప్రతాప్‌గంజ్ ప్రజలను మాజీ ఉమ ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా మోసం చేశారని అమిత్‌షా ఆరోపించారు. తప్పుడు వాగ్దానాలతో ప్రజలను మోసం చేయడంతో ఎక్కడ ప్రజలు నిలదీస్తారో అనే భయంతో ఆయన ప్రతాప్ గంజ్ నియోజకవర్గాన్ని వదిలిపట్టి జాంగ్‌పురకు వెళ్లిపోయారని అన్నారు. ఇదే సిసోడియా డిప్యూటీ సీఎంగా ఆలయాలు, స్కూళ్లు, గురుద్వారాల సమీపంలో లిక్కర్ దుకాణాలు తెరిపించారని, దేశంలోనే ఒక లిక్కర్ స్కామ్‌లో జైలుకు వెళ్లిన ఏకైక విద్యాశాఖ మంత్రి ఆయనేనని విమర్శించారు. బడే మియా (కేజ్రీవాల్) చోటో మియా (సిసోడియా) కలిసి ఢిల్లీ ప్రజలను వంచించారని అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సోమవారంతో ముగియనుంది. ఫిబ్రవరి 5న పోలింగ్ జరుగనుండగా, ఫిబ్రవరి 8న ఫలితాలు వెలువడతాయి.

# సీఈసీకి బీజేపీ ఆఫర్ : కేజ్రీవాల్ తీవ్ర వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ:** అసెంబ్లీ ఎన్నికల ప్రచారం మరి కొద్ది గంటల్లోనే ముగియాల్సి ఉన్న తరుణంలో భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్‌పై ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సంచలన ఆరోపణలు చేశారు. బీజేపీకి సీఈసీ లొంగిపోవడం చూస్తుంటే ఎన్నికల కమిషన్ తన అస్థిత్వం కోల్పోయినట్టు కనిపిస్తోందని అన్నారు. ఈ నెలాఖరులతో సీఈసీ రిటైర్ అవుతుండటంతో ప్రజల మనసుల్లో ఇలాంటి ఎన్నో ప్రశ్నలు తలెత్తుతున్నాయని చెప్పారు. "రిటైర్మెంట్ తరువాత ఆయనకు ఏ పోస్ట్ ఆఫర్ చేశారు, గవర్నర్ పోస్టా, రాష్ట్రపతి పోస్టా? ఏ పోస్ట్ కావచ్చు?" అని మీడియాతో మాట్లాడుతూ కేజ్రీవాల్ అన్నారు. "రాజీవ్ కుమార్‌ను ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాను. మీ బాధ్యతలను మీరు న్యాయబద్ధంగా నిర్వర్తించండి. పదవి కోసం పాకులాడవద్దు. మీ పదవీకాలం చివర్లో దేశాన్ని, దేశ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయవద్దు" అని కేజ్రీవాల్ కోరారు. న్యూఢిల్లీ నియోజకవర్గంలో డబ్బులు పంచుతున్నారంటూ బీజేపీ ప్రత్యర్థి పర్వేష్ వర్మపైన కేజ్రీవాల్ ఇటీవల ఆరోపించారు. ఇంత జరుగుతున్నా ఎన్నికల కమిషన్ చేష్టలుడిగి చూస్తోందని అన్నారు. ఆప్ కార్యకర్తలను ప్రచారం చేయకుండా బీజేపీ అడ్డుకుంటోందని, దాడులు చేస్తోందని ఆరోపించారు. న్యూఢిల్లీ నియోజకవర్గానికి ప్రత్యేక పరిశీలకులను నియమించాలని ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశారు. న్యూఢిల్లీ నియోజకవర్గంలో త్రిముఖ పోటీ ఉంది. ఆప్ అభ్యర్థిగా కేజ్రీవాల్ పోటీలో ఉండగా, బీజేపీ నుంచి పర్వేష్ వర్మ, కాంగ్రెస్ నుంచి సందీప్ దీక్షిత్ పోటీ పడుతున్నారు.



ఢిల్లీలోని 70 అసెంబ్లీ స్థానాలకు ఫిబ్రవరి 5న పోలింగ్ జరుగనుండగా, ఫిబ్రవరి 8న ఫలితాలు వెలువడతాయి.

## నా అమెరికా పర్యటనపై రాహుల్ వ్యాఖ్యలు నిరాధారం



**న్యూఢిల్లీ:** డొనాల్డ్ ట్రంప్ ప్రమాణస్వీకారానికి ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించాలని కోరేందుకు గత డిసెంబర్‌లో తాను అమెరికా వెళ్లినట్టు రాహుల్ గాంధీ లోక్‌సభలో చేసిన వ్యాఖ్యలను కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ ఖండించారు. రాహుల్ మాటల్లో ఎంతమాత్రం వాస్తవం లేదన్నారు. ఉద్దేశపూర్వకంగానే ఆయన అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని తప్పుపట్టారు. "2024 డిసెంబర్‌లో నా అమెరికా పర్యటనపై విపక్ష నేత అవాస్తవాలు మాట్లాడారు. బైడెన్ అడ్మినిస్ట్రేషన్ లోని సెక్రటరీ, ఎన్ఎస్ఏను కలిసేందుకు వెళ్లాను. ఆ తర్వాత మన కాన్సుల్ జనరల్ సమావేశానికి అధ్యక్షత వహించాను. ఏ దశలోనూ ప్రధానమంత్రికి ఆహ్వానం విషయంపై చర్చ జరగలేదు. మన ప్రధాని సహజంగా అలాంటి ఈవెంట్లకు వెళ్లరనే విషయం అందరికీ తెలిసిందే. ప్రత్యేక ప్రతినిధులనే భారత్ పంపుతుంటుంది. రాహుల్ రాజకీయ ఉద్దేశాలతో ఇలాంటి వ్యాఖ్యలు చేసి ఉండొచ్చు. కానీ ఇలాంటి వ్యాఖ్యలు విదేశాల్లో మన దేశ ప్రతిష్టకు భంగం కలిగిస్తాయి" అని జైశంకర్ అన్నారు.

**రాహుల్ ఏమన్నారు?**

రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, ట్రంప్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి నరేంద్ర మోదీని ఆహ్వానించాల్సిందిగా కోరేందుకు విదేశాంగ మంత్రి పలుమార్లు అమెరికా వెళ్లారని అన్నారు. మనకంటూ ఒక ఉత్పత్తి వ్యవస్థ, సొంత టెక్నాలజీ ఉంటే అమెరికా అధ్యక్షుడే ఇక్కడకు వచ్చి ప్రధానిని ఆహ్వానిస్తారని వ్యాఖ్యానించారు. దేశంలో ఉత్పత్తి, సాంకేతికరంగాలపై భారత్ పూర్తి స్థాయి దృష్టి పెట్టాలని చెబుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

**తప్పుపట్టిన కిరణ్ రిజిజు**

రాహుల్ గాంధీ వ్యాఖ్యలను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తప్పుపట్టారు. దేశ ప్రధాని గురించి ప్రతిపక్ష నేత ఇలాంటి నిరాధార ఆరోపణలు ఎలా చేస్తారని ప్రశ్నించారు. రెండుదేశాల మధ్య సంబంధాలకు చెందిన అంశంపై సరైన నిర్ధారణ లేకుండా మాట్లాడటం సరికాదన్నారు. దీనికి వెంటనే రాహుల్ సమాధానిమిస్తూ "మీ ప్రశాంతతకు భంగం కలిగించినందుకు క్షమాపణ చెబుతున్నాను" అన్నారు.

## దేశంలో మకాం వేసిన చైనా



**న్యూఢిల్లీ:** ఉత్పత్తి ఆధారిత దేశంగా భారత్ విఫలమై దానిని చైనాకు అప్పగించిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. 'మేక్ ఇన్ ఇండియా' ఆలోచన మంచిదే అయినా దానిని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై లోక్‌సభలో సోమవారంనాడు చర్చ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ, ఉత్పత్తి రంగంలో భారత్ నిలదొక్కుకోలేకపోయిందని, అందువల్లే చైనా ఇక్కడ మకాం వేసిందని అన్నారు. ఇప్పటికైనా తయారీ రంగంపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాల్సి ఉందన్నారు. సమాజంలో సామాజిక ఉద్రిక్తతలు పెరుగుతున్నాయని తెలిపారు. చైనా దిగుమతుల ప్రభావంపై భారతీయ యువత ఆందోళనకు కారణమవుతోందని, ఇందువల్ల ఎదురయ్యే సమస్యలను గుర్తెరిగి ఉత్పత్తిరంగంపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. 'మేక్ ఇన్ ఇండియా' ఐడియా మంచిదే అయినా దాని ఫలితం కళ్లముందే ఉందన్నారు. 2014లో జీడీపీలో 15.3 శాతంగా ఉన్న మ్యాన్యుఫ్యాక్చరింగ్.. ఇవాళ 12.6 శాతంగా ఉందని, గత 60 ఏళ్లలో ఇది అత్యంత కనిష్టమని చెప్పారు. ప్రధానమంత్రిని తాను తప్పుపట్టడం లేదని, ఆయన ప్రయత్నించడం లేదని కూడా చెప్పనని, ఆయన ప్రయత్నించినా విఫలమయ్యారని చెప్పగలనని అన్నారు. చైనా జోక్యంపై రాహుల్ మరింత వివరిస్తూ, ప్రస్తుతం ఇండియాలో చైనీయులు ఉన్నారని, కానీ ప్రధాని దానిని తోసిపుచ్చుతున్నారని, అయితే ప్రధాని వాదనపై ఆర్మీ ఏకీభవించడం లేదని అన్నారు. "మొబిలిటీలో మార్పులకు నాలుగు టెక్నాలజీలు ప్రధానం. ఎలక్ట్రిక్ మోటార్స్, బ్యాటరీస్, ఆప్టిక్స్, వాటన్నింటికంటే టాప్‌లో ఏఐ ఉంటాయన్నారు. ఏఐ గురించి మాట్లాడేటప్పుడు అది సొంత ఏఐ కాకపోతే దానికి అర్థం లేదు. ఎందుకంటే అది డాటాపై ఆపరేట్ అవుతుంది. ఇవాళ మనం డాటాను చూస్తే, ప్రొడక్షన్ సిస్టమ్ నుంచి వచ్చే ప్రతి సింగిల్ డాటా చైనాదే" అని రాహుల్ అన్నారు.దేశంలోని యువతకు ఉద్యోగాలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వలేకపోతోందని రాహుల్ అన్నారు. రాష్ట్రపతి ప్రసంగం ప్రతి ఏటా ఒకేలా ఉంటోందని కూడా ఆయన వ్యాఖ్యానించారు.

## ఆ ప్రభుత్వం వాహనదారులకు షాక్.. ఇలా చేస్తే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు!



ట్రాఫిక్ నిబంధనలపై బెంగళూరు ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పిస్తూనే ఉన్నారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. అయితే కొందరు ట్రాఫిక్ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. అలాంటి వారిపై బెంగళూర్ ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝులిపిస్తున్నారు. ట్రాఫిక్ జామ్ కారణంగా ఫుట్‌పాత్‌పై వెళ్లే వారిపై కొత్త అస్త్రాన్ని ప్రయోగించాలని నిర్ణయించారు. అలాగే ఫుట్‌పాత్‌లపై వాహనాలు నడిపే వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్‌ను సస్పెండ్ చేయాలని పోలీసులు నిర్ణయించారు. పాదచారుల భద్రత కోసం ట్రాఫిక్ పోలీసులు ఈ నిబంధనను అమలు చేశారు. గతంలో ఫుట్‌పాత్‌లపై వాహనాలు నడిపితే ట్రాఫిక్ పోలీసులు జరిమానా విధించేవారు. జరిమానా విధించినప్పటికీ, వాహనదారులు మాత్రమే మళ్లీ ఫుట్‌పాత్‌లపైనే నడుపుతున్నారు. దీంతో బెంగళూరు ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులు సమావేశమై డ్రైవింగ్ లైసెన్స్‌ను సస్పెండ్ చేయాలని నిర్ణయించారు. మొదటిసారి నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా విధిస్తారు. పదే పదే పట్టుబడితే లైసెన్స్ సస్పెండ్ చేయనున్నట్లు ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. అందుకే ఇక నుంచి ఫుట్‌పాత్‌పై డ్రైవింగ్ చేసే ముందు ఆలోచించాలని ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నారు. అయితే ఫుట్‌పాత్‌పై ఎక్కువగా బైక్‌లను నడుపుతున్నట్లు గుర్తించారు ట్రాఫిక్ పోలీసులు.

**రూ.80 లక్షల జరిమానాల వసూలు:**

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ట్రాఫిక్ పోలీసుల ఆపరేషన్ కొనసాగింది. జనవరి 27 నుండి ఫిబ్రవరి 2 వరకు పట్టుబడిన వారి నుంచి వసూలైన మొత్తం రూ. 80 లక్షలు. బెంగళూరులోని 50 ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లలో తనిఖీలు జరిగాయి. గత వారంలో 800 వాహనాలను సీజ్ చేసినట్లు ట్రాఫిక్ పోలీస్ జాయింట్ కమిషనర్ ఎంఎన్ అనుచేత్ తెలిపారు.

# ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేలా చర్యలు

-మొదటిపేజీ తరువాయి

వారీగా జరిగిన నష్టంపై 16వ ఆర్థిక సంఘానికి సీఎం చంద్రబాబు ప్రజంటేషన్ ఇచ్చారు. దక్షిణాది రాష్ట్రాల్లో ప్రస్తుతం ఏపీ తక్కువ జీడీపీ ఉండటం, దానికి గల కారణాలపై కూడా ప్రజంటేషన్‌లో వివరించారు. ఇటీవల నీతి ఆయోగ్ ఇచ్చిన ఆర్థిక ఆరోగ్య నివేదికలో ఆంధ్రప్రదేశ్ పరిస్థితి గురించి చెప్పిందని, రాష్ట్రం అప్పు తిరిగి చెల్లించే స్థితిలో లేదని నివేదించిందని చంద్రబాబు గుర్తుచేశారు.

ఏపీ చాలా నష్ట పోయింది..

2014-19 మధ్య అభివృద్ధికి, ఆ తర్వాత ఐదేళ్లలో చోటు చేసుకున్న దుష్పరిపాలనతో పొంతన లేకుండా పోయిందని, రాష్ట్రం చాలా నష్ట పోయిందని ప్రజంటేషన్‌లో చంద్రబాబు తెలిపారు. 2019-24 మధ్య జరిగిన ఆర్థిక విధ్వంసంపై ప్రత్యేకంగా ప్రజంటేషన్‌లో సీఎం చంద్రబాబు వివరించారు. దీని కారణంగా.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై చూపుతున్న ప్రభావం గురించి ప్రత్యేకంగా సీఎం చంద్రబాబు వివరించారు. గత ఐదేళ్లలో రూ.10 లక్షల కోట్ల అప్పులు తీసుకువచ్చారని, దానికి తోడు మరో రూ. లక్షన్నర కోట్లకు పైగా... పెండింగ్ బిల్లులు పెట్టిపోయారని చంద్రబాబు తెలిపారు. ఈ పరిణామాల నుంచి రాష్ట్రాన్ని ఆర్థికంగా గట్టెక్కించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా ప్రజంటేషన్‌లో చంద్రబాబు పేర్కొన్నారు. పోర్టులు, లాజిస్టిక్ పార్కులు, పరిశ్రమలు వచ్చేందుకు అనువైన వాతావరణాన్ని ఎలా తయారు చేస్తోంది. పోర్టు ఆధారిత అభివృద్ధికి ఉన్న మార్గాలపై కూడా వివరించి అందుకు సహకరించాలని కోరారు.

కేంద్రం నుంచి ఏపీకి నిధులు ఎలా తెచ్చుకోవాలో మాకు తెలుసు అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఏపీ పేరు ప్రస్తావించలేదన్న ప్రతిపక్షాల విమర్శలపై సీఎం స్పందించారు. పేరు ప్రస్తావించనంత మాత్రాన రాష్ట్రానికి నిధులు రానట్లు కాదన్నారు. కొన్ని పథకాలకు ఎప్పటిలాగే నిధులు కేటాయించారని చెప్పారు. "కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన పథకాల నిధులను గరిష్ఠంగా ఉపయోగించుకునే అవకాశం ఏపీకే ఉంది. ఈ మేరకు ఇదివరకే మేం ఆయా రంగాల్లో పాలసీలు తీసుకొచ్చాం. విభజన కన్నా వైకాపా పాలనలోనే రాష్ట్రానికి ఎక్కువ నష్టం జరిగింది. ఈ రెండు అంశాలను ఆర్థిక సంఘానికి వివరించి నిధులు కోరతాం" అని చంద్రబాబు తెలిపారు.

భారత్ అభివృద్ధిని ప్రపంచదేశాలు గమనిస్తున్నాయని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఇటీవల దావోస్ పర్యటనలోనూ దీన్ని గమనించానని చెప్పారు. గతంలో ఐటీపై, ఇప్పుడు ఏఐపై దృష్టి పెరిగిందన్నారు. ఏఐ సాంకేతికతలో భారత్ ముందుందని చెప్పారు. ప్రపంచ దేశాల్లో మన దేశం పేరు మార్మోగుతోందన్నారు.




"2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ నిలుస్తుంది. వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయి. మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. పన్ను సంస్కరణల్లో చాలా మార్పులు జరిగాయి. విద్యుత్ రంగంలో సంస్కరణలు ప్రథమంగా ఏపీలోనే జరిగాయి. ఎంఎస్ఎంఈ పాలసీ గేమ్‌ఛేంజర్‌గా మారబోతోంది. దేశంలో పెట్టుబడులకు చాలా మంది ముందుకొస్తున్నారు. పలు రంగాల్లో భారీగా పెట్టుబడులు రాబోతున్నాయి. నూతన ఆవిష్కరణలతో పాటు మౌలిక సదుపాయాల కల్పన పెరుగుతోంది. వృద్ధిరేటు పెంచేలా ఈ బడ్జెట్ ఉంది. ప్రపంచ వ్యాప్తంగా వాణిజ్యవేత్తల్లో భారతీయులే ప్రముఖంగా ఉంటున్నారు.

సమ్మిళిత వృద్ధితోనే అభివృద్ధి సాధ్యం. ఎవరికి ఓట్లు వేస్తే మంచి జరుగుతుందో ఆలోచించాలి. దిల్లీలో వాతావరణ కాలుష్యంతో పాటు రాజకీయ కాలుష్యం కూడా ఉంది. అభివృద్ధికి దిల్లీ ఆమడ దూరంలో ఆగిపోయింది. సమస్యల వలయంలో చిక్కుకుంది. అభివృద్ధి కావాలంటే భాజపాకు ఓట్లు వేయాలి. దిల్లీలో భాజపా గెలుపు.. దేశ ప్రగతికి మలుపు. సంపద దోచుకునేవాళ్లు కాదు.. పంచేవాళ్లు కావాలి. విభజనతోనే కాదు.. గత ప్రభుత్వ విధ్వంస విధానాలతో ఏపీ పూర్తిగా దెబ్బతింది. విధ్వంసంతో దెబ్బతిన్న రాష్ట్రానికి చేయూతనివ్వాలని కేంద్రాన్ని కోరుతున్నా. మన పరిపాలన బాగుంటే కేంద్రం చేయూత ఇస్తుంది. అప్పుడు ఏపీ అభివృద్ధి పరుగులు తీస్తుంది. అన్ని రంగాల్లో జరిగిన విధ్వంసాన్ని ఇప్పుడిప్పుడే చక్కదిద్దుతు న్నాం అని చంద్రబాబు అన్నారు.

**ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేలా చర్యలు..**

పోర్టు ఆధారిత, పరిశ్రమల ఆధారిత అభివృద్ధి ఎలా చేయాలన్న దానిపై ఇరువురు నేతలు కీలకంగా చర్చించారు. డీప్ టెక్నాలజీ, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ ఎనర్జీ, ఏఐకు సంబంధించిన విషయాలను ఎలా ఉపయోగించుకోవాలనే విషయాలపై ప్రజంటేషన్‌లో సవివరంగా సీఎం చంద్రబాబు చెప్పారు. తిరిగి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరిస్తూనే... అన్ని అంశాల్లో ఆర్థిక సంఘం కూడా తగిన సహకారం ఇవ్వాలని కోరారు. ప్రజంటేషన్ అనంతరం చాలా అంశాలపై చంద్రబాబు, అరవింద్ పనగడియా చర్చించారు. దేశంలో ఆర్థిక వ్యవస్థలను బలోపేతం దిశగా తీసుకువెళ్లడంలో చంద్రబాబు తీసుకున్న చర్యల గురించి అరవింద్ పనగడియా ప్రస్తావించారు.

**పోర్టుల ద్వారానే ఎక్కువ ఆదాయం..**

ప్రస్తుతం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఏడు రాష్ట్రాలు పోర్టుల ద్వారానే ఎక్కువ ఆదాయం సాధిస్తున్నారని, తెలంగాణ మాత్రమే అందుకు భిన్నంగా ఉందని ఇరువురి మధ్య చర్చించారు. తెలంగాణ కూడా ఎక్కువగా హైదరాబాద్ ఆధారంగానే అభివృద్ధి పథంలో ఉందని, గతంలో చేపట్టిన చర్యలు హైదరాబాద్‌ను ప్రపంచానికి అనుసంధానం చేశాయని పనగడియా పేర్కొన్నారు. బిల్ గేట్స్ హైదరాబాద్ రావడం, దాని కొనసాగింపుగా.. చాలా ప్రపంచ సంస్థలు ఎలా హైదరాబాద్‌కు అనుసంధానం అయ్యాయన్న విషయాను ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆర్థిక వ్యవహారాల్లో గుజరాత్, మహారాష్ట్ర మోడల్స్‌తో పాటు సంయుక్త ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన ప్రయోగంలో హైదరాబాద్ మోడల్ ఎలా విజయవంతం అయిందో ఇరువురి మధ్య చర్చ జరిగింది. వీటితో పాటు 2014-19 మధ్య స్వచ్ఛ భారత్, డిజిటల్ కరెన్సీ వంటి విషయాల్లో చంద్రబాబు ఇచ్చిన నివేదికలు, ప్రస్తుతం వాటి ఫలితాలను చర్చ సందర్భంగా అరవింద్ పనగడియా ప్రస్తావించారు.

# క్రాస్ రోడ్స్‌లో జగన్



**కడప :** గత ఎన్నికల్లో ఘోర ఓటమి. కుదురుకునే లోపు ఒక్కొక్కరుగా నేతల జంప్. నా అనుకున్న వారు దూరం కావటంతో వైసీపీ అధినేత జగన్.. ఆలోచనలో పడ్డారట. కీలకనేతల రాజీనామాలతో.. పార్టీలో స్తబ్ధత నెలకొందట. వచ్చే ఎన్నికల్లో విజయం ఖాయమని క్యాడర్‌కు భరోసా ఇస్తుంటే.. పార్టీ నడిపించటంలో తనకు తోడుగా ఉన్న ప్రముఖులు వీడటంతో వైసీపీ అధినేత ఇరకాటంలో పడ్డారట. విదేశీ పర్యటన ముగించుకుని.. స్వదేశానికి తిరిగొచ్చిన ఫ్యాన్ పార్టీ అధినేత.. రూట్ మ్యాప్ ఏంటనే చర్చ జోరుగా సాగుతోంది. పార్టీని వీడిన నేతల మాటెలా ఉన్నా.. ఉన్నవారిని ఆయన ఎలా కాపాడుకుంటారోననే సస్పెన్స్ నెలకొంది.వైసీపీకి కీలకనేతల.. వరుస రాజీనామాలు షాక్ ఇస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో కీలకంగా వ్యవహరించిన వారంతా సొంతదారి వెతుక్కోవటం.. జఅఖని షేక్ చేస్తోందట. ఫలితాల అనంతరం సైలెంట్ అయిపోయిన లీడర్లు, క్యాడర్.. ఇప్పుడిప్పుడే కోలుకుని బయటకు వస్తున్న తరుణంలో.. నేతల రాజీనామాలు పెద్దదెబ్బగా మారాయట. గత ఎన్నికల ఫలితాలు డిజాస్టర్‌గా మారినా.. రాజ్యసభలో తమకున్న బలంతోనే నెట్టుకురావచ్చని భావించిన జగన్‌కు.. విజయసాయిరెడ్డి రూపంలో మరో షాక్ తగిలిందని రాజకీయ నిపుణులు చర్చించుకుంటున్నారు. పార్టీకి పెద్దగా ఉన్న వారే ఒక్కొక్కరుగా బయటకు వచ్చేస్తుండటం.. శ్రేణుల్లో అలజడి రేపుతోందట. కోలుకోలేని దెబ్బతిన్న వైసీపీకి.. తిరిగి కంబ్యాక్ తెచ్చేందుకు జగన్ నానా తంటాలు పడుతున్నారని టాక్ నడుస్తోంది.ఎంతమంది నేతలు పార్టీని వీడినా జగన్ మాత్రం ధైర్యంగా ఉన్నారు. పార్టీని రీసెట్ చేసే కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. ఇప్పుడిప్పుడే పార్టీ కార్యకర్తలు కూడా బయటకు రావటం.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేయటంతో.. కాస్తో కూస్తే బెటర్ పొజిషన్ ఉందట. దీంతో మాజీమంత్రులతో పాటు చాలామంది నేతల ప్రెస్‌మీట్‌లతో కాస్త నయం అనుకున్న సమయంలో.. విజయసాయిరెడ్డి రాజీనామా ప్రకటన ఆ పార్టీని ఇరకాటంలో పడేసిందట. తాను మాత్రం జగన్‌కు అన్నీ చెప్పి బయటకు వచ్చానని సాయిరెడ్డి చెబుతున్నా.. పార్టీ అధినేత లేని సమయంలో.. నెంబర్ టూగా చెలామణీ అయిన నేత.. తప్పుకోవటంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.రాజ్యసభలో వైసీపీకి.. 11 మంది సభ్యుల బలం ఉంది. కేంద్రంలో బీజేపీకి అవసరమైన సమయాల్లో ఆ పార్టీ మద్దతు ఇస్తూ వస్తోంది. కొద్ది రోజుల క్రితం వైసీపీ నుంచి ఆరేడుగురు మంది రాజ్యసభ సభ్యులు రాజీనామాలు చేయబోతున్నారనే ప్రచారం జరిగింది. ఆ ప్రచారానికి బలం చేకూరుస్తూ ఎంపీలు మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్ రావు, ఆర్.కృష్ణయ్య రాజీనామాలు చేసి.. తమ గూడు తాము వెతుకున్నారు. తాజాగా వైసీపీ కీలకనేత, ఎంపీ విజయసాయిరెడ్డి రాజీనామా ప్రకటన ఆ పార్టీలో కలకలం రేపింది. రాజ్యసభ సభ్యుడిగా, వైసీపీ కీలక నేతగా, విశాఖ రాజకీయాల్లో చక్రం తిప్పిన నాయకుడిగా.. సాయిరెడ్డి పేరు తెచ్చుకున్నారు.అందులో మంచి కంటే, చెడు ఎక్కువ ఉందనేది బహిరంగ రహస్యమేననే టాక్ ఉంది. సోషల్ మీడియా వేదికగా.. ప్రత్యర్థులపై రాజకీయ విమర్శలు చేయడంలోనూ? ఆ క్రమంలో చీవాట్లు తినడంలోనూ విజయసాయిరెడ్డికి సాటి ఇంకెవరూ లేరని పొలిటికల్ వర్గాల్లో చర్చ సాగుతోంది. సడెన్‌గా ఏమైందో కానీ.. వైసీపీని వీడారు విజయసాయిరెడ్డి. గత ఎన్నికల్లో నెల్లూరు నుంచి లోక్ సభకు పోటీ చేసి ఓడిపోయారాయన. తర్వాత కూడా పార్టీలో యాక్టివ్‌గానే ఉన్నా.. సీపీని వీడతారంటూ ప్రచారం జరిగింది. దానిని ఎవరూ నమ్మకపోయినా.. వన్ ఫైన్ డే ఆయన తాను రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు.పార్టీ అధినేత జగన్.. లండన్ పర్యటనలో ఉన్న సమయంలో విజయసాయిరెడ్డి రాజీనామా చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆయన బాటలోనే మరో ఎంపీ వైసీపీకి రాజీనామా చేయబోతున్నారంటూ ప్రచారం సాగుతోందట. రాజ్యసభ సభ్యుడు అయోధ్యరామిరెడ్డి కూడా వైసీపీకి గుడ్ బై చెప్పబోతున్నారనే ప్రచారం జరిగినా.. ఆయన అలాంటిదేమీ లేదని క్లారిటీ ఇచ్చారు. కానీ జయసాయిరెడ్డి, ఆయోధ్య రామిరెడ్డి సన్నిహితులు కావడంతో ఆయన కూడా రాజీనామా చేసే అవకాశాలు లేకపోలేదని రాజకీయవర్గాల్లో టాక్ నడుస్తోంది. గత ఎన్నికల ముందు వరకు వైసీపీలో కీలకంగా వ్యవహరించిన బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆళ్ల నాని వంటి నేతలు కూడా దూరమయ్యారు. ధర్మాన ప్రసాదరావు వంటి నేతలు సైలెంట్ అయ్యారు. కొడాలి నాని.. ఇంకా అజ్ఞాతం వీడలేదు. దీంతో.. పార్టీలో అసలేం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొందట.గతంలో పార్టీ నుంచి అన్నీ ప్రయోజనాలు పొంది. కష్టకాలంలో ఉండాల్సిన నేతలు ఒక్కొక్కరుగా దూరం కావడంపై క్యాడర్ మాత్రం మండిపడుతోందట. కార్యకర్తలకు అండగా ఉంటూ భరోసా ఇవ్వాల్సిన నేతలు వ్యక్తిగత కారణాలతో పార్టీకి దూరం కావటం సరైన నిర్ణయం కాదనే అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయట. మరోవైపు పార్టీని వీడుతున్న నేతలపై జగన్ గతంలోనే స్పందించారు. పోయేవారిని పోనీయండి.. ఉండేవారు ఉంటారు.. వారితోనే రాజకీయం చేస్తానంటూ క్యాడర్‌కు భరోసా ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో మనదే విజయం అంటూ ధైర్యం చెప్పారు.వారి వారి.. వ్యక్తిగత కారణాలతో వెళ్లిపోయే వారిని బుజ్జగించలేమన్నది జగన్ అభిప్రాయంగా తెలుస్తోంది. బాలినేని శ్రీనివాసరెడ్డి రాజీనామా సమయంలోనూ ఇదే తరహాలో లైట్ తీసుకున్న జగన్.. ఇప్పుడు విజయసాయిరెడ్డి వ్యవహారాన్ని కూడా అలాగే లైట్ తీసుకుంటారా అనేది చర్చనీయాంశంలా మారింది.రాజీనామా ప్రకటనలో జగన్‌ను.. ఒక్క మాట కూడా అనని విజయసాయిరెడ్డి.. తాను రాజకీయాల నుంచి పూర్తిగా తప్పుకుంటున్నట్లు ప్రకటన చేశారు. గతంలో ఉన్న కేసులకు తోడు కాకినాడ పోర్టు వంటి కొత్త కేసులు జత కావటం రాజకీయంగా నిర్వేదానికి గురై..ఇలాంటి నిర్ణయానికి వచ్చి ఉంటారని చాలామంది భావిస్తున్నారట. అయితే ఇప్పటికే ఈ అంశంపై జగన్‌కు కచ్చితంగా సమాచారం ఇచ్చే.. తన నిర్ణయాన్ని ప్రకటించి ఉంటారని తెలుస్తోంది. మరి అంశంపై జగన్ రియాక్షన్ ఎలా ఉండబోతోంది. పార్టీలో.. ఈ షాకింగ్.. షేకింగ్‌లను ఆయన ఎలా సెట్ చేస్తారనే ప్రశ్నార్థకంగా మారింది. విదేశీ పర్యటన ముగించుకుని వచ్చిన జగన్.. విజయసాయిరెడ్డి రాజీనామాపై ఎలా స్పందిస్తారోననే ఉత్కంఠ నెలకొంది. మిగిలిన నేతలను కాపాడుకునేందుకు జగన్ ముందున్న వ్యూహాలేంటి అనేది పొలిటికల్ వర్గాల్లో సస్పెన్స్‌గా మారింది.

## ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తాం



-మొదటిపేజీ తరువాయి

వలన లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు తరలివెళ్లారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టాం. కరిక్యులమ్ లో మార్పులు తీసుకురావడంతో పాటు నైతిక విలువలు పెంపొందించేందుకు చర్యలు చేపట్టాం. వైసీపీ హయాంలో విద్యావ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోయింది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలు పడిపోతే అనేక సమస్యలు ఉత్పన్నం అవుతాయి. పాఠశాల విద్యలో సంస్కరణలపై మేం అందరి అభిప్రాయాలు తీసుకున్న తర్వాతనే ముందుకు వెళు తున్నాం. నేను ఏరికోరి విద్యాశాఖను ఎంచుకున్నా. వైసీపీ పాలనలో గందరగోళంగా మారిన విద్యావ్యవస్థను ఛాలెంజ్ గా తీసుకుని పనిచేస్తున్నాం. మేం చిత్తశుద్ధితో చేయాలనే తపనతో ఉన్నాం. విద్యా రంగంలో ప్రైవేటుకు, ప్రభుత్వానికి బాధ్యత ఉంది. అందరం కలిసి విద్యా వ్యవస్థను బలోపేతం చేద్దాం. యువగళం పాదయాత్ర సమయంలో ఉపాధ్యాయుల సమస్యలు అనేకం నా దృష్టికి వచ్చాయి. పాదయాత్రలో హామీ ఇచ్చిన విధంగా ప్రైవేటు పాఠశాలల గుర్తింపు గడువును పదేళ్లకు పెంచుతాం. ప్రైవేటు స్కూల్స్ నిర్వాహకులతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలు తెలుసుకుంటాం" అని చెప్పారు. ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలిప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ ప్రతినిధులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రైవేటు పాఠశాలల గుర్తింపు గడువును పదేళ్లకు పెంచాలని కోరారు. క్యాంపస్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకురావడంతో పాటు ఫైర్ సర్టిఫికెట్, స్ట్రక్చరల్ ఎన్వోసీ, శానిటేషన్ సర్టిఫికెట్ మంజూరును సులభతరం చేయాలని సూచించారు. ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్లకు గుర్తింపు ఇవ్వాలని కోరారు. ప్రీ ప్రైమరీ పాఠశాలలకు గుర్తింపు ఇవ్వడంతో పాటు అర్హత లేని ఉపాధ్యాయులకు డీఎల్ఈడీ చేయడానికి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కరోనా సమయంలో రెండేళ్ల పాటు ప్రైవేటు స్కూల్ బస్సులు నిరుపయోగంగా ఉన్నాయని, వాటి కాలపరిమితి రెండేళ్లు పెంచాలని కోరారు. రాష్ట్రంలో తెలుగు మీడియం ప్రైవేటు పాఠశాలలు 150 వరకు ఉన్నాయని, వాటిని ఇంగ్లీషు మీడియంగా కన్వర్షన్ చేయాలని అభ్యర్థించారు. "బడ్జెట్ స్కూల్స్ కు రుణ సదుపాయం కల్పించాలి. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు కూడా ప్రతిభా పురస్కారాలు అందజేయాలి. ప్రైవేటు స్కూల్స్ ను కేటగిరైజ్ చేసే అంశాలన్ని పరిశీలించాలని సూచించారు. ప్రేవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కూడా శిక్షణ తరగతులు నిర్వహించడంతో పాటు ప్రభుత్వ ఉపాధ్యాయులతో కలిసి క్రీడల్లో పాల్గొనేందుకు అనుమతి ఇవ్వాలి. పదో తరగతిలో తిరిగి గ్రేడింగ్ సిస్టమ్ ను తీసుకురావాలి. ఓపెన్ స్కూల్స్ కు కూడా గుర్తింపు గడువును పదేళ్లకు పెంచాలి. ముంపు మండలాల్లో ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి. ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి. స్కూల్ బస్సుల విషయంలో పన్నుల భారాన్ని తగ్గించాలి" అని కోరారు. ఆయా అంశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు పరుచూరి అశోక్ బాబు, కంచర్ల శ్రీకాంత్, భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, వేపాడ చిరంజీవితో పాటు వివిధ ప్రైవేటు స్కూల్స్ అసిసోయేషన్ ప్రతినిధులు, పాఠశాలల నిర్వాహకులు పాల్గొన్నారు.

## నా పోరాటం ఆగదు.. వారిని వదలను..



**అమరావతి:** వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీకి వచ్చి తన మనోభావాలు చెప్పాలని ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు అన్నారు. ప్రతిపక్ష హోదా స్పీకర్, సీఎం ఇస్తారా? ప్రజలు ఇవ్వాలని చెప్పారు. ఎమ్మెల్యే ఎవరైనా 60 రోజులపాటు లీవ్ అడగకుండా సభకు రాకుంటే.. అనర్హత పడుతుందని అన్నారు. తన కస్టోడియల్ టార్చర్‌లో పీవీ సునీల్ పాత్రపై రఘురామ స్పష్టంచేశారు. ప్రజా ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందని నమ్ముతున్నానని చెప్పారు. దోషులకు శిక్ష పడుతుందనే సంపూర్ణ విశ్వాసం ఉందని అన్నారు. ప్రభుత్వానికి తాను ఒక బాధితుడిగా పిర్యాదు చేశానని రఘురామ తెలిపారు. శాసన సభ్యుడు ఎవరైనా 60 రోజుల పాటు సరైన కారణం చెప్పకుండా అసెంబ్లీకి రాకపోతే అనార్హత వర్తిస్తుందని... అప్పుడు పులివెందులకు ఉపఎన్నికలు వస్తాయని రఘురామ కృష్ణరాజు చెప్పారు. జగన్ అసెంబ్లీకి రావాలని తాను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందని నమ్ముతున్నానని చెప్పారు. ఈ ప్రభుత్వంపై సంపూర్ణ విశ్వాసం ఉందని.. దోషులకు శిక్ష పడుతుందని తెలిపారు. గతంలోతాను ఎన్నో ఫిర్యాదులు చేశానని గుర్తుచేశారు. సమాజాన్ని మతాలు, కులాల వారిగా విడగొట్టే విధంగా వైసీపీ నేతలు మాట్లాడారని ఆరోపించారు. సునీల్ కుమార్ అతి తెలివి తేటలు ఉపయోగించి యూట్యూబ్‌లో ఉన్న వీడియోలు తీసేశారని చెప్పారు. ప్రభుత్వానికి తాను ఒక బాదితుడిగా ఫిర్యాదు చేశానని తెలిపారు. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణపై తీర్పు ఇస్తే దానిపై ఐపీఎస్ అధికారి ఇష్టానుసారంగా మాట్లాడారని అన్నారు. సునీల్ కుమార్‌ను ఎప్పుడు సస్పెండ్ చేస్తారని ప్రభుత్వాన్ని అడిగానని అన్నారు. తన కస్టోడియల్ టార్చర్‌పై పోరాటం ఆగదని రఘురామ స్పష్టం చేశారు.

## విద్యార్థులకు అస్వస్థత.. ఆసుపత్రికి తరలింపు

**విశాఖపట్నం :** స్థానిక గోపాలపట్నం వెంకటాపురం బీసీ కాలనీలోని జిల్లా పరిషత్ పాఠశాల్లో పలువురు విద్యార్థులు సోమవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. తరగతి గదుల్లో తీవ్ర దుర్వాసన వచ్చింది. దీంతో13 మంది విద్యార్థులకు వాంతులయ్యాయి. అనంతరం వారు కళ్లు తిరిగి కింద పడిపోయారు. పాఠశాలలోని ఉపాధ్యాయులు, సిబ్బంది వెంటనే స్పందించి.. సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అయితే ప్రస్తుతం విద్యార్థుల పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు. బాధితులంతా 8, 9 తరగతుల విద్యార్థులని పాఠశాల సిబ్బంది వెల్లడించారు. విద్యార్థులకు తీవ్ర అస్వస్థతపై జిల్లా ఉన్నతాధికారులు సైతం స్పందించారు. ఈ ఘటనపై వారు ఆరా తీశారు. విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించాలని ప్రభుత్వ వైద్యులను ఆదేశించారు. అలాగే పాఠశాలలోని తరగతి గదుల్లో అపరిశుభ్రతపై ప్రధాన ఉపాధ్యాయుడితోపాటు సిబ్బందిపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల తరగతి గదులతోపాటు పరిసర ప్రాంతాలను శుభ్రం చేయాలని ఆదేశించారు.

## సంపాదకీయం

# సామూహిక మరణాలను ఆపాల్సిందే

సంగం నోస్ వద్ద వేర్వేరుగా వచ్చి గంగా, యమునా నదీ ప్రవాహాలు ఒక్కటిగా కలిసిపోయి ముందుకుసాగడం చూడొచ్చు. ఇక్కడ రెండు నదులు వేరువేరు రంగులలో కనిపిస్తాయి. యమునా నదీజలాలు లేత నీలం రంగులో, గంగాజలం కొద్దిగా బురదమయంగా కనిపిస్తుంది. యమునా నది ఇక్కడ గంగానదిలో కలిసి అంతర్ధానమవుతుంది. అంతర్వాహినిగా సరస్వతి నది సైతం సంగమించే ఈ ప్రాంతాన్నే కుంభమేళాలోని ప్రధాన సంగం ఘాట్‌గా చాలా మంది భావిస్తారు. వివిధ సంప్రదాయాలకు చెందిన అఖాడా సాధువులు తమ ఆచారాలు, అమృత స్నానాలను సంగం నోస్ వద్దే ఆచరించడం ఆనవాయితీగా వస్తోంది. శతాబ్దాల క్రితం జనాభా తక్కువ. అందులోనూ ఈ స్థాయిలో భక్తజనకోటి లేదు. కాబట్టి ఆనాడు కుంభమేళాకు విచ్చేసిన భక్తులంతా కేవలం ఈ త్రివేణి సంగమ స్థలి వద్దే పవిత్ర స్నానాలు ఆచరించేవారని స్థానికులు చెబుతున్నారు. దీంతో తాము కూడా ఈ సంగం నోస్ వద్దే పుణ్నస్నానాలు ఆచరించాలని ఈ విషయం తెల్సిన చాలా మంది భక్తులు భావిస్తారు. వాస్తవానికి 4,000 హెక్టార్లలో విస్తరించిన ఘాట్‌లలో సంగం నోస్ కూడా ఒకటి. సంగం నోస్ వద్ద ఎక్కువ మంది స్నానాలు ఆచరించడానికి వీలుపడదు. కానీ జనం ఇక్కడే ఎక్కువగా స్నానాలు చేసేందుకు ఆసక్తి చూపడంతో యోగి ఆదిత్యనాథ్ సర్కార్ దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఒడ్డు వెంట ఇసుక బస్తాలు వేసి, డ్రెడ్జింగ్ చేసి ఎక్కువ మంది కొనదాకా వచ్చి స్నానాలు చేసేలా దీనిని పెద్ద ఘాట్‌గా మార్చారు.కుంభమేళాలో మౌని అమావాస్య సందర్భంగా కోట్లాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించడానికి రావడంతో తొక్కిసలాట చోటు చేసుకోవడం దురదృష్టకరం. ఈ దుర్ఘటనలో పదుల సంఖ్యలో భక్తులు మృతిచెందంతో పాటుగా 60 మంది గాయపడినట్లు వార్తలు వస్తున్నాయి.గతంలో కూడా కుంభమేళాతో పాటుగా పర్వదినాలు, ఆధ్యాత్మిక సమ్మేళనాల సందర్భంగా ఇలాంటి తొక్కిసలాట ఘటనలు చోటు చేసుకున్నాయి.వందలమంది ప్రాణాలు కోల్పోయారు. లక్షల సంఖ్యలో భక్తులు హాజరయ్యే వేడుకల ఏర్పాట్లలో పాలకులు ఎంత అప్రమత్తంగా ఉండాలో ఈ ఘటనలు గుర్తు చేస్తున్నాయి. భక్తులు సైతం జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరాన్ని ఇవి నొక్కి చెప్తున్నాయి. వదంతులు, భక్తుల్లో భయాలు, తామే ముందుండాలనే తొందరపాటు కారణంగా జరిగే తోపులాటలే ఎక్కువగా ప్రాణనష్టానికి కారణమవుతున్నాయి.గత ఏడాది ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో భోలే బాబా సత్సంగ్‌లో జరిగిన తొక్కిసలాటలో వందమందికి పైగా ప్రాణాలు కోల్పోయిన ఘటన ఇంకా కళ్లముందు మెదలుతూ ఉంది. బాబా పాదధూళి కోసం భక్తులు ఎగబడ్డంతో జరిగిన ఈ తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారిలో అత్యధికులు మహిళలే.మొన్నటికి మొన్న తిరుమల వెంకన్న సన్నిధిలో ముక్కోటి దర్శనం టోకెన్ల కోసం భక్తులు ఒక్కసారిగా ఎగబడ్డంతో తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోగా, 40 మంది గాయపడ్డారు. ఇలాంటి దుర్ఘటనల్లో ప్రాణాలు కోల్పోయే వారిలో ఎక్కువ మంది మహిళలు, చిన్న పిల్లలే ఉంటుండడం గమనార్హం.మహిళలు ఆందోళనకు గురికావడం లేదా కిందపడిపోవడం, తల్లుల చేతుల్లో లేదా వెంట ఉండే చిన్నారులు కూడా వారితో పాటే ఊపిరాడక చనిపోవడమే ప్రధాన కారణం. 2005లో మహారాష్ట్రలోని మంధర దేవి ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు వెళ్లడం, ఆలయమెట్లపైనుంచి జారి భక్తులు ఒకరిపై మరొకరు పడ్డంతో 340 మంది ప్రాణాలు కోల్పోయారు. 2008లో హిమాచల్‌ప్రదేశ్‌లో నైనాదేవి ఆలయంలో జరిగిన తోపులాటలో 162 మంది భక్తులు దుర్మరణం పాలయ్యారు. కొండచరియలు విరిగిపడుతున్నాయన్న వదంతులే ఈ ప్రమాదానికి కారణం. 2008లో రాజస్థాన్‌లోని చాముండేశ్వరీ దేవి ఆలయంలో, 2013లో నవరాత్రుల సందర్భంగా మధ్యప్రదేశ్‌లోని రత్నగఢ్ మందిరంలో జరిగిన తొక్కిసలాటలోనూ వందల ప్రాణాలు గాలిలో కలిసిపోవడానికీ ఇలాంటి వదంతులే కారణం.ఇలాంటి దుర్ఘటనలు జరిగినప్పుడు ఘటనాస్థలంలో దృశ్యాలు హృదయవిదారకంగా ఉంటాయి. సాయం కోసం క్షతగాత్రులు చేసే ఆక్రందనలు, భక్తుల బ్యాగులు, ఇతర వస్తువులు చెల్లాచెదరుగా పడిపోవడమే కాకుండా ఒక్కోసారి డబ్బు, విలువైన వస్తువులు కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన సందర్భాలు కూడా ఉన్నాయి.కాగా మౌని అమావాస్య నాడు పవిత్ర స్నానాలకు పదికోట్ల మంది భక్తులు వస్తారని అధికారులు ముందునుంచీ చెబుతున్నా అందుకు తగ్గట్లు ఏర్పాట్లు మాత్రం చేయకపోవడమే తొక్కిసలాటకు కారణమని భక్తులు ఆరోపిస్తున్నారు. తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో ఈ తొక్కిసలాట జరిగింది.వెలుతురు సరిగా లేకపోవడం, తోపులాటలో ఒకరిపై ఒకరు పడిపోవడం వారిపైనుంచి జనం నడుచుకు పోవడంతో ఎక్కువ మంది చనిపో వడమో, గాయపడ్డమో జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. దేశంలో ఇప్పటివరకు జరిగిన అన్ని తొక్కిసలాట ఘటనలకూ దాదాపుగా ఇలాంటివే కారణాలు కావడం గమనార్హం.గతంలో పోలిస్తే ఇప్పుడు ఇలాంటి ఆధ్యాత్మిక ఉత్సవాలకు భక్తుల రాక పెరిగింది. ప్రత్యేక రవాణా సదుపాయాలు, నిర్వాహకులు, ప్రసార మాధ్యమాలు చేసే ప్రచారం ఇందుకు ప్రధా న కారణం. వేదభూమి అయిన భారత దేశంలో అధ్యాత్మిక చైతన్యం మంచిదే కానీ ప్రాణంకన్నా ఏదీ ఎక్కువ కాదనే విషయాన్ని భక్తులు సైతం గుర్తుంచుకోవాలి.వీఐపీలకన్నా సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇస్తే ఎంత రద్దీనైనా అదుపు చేయవచ్చనే విషయాన్ని గ్రహిస్తే భవిష్యత్తులోనైనా ఇలాంటి సామూహిక మరణాలు చోటు చేసుకోకుండా ఉంటాయి.

# మన చదువులో తెలుగు వెలిగేదెలా



ఇదివరకటి తరాలతో పోలిస్తే ఈ తరంలో సాహిత్యం పట్ల ఆసక్తి కాస్త తక్కువే. కాలంతో పాటు మార్పు వస్తుంది, అంగీకరించక తప్పదు. ఈ మార్పులకు అనుగుణంగా సాహిత్యాన్ని తర్వాతి తరాలకు అందించడంలో మన కర్తవ్యం ఏమిటనేదే పునరాలోచించుకోవాలి. పాఠకులను తయారు చేసుకోవడంలో రెండు, మూడు తరాలను కోల్పోయాం. 10వ తరగతి లోపు 2000 రోజులు పాఠశాలలో గడిపిన పిల్లల్లో 2, 3 శాతానికి కూడా సాహిత్యం పట్ల ఆసక్తి కలగడం లేదు. సాహిత్యాన్ని వ్యక్తిగత ఇష్టంతో చదవడం లేదు. ఎక్కువ మంది ఉపాధ్యాయులు పిల్లలకు సాహిత్యాన్ని చేరవేయడంలో విజయం సాధించలేదు. సిలబస్ పూర్తిచేసే పనిలో మాత్రమే వాళ్లున్నారు. అందువల్ల పాఠశాల స్థాయిలోనే చాలావరకు సాహిత్యం పట్ల ఆసక్తి లేకుండా పోతున్నది. ప్రైవేట్ పాఠశాలల సంగతి చెప్పవలసిన అవసరం లేదు. తెలుగంటే వాళ్లకి అంటరానిది. మరి ఇంగ్లీషులో ఏమైనా సాహిత్య విలువలు ఉన్నాయా అంటే అది కూడా సున్నా. ఇంగ్లీషులో నాలుగు సృజనాత్మక వాక్యాలు రాయమన్నా వారు నోరు వెళ్లబెట్టాల్సిందే. ఇంటర్మీడియట్ స్థాయిలో కూడా పిల్లలకు సాహిత్యపు విలువలను, ఆసక్తిని కలిగించడంలో పూర్తిగా విఫలమైనట్టుగా తెలుస్తున్నది. ఇక డిగ్రీ స్థాయికి వచ్చేసరికి విద్యార్థులకు సమాజం పట్ల, సమూహం పట్ల ఒక అవగాహన ఏర్పడి ఉంటుంది. అక్కడ కూడా తెలుగు పాఠం మాత్రమే చెప్తున్నారు కానీ, సాహిత్యం ఏం చేస్తుందో, సాహిత్యంతో పాటు మనం ఎందుకు నడవాలో, మంచి పుస్తకాలు మనుషులను ఏం చేస్తాయో ఇట్లాంటి విషయాలను చేరవేయడంలో మన విద్యావిధానం సరైన మార్గంలో వెళ్లడం లేదని చెప్పవచ్చు. ఇట్లాంటి సందర్భంలో సాహిత్యాన్ని యువత వద్దకు లేదా పాఠశాల స్థాయికి తీసుకువెళ్లాలంటే రచయితలుగా మనం ఏం చేయాలో ఆలోచించుకోవాలి. ఇప్పటికే అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో మనం ఉన్నాం. తెలుగు భాషకు సంబంధించి రాత విషయంలో పిల్లలు దారుణంగా వెనుకబడి ఉన్నారు. సొంతంగా పది వాక్యాలు కూడా రాయలేని తరం ఒకటి ఇప్పుడు నడుస్తున్నది. హైస్కూల్ స్థాయి పిల్లలకు అమ్మ గొప్పతనం గురించి, నాన్న గురించి పది వాక్యాలు రాయమని చూడండి, వాళ్లు ఎట్లాంటి స్థాయిలో ఉన్నారో అర్థమవుతుంది. ఉపన్యాస పోటీలు నిర్వహించండి కనీసం ముగ్గురు, నలుగురు వచ్చి నిలబడి మాట్లాడే పరిస్థితుల్లో ఉండరు. విద్యార్థుల ముందు నిలబడి పాఠం చెప్పే ఉపాధ్యాయులను రచయితలు చేరాలి. మండల కేంద్రాల్లోనూ, జిల్లా కేంద్రాల్లోనూ బతిమిలాడో, బలవంతంగానో అప్పుడప్పుడు సాహిత్య సమావేశాలు జరిపి ఉపాధ్యాయులను ఆహ్వానించి సాహిత్యాన్ని పిల్లలకు చేరవేయాలని చెప్పక తప్పదు. మా ఆదివారాన్ని నాశనం చేస్తారా అని ఉపాధ్యాయులు అడగవచ్చు. నెలలో ఒక్క ఆదివారం మన కోసం, మన భాష కోసం, మన పిల్లల కోసం అని చెప్పి ఒప్పించగలగాలి. వీలైతే అందులో 10 శాతం ఉపాధ్యాయులు పాఠశాలకు వెళ్లిన తర్వాత పిల్లల ముందు కచ్చితంగా ప్రయత్నం చేస్తారు. అలాగే జూనియర్, డిగ్రీ కళాశాలలు. ఇట్లా ముందు అధ్యాపకులను మనం చేరగలిగితే ఏమైనా మార్పు వస్తుందేమో చూడాలి. సాహిత్యం అంటే తెలుగు ఉపాధ్యాయుడి పని అనే అపోహను తొలగించగలగాలి. మనకు దగ్గరలో ఉన్న పాఠశాలలను, గురుకుల పాఠశాలలను, కస్తూర్బా పాఠశాలలను బృందాలుగా దర్శించాలి. అప్పుడప్పుడు చిన్న చిన్న వర్క్ షాపులు నిర్వహించుకోవాలి. ఇట్లాంటి కార్యాచరణను రూపొందించుకోవడానికి ముందు రచయితలు అంతా ఏకం కావాలి. మనం ఏ దృక్పథానికి చెందిన రచయిత అయినా పర్లేదు, ముందు సాహిత్యం పట్ల ఆసక్తిని, దాని విలువను తెలియజేయాల్సిన అవసరం ఉన్నది.

ఇప్పుడు మన ముందున్న కర్తవ్యం, సాహిత్యాన్ని తర్వాతి తరానికి అందించడమని నమ్మేవాళ్లు ఏకం కావాలి. రచయితలంతా ఏకమై తరచుగా విద్యాలయాలను సందర్శించడం, కనీసం బతిమాలైనా ఒక గంట పాటు అరువు తీసుకోవడం, ఆ గంటను చైతన్యవంతంగా, సమర్థవంతంగా వినియోగించుకోవడం పట్ల ఆలోచించాలి. ఉపాధ్యాయులను బృందాలుగా కలుపుకొని సాహిత్యాన్ని ఒక ఐదు నిమిషాలు పాఠశాలలో పరిచయం చేయమని బతిమిలాడాలి. వర్సిటీల్లో పీజీ స్థాయి విద్యార్థులుంటారు. వాళ్లకు కనీసం నెలకు ఒక సాహిత్య కార్యక్రమాన్ని ఏర్పాటుచేయాలి. ఇతిహాసాల నుంచి సమకాలీన సాహిత్యం వరకు ఏదో ఒక అంశాన్ని ఇచ్చి వాళ్ల చేత రెండు మూడు నిమిషాలు మాట్లాడించవచ్చు. ఆ నెపంతో వాళ్లు కొన్ని పుస్తకాలను తిరగేస్తారు. విశ్వవిద్యాలయ గ్రంథాలయాలను సందర్శిస్తారు. అక్కడే ఉండే పీజీ విద్యార్థులు, పరిశోధకులతో చిన్న వర్క్‌షాప్ సెమినార్లు ఏర్పాటు చేయవచ్చు. అయితే విశ్వవిద్యాలయంలో కూడా సమస్యలు లేకపోలేదు. అన్ని విశ్వవిద్యాలయాలలోను నియామకాలు లేవు. ఆయా విభాగాలలోని అధ్యాపకులకు కూడా హెచ్చు తగ్గ భేదాలు, ఒకరంటే ఒకరికి పడకపోవడాలు లాంటివి ఉన్నాయి. ఏది ఏమైనప్పటికీ సాహిత్యాన్ని యువత దగ్గరికి తీసుకెళ్లడంలో మనం సరైన మార్గం లో వెళ్లకపోవడం కారణంగా సాహిత్యంలో సృజనాత్మకతతో కూడిన ఆలోచనలు తక్కువ అయ్యా యి. పాఠశాలల్లో, కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో ముందు తరం రచయితలు ఈతరం రచయితలతో ముఖాముఖి ఏర్పాటు చేయవచ్చు. కవిత్వ భాషా పుస్తకంలో బొల్లోజు బాబా చెప్పినట్టు సాహిత్యం చేసే పని చదివితే వచ్చే మార్కుల్లాగా కనిపించదు.

అందులో ప్రోగ్రెస్ కార్డులు ఉండవు. కానీ సాహిత్యం అంతః సంస్కారం అనే విషయం కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు. బాలోత్సవ పేరు మీద ఒకటి రెండు రోజులు కార్యశాలలు జరుగుతున్నప్పటికీ అవి ఎంత మాత్రం కొనసాగింపుగా ఉన్నాయో పరిశీలించుకోవాలి. ప్రైవేటు పాఠశాలల్లో , ప్రభుత్వ పాఠశాలల్లో భాషోపాధ్యాయుడు, విద్యార్థులతో సారస్వత సంఘాలు ఏర్పాటు చేయాలి. చెట్టు, వర్షం, సముద్రం, ఆకాశం, మంచి స్నేహితుడు ఇట్లాంటి చిన్న చిన్న అంశాలు ఇచ్చి విద్యార్థుల చేత మాట్లాడించాలి. అక్కడ కొంతమంది కవుల రచనలను చదివి వినిపించగలగాలి. పాఠశాల స్థాయి సాహిత్యపు రుచిని నుంచి చూపించాలి.

తెలుగు సాహిత్యం చదువుకున్న వాళ్లకు ఓటీటీ వేదికలుగా అపారమైన అవకాశాలున్నాయి. మీడియాలో అవకాశాలున్నాయి. అయితే వాళ్లు కనీసం నాలుగైదు పేజీలు వ్యాసం రాయగలగాలి. అనువాదాల మీద దృష్టి పెట్టాలి. సృజనాత్మకత గల రచనకు ప్రాతిపదికగా అంతకుముందున్న రచనలు పనికొస్తాయనే విషయాన్ని తెలియజేయాలి. తెలుగు సాహిత్యాన్ని చదివితే ఎట్లాంటి అవకాశాలున్నాయో వాళ్లకు తెలియజేయాలి. ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఒక కథ చెప్పి తరగతి గదిలో చర్చలు మొదలుపెట్టవచ్చు. ఒక కవిత వినిపించి దాన్ని వారికెలా అర్థమైందో చెప్పమని అడగవచ్చు. తెలిసిన దాన్నుంచి పిల్లలను తెలియనిదానికి తీసుకువెళ్లి వదలాలి. ఇవాళ అన్ని స్థాయి ల్లోనూ ఒక నిర్లిప్తత కొనసాగుతున్నది. మార్కులు సంపాదించే విషయం భాష కాదు. పాఠ్య పుస్తకాల్లోని పాఠాలతో భాషను నేర్పించలేం. అది కేవలం కొంత తోడ్పాటు మాత్రమే.

# పోల్ అడ్డం తిరిగింది




సోషల్ మీడియాలో కాంగ్రెస్‌కు ఘోరమైన ఎదురుదెబ్బ తగిలింది. ఎవరి పాలన కావాలంటూ కాంగ్రెస్ తన అధికారిక ట్విట్టర్ ఖాతాలో పెట్టిన పోల్‌లో దాదాపు 70 శాతం మంది ప్రజలు కేసీఆర్ పాలన బాగుందని ఓట్లు వేశారు. కాంగ్రెస్ పార్టీకి ఇది ఊహించని ఎదురుదెబ్బ. తన అధికారిక ట్విట్టర్‌లో ఇలాంటి ఫలితాలు రావడం ఆ పార్టీకి రెడ్ సిగ్నలే. ఇప్పుడీ పోల్ తెలంగాణ పొలిటికల్ సర్కిళ్లలో హాట్ టాపిక్ అయింది. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో ఎంతటి అసంతృప్తి, ఆగ్రహం ఉందో తాజా పోల్ నిరూపించింది. 'కాంగ్రెస్ పాలన వద్దు, కేసీఆర్ పాలన ముద్దు' అని ప్రజలు నిర్మొహమాటంగా చెప్పేశారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని ఎంత బలంగా కోరుకుంటున్నారో తమ ఓటుతో తెలియజెప్పారు. నిజానికి 420 హామీలపై ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ వేసిన ట్రాప్‌లో కాంగ్రెస్ చిక్కుకుంది. కాంగ్రెస్ హామీలపై గులాబీ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టింది. అయితే, బీఆర్ఎస్‌ను ప్రజల్లో బద్నాం చేసేందుకు కాంగ్రెస్ సోషల్ మీడియా ముందు రోజే అంటే జనవరి 29న తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో పోల్ పెట్టింది. 'ఫామ్ హౌస్ పాలన కావాలా?ప్రజల వద్దకు పాలన కావాలా?' అని పోస్ట్ పెట్టింది. ప్రభుత్వానికి పాజిటివ్‌గా తీర్పు వస్తే తన అనుకూల మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తూ బీఆర్ఎస్‌పై మరింతగా రెచ్చిపోవచ్చునని భావించింది. బీఆర్ఎస్ ప్రోగ్రాం అట్టర్ ఫ్లాప్ అయిందని, బీఆర్ఎస్‌ను ప్రజలు నమ్మడం లేదని ప్రచారం చేయవచ్చని కలలు కన్నది. అయితే కాంగ్రెస్‌వి పగటి కలలే అయ్యాయి. ప్రజలు ఇచ్చిన దిమ్మతిరిగే షాక్‌తో ప్రభుత్వానికి పట్టపగలే చుక్కలు కనిపించాయి. అంతేకాదు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, రేవంత్‌రెడ్డి పాలనను సొంత పార్టీ నేతలు, కార్యకర్తలే వ్యతిరేకిస్తున్నట్టు తాజా పోల్ రిజల్ట్ స్పష్టం చేసింది. ప్రభుత్వ పనితీరుపై కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా పెట్టిన పోస్టులో ప్రభుత్వానికి వ్యతిరేకంగా సొంత క్యాడరే ఓటు వేశారు. దీనిని బట్టి అసంతృప్తి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. సొంత పార్టీలో ఇంత అసంతృప్తి ఉంటే ఇక ప్రజల్లో ఉన్న అసంతృప్తి గురించి చెప్పనక్కర్లేదు. ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న వారిపై కేసులు పెడుతుండటాన్ని గ్రహించిన ప్రజలు బాహాటంగా రేవంత్‌ను విమర్శించే సాహసం చేయలేకపోతున్నారు. దీంతో అందివచ్చిన అవకాశంలా భావించి సోషల్ మీడియాలో కాంగ్రెస్ పెట్టిన పోల్ ద్వారా ప్రభుత్వంపై తమ వ్యతిరేకతను వ్యక్తం చేశారు. తెలంగాణలో బీఆర్ఎస్ పని అయిపోయిందని, కారు షెడ్‌కు పోయిందని, బీఆర్ఎస్ మునిగిపోయే పడవ అని విమర్శించే కాంగ్రెస్, బీజేపీకి ఈ రిజల్ట్ చెంపపెట్టులాంటిది. తెలంగాణ ప్రజలతో బీఆర్ఎస్ బంధం ఎంతలా పెనవేసుకుపోయిందో చెప్పేందుకు ఈ ఫలితం ఒక ఉదాహరణ. పోల్‌లో బీఆర్ఎస్ పార్టీని ప్రజలు విశ్వసించడం ఆ పార్టీకి కొండంత బలాన్ని ఇచ్చినట్టు అయింది. సోషల్ మీడియాలో ప్రజలు తమకు అనుకూలంగా ఇచ్చిన తీర్పుతో బీఆర్ఎస్‌కు వేయి ఏనుగుల బలం వచ్చినట్టు అయింది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చేందుకు మరింతమంది నేతలు సిద్ధంగా ఉన్నారన్న టీపీసీసీ చీఫ్‌కు కూడా ఈ రిజల్ట్‌తో గట్టి షాక్ ఇచ్చారు. బీఆర్ఎస్‌పై కూడబలుక్కుని తప్పుడు ప్రచారం చేస్తున్న బీజేపీ, కాంగ్రెస్‌కు ఈ తీర్పు ఒక చెంపపెట్టులాంటిదే. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయలేనంత బలహీన పడిందని బీఆర్ఎస్‌పై విమర్శలు చేస్తున్న కాంగ్రెస్, బీజేపీలకు ఇది జీర్ణించుకోలేని వార్త. కీలకమైన సర్పంచ్ ఎన్నికల వేళ ప్రజలు ఇలాంటి తీర్పు ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత చర్చలు మొదలయ్యాయి. ఎన్నికల్లో కనీసం పరువు అయినా నిలుస్తుందా? అని ఆందోళన చెందుతున్నారు. ప్రతిపక్షాన్ని ఇరుకులో పెట్టబోయి కాంగ్రెస్ తానే నవ్వుల పాలైంది. ప్రభుత్వంపై ప్రజల్లో ఇంత వ్యతిరేకతను కాంగ్రెస్ ఊహించలేకపోయింది. మరోవైపు సోషల్ మీడియాలో జరిగిన నష్టాన్ని పూడ్చుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ఏకంగా వేల సంఖ్యలో ఫేక్ అకౌంట్లు క్రియేట్ చేసి ప్రభుత్వానికి అనుకూలంగా ఓట్లు వేయిం చే ప్రయత్నాలు చేస్తున్నది. తాజా పోల్ ఫలితాలతో పార్టీ మారాలనుకున్న చిన్నాచితక నేతలు సందిగ్ధంలో పడిపోయారు. ఈ నేపథ్యంలో ఇకపై రాజకీయాల్లో కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నది. అధికార పార్టీ నుంచి నేతలు వలస వెళ్లినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. సొంత పార్టీలో, ప్రభుత్వంలో తిరుగుబాటు వచ్చినా రావచ్చు. ఇప్పటికే ఢిల్లీలో భట్టి, ఉత్తమ్ వంటి నేతలు పావులు కదుపుతున్నారు. ఇంకోవైపు ఇది ప్రతిపక్షానికి ప్రజలు ఇచ్చిన మద్దతు. ఏడాది కాలంగా ప్రతి పక్షం ప్రజల పక్షాన పోరాడుతున్న తీరుకు ఇది ఒక సమర్థన. ఈ తీర్పు ప్రతిపక్షంపై మరింత బాధ్యత పెట్టింది. బరువును పెంచింది.

# కేంద్ర బడ్జెట్‌పై మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

**బీహార్ కు భారీగా లబ్ధి.. మరి ఏపీకి ఏమిచ్చిందన్నారు**

**టీడీపీకి రాజకీయ ప్రయోజనాలే తప్ప రాష్ట్ర ప్రయోజనాలు పట్టవంటూ విమర్శించారు.**

**బడ్జెట్లో ప్రజలకు కొనుగోలు శక్తి పెంచే ఒక పథకం కూడా లేదు...**



**పాతపట్నం ఫిబ్రవరి 03, ప్రజా జ్యోతి న్యూస్..** కేంద్ర ప్రభుత్వం శనివారం లోక్ సభలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో ఏపీకి నిధులు కేటాయించకపోవడం దురదృష్టకరమని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. బీహార్ కు కేంద్రం వరాల జల్లు కురిపించిందని గుర్తుచేస్తూ.. రాష్ట్రంలో కూటమి సర్కారే ఉన్నా, అందులో టీడీపీకి పదహారు మంది ఎంపీలు ఉన్నా నిధులు తీసుకురావడంలో వారంతా విఫలమయ్యారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వంలో టీడీపీ కూడా భాగస్వామ్య పార్టీనే అని గుర్తుచేశారు. అయితే, టీడీపీకి రాజకీయ ప్రయోజనాలే తప్ప రాష్ట్ర ప్రయోజనాలు పట్టవని ఈ బడ్జెట్ తో తేలిపోయిందన్నారు. చిత్తశుద్ధితో అభివృద్ధికి కృషి చేయాలని, రాజకీయాలు చేయొద్దని కోరారు. బీహార్ తో పోల్చుకుంటే ఏపీకి ఈ బడ్జెట్ లో దక్కిన వాటా శూన్యమని చెప్పారు.బడ్జెట్ ప్రసంగం ప్రారంభిస్తూ సభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురజాడ అప్పారావు కవిత 'దేశమంటే మట్టికాదోయ్.. దేశమంటే మనుషులోయ్' చదవడం సంతోషకరమని రెడ్డి శాంతి చెప్పారు. ఏపీకి చెందిన మహాకవిని సభలో ప్రస్తావించారు కానీ రాష్ట్రానికి కేటాయింపులు మాత్రం మరిచిపోయారని విమర్శించారు. బడ్జెట్ లో అసలు ఏపీ ప్రస్తావనే లేదన్నారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు కుదించడంపైనా రెడ్డి శాంతి మండిపడ్డారు. ఏపీకి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తుతో నిర్మిస్తుంటే కేంద్రం దానిని 41 మీటర్లకు కుదిస్తూ నిధుల కేటాయింపునకు అంగీకరించిందని తెలిపారు. ఈ విషయాన్ని కూడా కొంతమంది నేతలు ఘనంగా చెప్పుకోవడం వింటుంటే చాలా బాధాకరంగా ఉందన్నారు.కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ మంచిగా ఉందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ట్వీట్ చేశారని అయితే రాష్ట్రానికి ఆయన ఏమి తీసుకొచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్ర అభివృద్ధికి నిధులు ఏమీ లేకపోవడం ఆందోళన కలిగిస్తుంది అన్నారు. కార్పొరేట్లకు మేలు చేసేలా ఉంది తప్ప సామాన్యులకు ఈ బడ్జెట్లో ఏమీ దక్కలేదన్నారు. పేదలకు, అవ్వాతాతలకు ఇచ్చే పింఛన్లలో కూటమి ప్రభుత్వం నెలనెలా కోత విధిస్తోందని, పలు రకాల కారణాలు చూపించి ప్రతినెలా కొన్ని పింఛన్లు నిలిపివేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్తగా వచ్చే పింఛన్ల సంగతి పక్కన పెడితే ప్రతినెలా పింఛన్ల కోత రోజు రోజుకి పెరిగిపోతుందనారు. ఏదో ఒక కారణం చూపించి పింఛన్లు నిలిపివేయడం తగదన్నారు. పింఛన్ డబ్బులు నెలకు రూ.వెయ్యి పెంచి రూ.4వేలు ఇస్తున్న చంద్ర బాబు.. పెంచిన భారాన్ని తగ్గించుకునేందుకు అర్హులైన వారి పింఛన్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. పింఛన్లు తొలగింపు ప్రక్రియను నిలిపి,ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం బీసీలకు 50 ఏళ్లకు పింఛన్లు,సంక్షేమ పథకాలు అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు.

## విక్టరీ స్కూల్ లో వసంత పంచమి ఆధ్యాత్మిక శోభ..





**పాతపట్నం ఫిబ్రవరి 03, ప్రజా జ్యోతి న్యూస్..** పాతపట్నం స్థానిక విక్టరీ పాఠశాలలో వసంత పంచమిని పురస్కరించుకుని సరస్వతి పూజ నిర్వహించారు.చిన్న పిల్లలు సరస్వతి మాత శ్లోకాలు పఠించారు.ఉపాధ్యాయులు పూజాదికాలు చేశారు.అనంతరం చిన్న పిల్లలతో సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు.ఈ కార్యక్రమములో ప్రిన్సిపాల్,యాజమాన్య సభ్యులు,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# మా పొలం మాకు ఇప్పించండి

# గ్రీవెన్స్‌లో తాసిల్దార్‌కు వినతి

**గుంతకల్ టౌన్ ప్రజా జ్యోతి:** గుంతకల్ మండలం లోని ధోని ముక్కల గ్రామ%శీ% లో కె చిన్న నారాయణ కు ముగ్గురు సంతానం 1 .కే లింగప్ప ,2 నాగలింగ 3.రామాంజనేయులు పెద్దల సమక్షంలో ఆస్తి విభాగాలు చేసినారు తండ్రి ఎవరు అప్పు కడతారో వారికి రిజిస్టర్ చేయిస్తామని పెద్దల సమక్షంలో చెప్పినారు నేను కే నాగలింగ సన్నాఫ్ చిన్న నారాయణ పెద్దల చెప్పినట్టు అప్పు కట్టినాను అయినా నాకు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వకుండా నేను మా తండ్రి దగ్గరకి పోయి రెండు మూడు సార్లు అడిగాను చేయిస్తాను అంటూ చేసి ఇవ్వలేదు మాకు తెలియకుండా మా అన్నగారు అయినా కే లింగప్పకు రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చినారు మాకు తెలిసి అడిగినందుకు మమ్మల్ని బెదిరిస్తూ వ్యాపారైన వైసీపీ కార్యకర్త మైనార్టీ నాయకుడు అనంతపురం జిల్లా గుంతకల్ మండలం గుంతకల్ టౌన్ 60 అడుగుల రోడ్లో లో ఉండు దూదేకుల హెూ నోరువలి సాహెబ్ కుమారుడు హెూన్నూరు వలి కి మా పొలం తీసుకోవద్దు అని 2%ూ%23 లో చెప్పినము కానీ ఆయన వినకుండా మమ్మల్ని బెదిరిస్తూ 2024లో పొలం మాకు తెలియకుండా రిజిస్ట్రేషన్ చేసుకుని ఇదేమిటి అని అడిగితే రాజకీయాలతో మమ్మల్ని పోలీస్ స్టేషన్కు బలవంతంగా తీసుకొని పోయి బెదిరిస్తూ మాపై కేసులు పెట్టి మమ్మల్ని ఇబ్బంది పెడుతూ బెదిరిస్తూ మాకు తెలియకుండా మా పిల్లలను టార్చర్ పెడుతూ మా పిల్లలు ఊర్లో లేకపోయినా పనికి పోయిన వారిని మా కుటుంబంలోని వారిని సమాజంలో గౌరవం లేకుండా కించపరుస్తూ పోలీస్ ని తీసుకొని వస్తూ మనోవేదనకు గురి చేస్తూ మాపైన లేనిపోని కేసులు పెట్టించినారు దూదేకుల హెూన్నరు వలి కుమారుడు మన్సూర్ వీధి అనుచరులు జి నాగలింగ జి రాఘవ దూదేకుల హెూన్నూరు వలి తన కుమారుడైన మన్సూర్ అలాగే కే లింగప్ప ఆయన భార్య జీ నాగలింగ సన్నాఫ్ జి సుంకన్న జి రాఘవ సన్నాఫ్ జి రాజారాం లింగప్ప కుమారుడు కే విజయ్ నాగేష్ దూదేకుల వన్నూరు వలి అనుచరులు మా తల్లిదండ్రులను కేసులు పెట్టించి ఇబ్బంది పెట్టారు రిజిస్ట్రేషన్ల మా సంతకాలు లేకుండా మా పిల్లల సంతకాలు లేకుండా రిజిస్ట్రేషన్ చేసినారు మా పొలంలో ప్లాట్లు వేసి దౌర్జన్యంగా అమ్ముతున్నారు పై తెలిపిన వారి నుండి మాకు ప్రాణహాని ఉంది అని నాగ లింగన్న వాపోయారు. నాకు రావాల్సిన ఆస్తి విభాగాలు సర్వేనెంబర్ 67-2 నందు 50 సెంట్లు66-డి 50 సెంట్లు సర్వే నెంబర్ 40 నందు 75 సెంట్లు సెంట్లు రావాల్సింది

## వసంత పంచమి సందర్భంగా లోతుగడ్డ తులసి వరప్రసాదరావు చేతుల మీదుగా అక్షరాభ్యాసం.





**కొత్తూరు,ఫిబ్రవరి 03, ప్రజా జ్యోతి న్యూస్..** కొత్తూరు మండలంలోని కర్లమ్మ ఆర్.అండ్.ఆర్ కాలనీలో వసంత పంచమి సందర్భంగా కొంత మంది పిల్లల తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు కోరిన మేరకు ఈరోజు లోతుగెడ్డ తులసీ వర ప్రసాదరావు చేతుల మీదుగా అక్షరాభ్యాసం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో లోతుగెడ్డ తులసి వరప్రసాదరావు పాల్గొని మొదటగా సరస్వతి దేవిని పూజించి అనంతరం పిల్లలకి ఓంకారం నమః శివాయ అ,ఆ లనే అక్షరాలతో అక్షరాభ్యాసం చేశారు.ఈ కార్యక్రమం అనంతరం తులసీ వర ప్రసాదరావు పిల్లలకు,తల్లిదండ్రులకు స్వీట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమం లో సర్పంచ్లు పుచ్చ అప్పారావు,అధపాకల శంకరరావు, పడాల వెంకట కృష్ణ, రౌతు అనంతరావు,చల్ల లక్ష్మణ రావు మరియు ఉపాధ్యాయులు, ఆశ వర్కర్లు,స్థానిక పాఠశాలలోని పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం






**పొందూరు , ఫిబ్రవరి 3:** మాఘ శుద్ధ పంచమి సందర్భంగా పొందూరు మండల కేంద్రంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధాన ఉపాధ్యాయులు కోరుకొండ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో సరస్వతీ దేవి సమక్షంలో పురోహితులు కూన పులి రామకృష్ణ శర్మ వేద మంత్రోర్చనల మధ్య నిర్వహించిన ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో తల్లిదండ్రులు తమ పిల్లలతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి 2 పట్నాన రాజారావు ముఖ్య అతిథిగా హాజరై, అక్షరాభ్యాసం లో పాల్గొంటున్న పిల్లలకు పలకలు , స్లేట్ పెన్సిల్స్ వితరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొత్తగా విద్యా ప్రమాణాలను ప్రారంభించడానికి మాఘ శుద్ధ పంచమి ని శుభప్రదంగా పరిగణిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు కోరు కొండ విజయ్ కుమార్ మాట్లాడుతూ సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని , సుమారు 50 మంది పిల్లలకు అక్షరాభ్యాసం చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల 1 ను అత్యుత్తమ పాఠశాలగా అభివృద్ధి చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే ద్యేయంగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నట్లు ఈ సందర్భంగా తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ కాళ్ళ శ్రావణి , నాగవంశం సంఘ సభ్యులు అనకాపల్లి శివ కుమార్ , ఎస్.ఎం.సి సభ్యులు , విద్యార్థులు , తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పామిడి భోగేశ్వర స్వామిఆలయంలో ఘనంగా వసంత పంచమి



**ప్రజా జ్యోతి రిపోర్టర్ సుబ్బు పామిడి** సకల విద్యలకు అనుష్టాన దేవతగా సరస్వతిదేవి అవతరించిన రోజు వసంత పంచమి. ఈ రోజు తమపిల్లలకు అక్షరాబ్యాసం చేస్తే వారికి సరస్వతి కటాక్షం విశేషంగా లభిస్తుందన్న నమ్మకం తో సరస్వతి పూజ చేయుంచి భక్తులు అక్షరాబ్యాసం చేయుంచారు పామిడి పట్టణంలోని భోగేశ్వర స్వామి దేవాలయం లో సరస్వతి ఉత్సవ విగ్రహానికి పూజలు అర్చకులు చంద్రమౌళి ద్వారా చేయుంచి అక్షరబ్యాసం చేయుంచారు. సరస్వతి మాత విగ్రహాన్ని అలంకరించి పూజలు జరిపి బియ్యం, కొత్త పలకపై అక్షరాలు వ్రాయుంచారు. ఏదేవతకు లేనివిధంగా సరస్వతి దేవి పుస్తకాన్ని ధరించింది. ఆయుధాలు హస్తల్లో లేని దేవత ఈమె.

## ఇష్టపడి చదివితేనే అద్భుత ఫలితాలు సాధ్యం గుంతకల్ మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్



**గుంతకల్ టౌన్ ప్రజా జ్యోతి:** సోమవారం సాయంత్రం గుంతకల్ పట్టణంలోని హనుమేష్ నగర్ లో సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం నందు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ ను అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా గుంతకల్ మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ పాల్గొని ప్రసంగిస్తూ విద్యార్థులు పరీక్ష సమయాల్ని దృష్టిలో పెట్టుకొని పట్టుదల ఏకాగ్రత ఆత్మవిశ్వాసాలతో చదువుకోగలిగితే అద్భుత ఫలితాలు సొంతం అవుతాయని విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని ఏర్పరచుకొని ముందుకెళ్లాలని అన్నారు అనంతరం విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో దాతలు భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు యు. సుధాకర్ చౌదరి యు. విశ్వనాధ్ చౌదరి జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్ యాదవ్ జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి కే నీలకంఠ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ ఎం జ్ఞానమ్మ ఎన్ ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు

## గాయపడ్డ ఆభోతును చికిత్సా కోసం తరలించేందుకు కృషి చేసిన కార్యదర్శి పాల శ్రీనివాస్.



**పాలకొల్లు ఫిబ్రవరి 3 ప్రజాజ్యోతి న్యూస్ :** పాలకొల్లు -పూలపల్లి బైపాస్ రోడ్డు లో ప్రమాదానికి గురైన ఆంబోతును పశ్చిమగోదావరి జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షులు,పూలపల్లి గ్రామ కార్యదర్శి పాలా శ్రీనివాస్, మరికొందరు కలసి మెరుగైన వైద్యం కోసం తణుకు పెద్ద హాస్పటల్ కి అంబులెన్స్ ద్వార పంపించటం జరిగింది.మానవతా దృక్పధం తో ఈ పని చేసిన కార్య దర్శి శ్రీనివాస్, రూరల్ పంచాయతీ సిబ్బంది జక్కంపూడి రాంబాబు, అందుకు సహకరించి న అందరిని పలువురు అభినందించారు.

## ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన ట్రైనింగ్ డిఎస్పి



**బాపట్ల జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ ని మర్యాదపూర్వకంగా కలిసిన ట్రైనీ డీఎస్పీ రావూరి అభిషేక్ బాపట్ల జిల్లాలో ప్రాక్టికల్ శిక్షణ పొందే నిమిత్తం కేటాయించబడిన 2023 వ బ్యాచ్ కు చెందిన ట్రైనీ డి.ఎస్.పి రావూరి అభిషేక్ సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ ని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు శాంతిభద్రతల పరిరక్షణలో అంకితభావంతో విధులు నిర్వహించి విజయవంతంగా శిక్షణను పూర్తి చేసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు పశ్చిమ గోదావరికి చెందిన ట్రైనీ డిఎస్పి అనంతపురం పీటీసీ లో శిక్షణ పూర్తి చేశారు ప్రస్తుతం బాపట్ల జిల్లాలో 6 నెలల పాటు ప్రాక్టికల్ శిక్షణ పొందనున్నారు

# ఈనెల 5న వైస్సార్సీపీ ఫీజు పోరు.

## విద్యార్థులు, తల్లిదండ్రులు తరలిరావాలి జడ్పీటీ గుంటూరు పెద్దిరాజుపిలుపు.





**పోడూరు, ఫిబ్రవరి 3,ప్రజాజ్యోతి న్యూస్ :** వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైసీపీ ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీన జిల్లా కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ' ఫీజు పోరు' ఆందోళన కార్యక్రమాన్ని మాజీ మంత్రి వర్యులు, మాజీ ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు నాయకత్వంలో ఆచంట నియోజకవర్గం లోని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, వైసీపీ కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పోడూరు జడ్పిటిసి గుంటూరి పెద్దిరాజు, పెనుమంట్ర ఎంపీపీ కర్రి వెంకటనారాయణ రెడ్డి ( వాసు రెడ్డి) పిలుపునిచ్చారు. పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం తూర్పు పాలెంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో సోమవారం మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశాల మేరకు వైసిపి నాయకులు ఫీజు పోరు ఆందోళన కార్యక్రమం పోస్టర్ ను ఆవిష్కరించి అనంతరం విలేకరుల సమావేశంలో పెద్దిరాజు మాట్లాడుతూ గత మూడు త్రైమాసిక లకు సంబంధించిన ఫీజులు కూటమి ప్రభుత్వం ఈరోజు వరకు ఇవ్వకపోవడం దారుణం అన్నారు. వైసిపి ప్రభుత్వం లో 14 లక్షల కోట్లు అప్పులు చేశారనీ పథకాల అమలు విషయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు తప్పుడు లెక్కలు చెబుతూ కుంటి సాకులు చెబుతున్నారన్నారు. ఏ ప్రభుత్వంలో అయినా అప్పులు చేయడం అనేది సాధారణమైన విషయమన్నారు. చంద్రబాబుకి వైసీపీ ప్రభుత్వంలో అప్పుల సంగతి ఎన్నికల హామీలు వచ్చినప్పుడు తెలియదా?అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం వైసిపి ప్రభుత్వం లో చేసిన అప్పులు రూ.7 లక్షల కోట్లు అని స్పష్టం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. పెనుమంట్ర ఎంపీపీ వాసురెడ్డి మాట్లాడుతూ కూటమి పర్వతం కల్లబొల్లి కబుర్లు చెబుతూ ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం విద్యార్థులకు దాదాపు గా రూ. 1800 కోట్లు ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ఫిబ్రవరి 5వ తేదీన జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ఫీజు పోరు ఆందోళన కార్యక్రమాన్ని వైసిపి నాయకులు, కార్యకర్తలు విద్యార్థులకు అండగా నిలబడి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు కర్రి రామలింగేశ్వరరెడ్డి , జిల్లా అధికార ప్రతినిధి గుబ్బల వీరబ్రహ్మం, కార్పొరేషన్ల మాజీ డైరెక్టర్లు కొవ్వూరు వేణుమాధవ రెడ్డి, పోతుమూడి రామచంద్రరావు, మండల కన్వీనర్లు పిల్లి నాగన్న, గూడూరి దేవేంద్రుడు, ఆచంట మండలం సర్పంచుల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారాం, దంపన బోయిన బాబురావు, ఓడూరు సర్పంచ్ బుర్రా రవికుమార్, పులిదిండి వెంకటేశ్వర్లు , దొంగ దుర్గాప్రసాద్ పలివెల శ్రీను, కాసాని శ్రీనివాస్ ,కోట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# బూరుగుపూడిలో భీష్మ ఏకాదశి సందర్భంగా భారీ ఉత్సవ ఏర్పాట్లు



**కాకినాడ జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామంలో వేంచేసియున్న శ్రీ అభయాంజనేయ స్వామి 39వ వార్షికోత్సవ మహోత్సవాలు 40 లక్షల రూపాయలతో ఘనంగా ఏర్పాట్లు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్మాణ ధర్మకర్త, ఉత్సవ కమిటీ చైర్మన్ కర్నాకుల పెద్దకాపు తెలిపారు.ఏర్పాట్లను కమిటీ సభ్యులతో కలిసి దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పెదకాపు మాట్లాడుతూ 39వ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారి ఉత్సవ వేడుకలు రథసప్తమి నుండి 8వ తేదీ వరకు జరగనున్నాయని,ఎనిమిదో తేదీన అంగరంగ వైభవంగా వివిధ సంస్కృత,సాంఘిక కార్యక్రమాలు,ఎగ్జిబిషన్ కార్యక్ర మంతో పాటు భారీ బాణసంచాతో,విద్యుత్ దీపాలంకరణలతో స్వామివారి ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.500 మంది వాలంటీర్లతో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాతర కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.ఆలయ ప్రాంగణంలో ప్రతిరోజు వివిధ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు.జాతర కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఎనిమిదో తేదీన భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ అన్నదాన కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారి అన్న ప్రసాదము స్వీకరించడమే కాకుండా, ఆరోజు రాత్రి జరిగే మహా జాతర ఉత్సవాన్ని తిలకించి స్వామి వారి తీర్థ ప్రసాదములు స్వీకరించాలని కర్ణాకుల పెదకాపు పిలుపునిచ్చారు.ఈ కార్యక్ర మంలో కమిటీ సభ్యులుమిరియాల వెంకటేశ్వర్లు,బెల్లపుకొండ గోవిందస్వామి, అడపా గణేష్,బత్తుల దుర్గాజి తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తరకంచి ఆక్స్ ఫర్డ్ స్కూల్‌లో ఘనంగా వసంత పంచమి వేడుకలు




**కాకినాడ జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** ప్రత్తిపాడు: మండలంలోని ఉత్తరకంచి ఆక్స్ ఫర్డ్ స్కూల్లో వసంతి పంచమి ని పురస్కరించుకుని అక్షరాభ్యాసం చేసే చిన్నారులను సరస్వతి దేవి పూజతో విద్యాభ్యాసానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆక్స్ ఫర్డ్ స్కూల్ అధినేత రామిశెట్టి వీర్రాజు మాట్లాడుతూ ప్రతి ఏటా ఘనంగా వసంతి పంచమి వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. అలాగే గత 15 సంవత్సరాల నుండి స్కూల్లో ఈ వసంతి పంచమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. తెలంగాణ బాసరలో నిర్వహించే వసంత పంచమి వేడుకలను గత 15 ఏళ్ల క్రిందట మా స్కూల్లో ప్రారంభించడం చాలా సంతృప్తి ఇచ్చింది అన్నారు. వసంత పంచమి రోజున చిన్నారులకు మొదటగా లక్ష్మి గణపతి హెూమం తో ప్రారంభమై తథానంతరం గణపతికి పూజలు నిర్వహించి సరస్వతి దేవికి చిన్నారులుచే పూజలు నిర్వహించి చిన్నారులచే అక్షరాభ్యాసాన్ని ప్రారంభించారు. ఈ పూజా కార్యక్రమాన్ని మొగలి వినోద్, లక్ష్మి రాణి లచే లక్ష్మీ గణపతి హెూమం తో ప్రారంభమై సరస్వతి దేవికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మంది చిన్నారులు అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్నారు. భారీ స్థాయిలో విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, వివిధ గ్రామాల ప్రముఖులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అక్షర విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఘనంగా వసంత పంచమి వేడుకలు

**కాకినాడ జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** జగ్గంపేట అక్షర విద్యాలయ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు వసంత పంచమిని పురస్కరించుకొని గణపతి పూజ,అక్షరాభ్యాసం మరియు సరస్వతీ హెూమాల్ని ఘనంగా జరిపించామని అక్షర విద్యా సంస్థల చైర్మన్ పాఠంశెట్టి సతీష్ బాబు,కరస్పాండెంట్లు ఆళ్ళ రవి కిషోర మరియు ఆళ్ళ శ్రీనివాస్ తెలియజేశారు.వేద పండితులు ముందుగా గణపతి పూజను అత్యంత వైభవంగా జరిపించారు.వేద పండితులు చిన్నారులకు తల్లిదండ్రులతో అక్షరాభ్యాసాన్ని జరిపించారు. తర్వాత సరస్వతీ హెూమాన్ని జరిపించి విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులను సరస్వతి దేవి ప్రసాదించాలని వేద పండితులు ఆశీర్వాదాలను అందజేశారు.



## తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ - పోలీస్ స్టేషన్ లో పిర్యాదు



**పొందూరు :** తాళం వేసి ఉన్న ఇంట్లో చోరికి పాల్పడిన ఘటన పొందూరు మండలం కనిమెట్ట పంచాయతీ రామదాసుపురం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే రామదాసుపురం గ్రామం చిన్నవీధి లో పైడి వెంకట సత్యవతి ,పైడి వెంకట శ్రీనివాసరావు నివాసం ఉంటున్నారు. వీరు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం నాడు కూలి పని నిమిత్తం వెంకట సత్యవతి , వారి కుమార్తె శ్రీకాకుళం లో మెడికల్ షాప్ లో పని నిమిత్తం బయలుదేరారు. యధావిధిగా ఇంటి తాళాలను బాత్ రూం గోడమీద పెట్టి కూలి పని నిమిత్తం వెళ్లిపోయారు. సాయంత్రం పని ముగించుకుని ఇంటికి వచ్చి తలుపులు తెరిచారు. తన కుమార్తె పని ముగించుకుని విత్ డ్రా చేసి తీసుకువచ్చిన డబ్బును బీరువాలో పెట్టేందుకు బీరువా తాళాలు తీసి సీక్రెట్ లాకర్ లో చూడగా రూ. 76 వేలు నగదు ,తులం పావు బంగారం చోరికి గురైనట్లు గుర్తించారు. దీంతో పైడి వెంకట సత్యవతి స్థానిక పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు. బీరువాలో బట్టలు ఎక్కడివక్కడే ఉన్నాయని , ఇంట్లో లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు బీరువా లో నగదు ,బంగారం దొంగలించినట్లు గా పిర్యాదు లో పేర్కొన్నారు. స్థానిక ఎస్. ఐ సత్యన్నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## షిరిడి సాయిబాబా ఆలయం లో వసంతపంచమి సందర్భంగా సామూహిక అక్షరాభ్యాసాలు..



**పాతపట్నం ఫిబ్రవరి 3 ప్రజా జ్యోతి న్యూస్** వసంతపంచమి పుణ్య దినం సందర్భంగా శిరిడి సాయి ఆలయ ప్రాంగణంలలో సామూహిక అక్షర స్వీకరాలు షిరిడి గిరి శ్రీ షిరిడి సాయిబాబా ధ్యాన మందిరం లో.100కు పై గా చిన్నారులకు.సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించడం జరిగింది... వసంతపంచమి పవిత్ర పర్వదినము నందు ఈ కార్యక్రమం చేయడం వల్ల పిల్లల చదువు భవిష్యత్తు లో మంచి ఫలితాలు వుంటాయని పెద్దల నమ్మకం అనేది ఆచారంగా వస్తుంది..

## రామ కోవెల ప్రారంభోత్సవ వేడుకులలో బోడే రామచంద్ర యాదవ్



**గొల్లప్రోలు ప్రజాజ్యోతి రిపోర్టర్ చినబాబు,** పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో జరిగిన శీరం వారి రామ కోవెల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన. బడుగు బలహీన వర్గాల నాయకుడు పుంగనూరు భారత చైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవని పూర్ణకుంభంతో మేళతాళాలతో పిఠాపురం నియోజకవర్గం మరియు చేబ్రోలు గ్రామ ప్రజలు మహిళలు యువత ఘన స్వాగతం పలికారు రామచంద్ర యాదవ్ చేబ్రోలు లో శీరం వారి రామాలయంలో శ్రీ సీతారామ సమేత లక్ష్మణ హనుమ శ్రీకృష్ణ స్వామివార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమం చేసి ఆ స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు ఈ సందర్బంగా మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలు మరియు చేబ్రోలు గ్రామ ప్రజలు అందరూ సుఖ సంతోషాలతో జీవించాలని ఆ స్వామి అమ్మవార్లు ఆశీస్సులు ఎల్లవేళలా ప్రజలపై ఉండాలని తెలిపారు ఈ కార్యక్రమంలో పిఠాపురం నియోజకవర్గం బీసీవై పార్టీ ఇంచార్జ్ శీరం శ్రీను జోగా వెంకటరమణ గారు ఎక్స్ చైర్మన్ పిఠాపురం మున్సిపాలిటీ మల్లిపూడి వీరబాబు మోరుకుర్తి శివ పీతల రాజా యాదాల పాపరావు ఇసరపు కోటేశ్వరావు ఇసరపు చక్రరావు మోరుకుర్తి సింహాద్రి అప్పన్న సారిపిల్లి శ్రీను లోకా యేసుబాబు పల్లా శంకర్ యాదవ్ బండారు చిన్నారావు బీసీ పార్టీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

## స్క్రీనింగ్ ప్రోగ్రాం కండక్ట్ చేసిన పీహెచ్సీ గోవిందపురం వైద్యాధికారిని వాహిని ప్రియాంక.



శ్రీకాకుళం జిల్లా వజ్ర కొత్తూరు మండలం గోవిందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ప్రీ స్కూల్ చిల్డ్రన్ ప్రైమరీ స్కూల్ చిల్డ్రన్ కు వైద్యాధికారిని వాహిని ప్రియాంక గారు ఎత్తు, బరువు,బాడీ మాస్ ఇండెక్స్ మరియు హెచ్ బి తనిఖీలు చేశారు పిల్లలకు తగు సలహాలు సూచనలు ఇచ్చితిరి ఫోర్ కీ కేటగిరి హెల్త్ ఇష్యూస్ డిఫెక్ట్స్ ఎట్ బర్త్,డిసీజెస్,డెఫిషియన్సీస్ మరియు డెవలప్మెంటల్ డిలేస్ గురించి విపులంగా వివరించితిరి ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మంగమ్మ, హెచ్.వి.తేజం,సిహెచ్ఓస్,ఏఎన్ఎంలు, ఆశాలు,అంగన్వాడి టీచర్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ముగిసిన పోలీస్ వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్

**బాపట్ల జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** అద్భుతమైన క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారు ఇదే స్ఫూర్తిని విధి నిర్వహణలో సైతం కొనసాగించాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ పోలీస్ సిబ్బందికి తెలిపారు. జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లో ఫిబ్రవరి 2న ఆదివారం రాత్రి జిల్లా పోలీస్ వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ముగింపు కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మూడు రోజులుగా నిర్వహించిన పోలీస్ వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. క్రీడా పోటీలలో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. నిర్వహించిన అన్ని క్రీడా పోటీలు కూడా అత్యంత ఉత్కంఠ భరితంగా సాగాయి. అనంతరం మూడు పోలీస్ సబ్ డివిజన్ల, హోం గార్డ్స్ విభాగం మరియు డిస్ట్రిక్ట్ ఆర్మ్డ్ రిజర్వ్ నుండి పాల్గొన్న పోలీసు క్రీడాకారులు ముగింపు మార్చ్ చేసి జిల్లా ఎస్పీకి గౌరవ వందనం చేసారు. స్పోర్ట్స్ మీట్ లో విజేతలుగా నిలిచిన జట్టులకు, వ్యక్తిగత విజేతలను జిల్లా ఎస్పీ ట్రోఫీలు, మెడల్స్, సర్టిఫికెట్స్ బహుమతులు అందచేసి ప్రత్యేకంగా అభినందించారు. వార్షిక స్పోర్ట్స్ మీట్ ని నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని ఎస్పీ తెలిపారు. పోలీస్ అంటేనే నిరంతరాయంగా విధులు, ప్రముఖుల రాకపోకలు, ముఖ్యమైన సమావేశాలు, ర్యాలీలు , బందోబస్తు, ఇతరత్రా డ్యూటీలతో క్షణం తీరిక లేకుండా ఉంటారన్నారు. ఆ సమయంలో ఆరోగ్యం పట్ల శ్రద్ధ లోపిస్తుందనీ, ఈ స్పోర్ట్స్ మీట్ నిర్వహించడం వల్ల పని ఒత్తిడితో నలిగిపోతున్న పోలీసు అధికారులకు సిబ్బందికి కాస్తంత ఊరట లభిస్తుందన్నారు. మరీ ముఖ్యంగా విధులతో పాటు నిరంతరాయంగా వ్యాయామం చేస్తూ ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహిస్తూ, వ్యాయామం మంచి ఆహారపు అలవాట్లు పాటిస్తూ, సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్నారు. మంచి ఆరోగ్యంగా ఉంటేనే, విధులను సమర్థవంతంగా నిర్వహించగలమని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరు విజేతలే. జయాప జయాల గూర్చి చింతించకుండా, వాటిని సంతోషంగా స్వీకరించాలనీ సూచించారు. ఈ పోటీల్లో విజేతలైన వారందరికీ అభినందనలు తెలిపారు. స్పోర్ట్స్ మీట్ ను విజయవంతంగా నిర్వహించడంలో కృషి చేసిన అధికారులకు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లకు, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ మెమెంటోలను అందజేసి అభినందించారు. ఓవర్ ఆల్ విజేతగా డిస్ట్రిక్ట్ ఆర్మ్డ్ రిజర్వ్ జట్టు నిలిచింది. పురుషుల విభాగంలో జీ. కృష్ణ నిలిచారు. మహిళల విభాగంలో జీ. సునీత నిలిచారు. వాలీ బాల్ విజేతగా డిస్ట్రిక్ట్ ఆర్మ్డ్ రిజర్వ్, రన్నర్ అప్ చీరాల సబ్ డివిజన్ జట్టు నిలిచాయి. కబడ్డీ విజేతగా బాపట్ల డివిజన్, రన్నర్ అప్ చీరాల సబ్ డివిజన్ జట్టులు నిలిచాయి. టగ్ ఆఫ్ వార్ విజేతగా చీరాల సబ్ డివిజన్ రన్నర్ అప్ డిస్ట్రిక్ట్ ఆర్మ్డ్ రిజర్వ్ జట్టులు నిలిచాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి. విటలెశ్వర్, చీరాల, బాపట్ల, రేపల్లె డిఎస్పి మోయిన్, రామాంజనేయులు, శ్రీనివాసరావులు, ట్రైనీ డిఎస్పి అభిషేక్, ఇతర పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## కనుల పండుగగా శ్రీవారి కళ్యాణ మహోత్సవం.

సామూహిక కుంకుమ పూజలు, వైభవంగా గ్రామోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే పితాని.



**పోడూరు, ఫిబ్రవరి 3,ప్రజాజ్యోతి న్యూస్. పశ్చిమగోదావరి జిల్లా** పోడూరు మండలం కొమ్ము చిక్కాల లో వేంచేసి ఉన్నశ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి మాజీ మంత్రి ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ నిర్మించిన ఆలయంలో బ్రహ్మశ్రీ మానేపల్లి రామలింగేశ్వర శర్మ ఆశీస్సులతో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామికి ఏకదశ వార్షికోత్సవ భాగంగా శ్రీవారి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వైశాఖ ఆగమ శాస్త్ర ప్రకారం మంగళ వాయిద్యాలు వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య స్వామివారి కళ్యాణం మహోత్సవం లో శాసనసభ్యులు పితాని సత్యనారాయణ అనంత లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలిత ఆలయావరణంలోని శాంతి హోమం నిర్వహించారు. లోక కళ్యాణార్థం లోక శాంతి కోసం హోమాలు చేశారు. సామూహికంగా మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం భూదేవి శ్రీదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి గ్రామోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో శ్రీవారి గ్రామోత్సవం విచిత్ర వేషధారణలు, వాయిద్యాలు , తీన్మార్ డప్పు విన్యాసాల గ్రామోత్సవం కనుల పండుగ జరిగింది. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు,భక్తులుతదితరులు పాల్గొన్నారు.

## సోలార్ విద్యుత్ యూనిట్స్ లక్ష్యం మేరకు కార్యాచరణ సిద్ధం చేయాలి..

కలెక్టర్ పి ప్రశాంతి..




**రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 3 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** సోలార్ విద్యుత్ ఉత్పత్తి వినియోగదారులకు చేకూరే ప్రయోజనం వివరించి యూనిట్స్ స్థాపన కోసం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు.స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏపీ ట్రాన్స్కో క్షేత్ర స్థాయి అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రీన్ ఎనర్జీ ని ప్రోత్సహించే లక్ష్యంతో సోలార్ విద్యుత్ యూనిట్స్ ఏర్పాటు చేయడం పై దృష్టి సారించాలని స్పష్టం చేశారు. విద్యుత్ ఉత్పత్తి విధానంలో గ్రీన్ ఎనర్జీ ని ప్రోత్సహించే దిశగా క్షేత్ర స్థాయి విద్యుత్ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు ఎక్కువ విద్యుత్ వినియోగం చేసే వినియోగదారుల జాబితా సిద్ధం చేసుకోవాలన్నారు. వాటికి అనుగుణంగా ఆయా వినియోగదారుల గృహాలను సందర్శించి అవగాహన కల్పించాలని, యూనిట్స్ స్థాపన నేపథ్యంలో మార్గదర్శకాలను సమగ్రంగా వివరించాలని అన్నారు. విద్యుత్తు శాఖ క్షేత్ర స్థాయి అధికారులకు, సిబ్బందికి 2 వేల యూనిట్ల, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ వెయ్య యూనిట్స్ ఏర్పాటు చేయాలని, ఆ మేరకు మండలాల వారీగా లక్ష్యాలను నిర్ణయించాలని ఆదేశించారు. ఎక్కువ విద్యుత్తు వినియోగం చేసే వినియోగదారుల గుర్తింపు ద్వారా సోలార్ యూనిట్స్ ఏర్పాటు సాధ్యం అవుతుందని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా ఏపీ ఈపిడిసిఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కే. తిలక్ కుమార్, డి ఆర్ డి ఏ పిడి ఎస్ వి వి ఎస్ మూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఎన్. సామ్యూల్, వై. డేవిడ్, వై. నారాయణ అప్పారావు, డి.శ్రీధర్ వర్మ, విద్యుత్ శాఖ ఇంజనీర్లు ఏ ఈ లు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సోర్ట్స్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నాగరాజుని అభినందించిన కలెక్టర్



**బాపట్ల జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** జిల్లా పోలీస్ స్పోర్ట్స్ మీట్ లో ప్రతిభ కనబరిచిన గన్మన్ నాగరాజు ను జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఐఏఎస్ అభినందించారు జిల్లా పోలీస్ గ్రౌండ్ లో జరిగిన జిల్లా స్పోర్ట్స్ మీట్ లో అథ్లెటిక్స్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాపట్ల జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి గన్మెన్ నాగరాజు సోమవారం జిల్లా కలెక్టర్ ను తన కార్యాలయంలో కలిశారు నాగరాజు గెలుపొందిన 4 బంగారు పతాకాలు ఒక సిల్వర్ పథకాన్ని 1500 మీటర్ 800 మీటర్, 4ఐ100 మీటర్, 4ఐ400 మీటర్ 400 మీటర్ సిల్వర్ మెడల్స్ ను ఉత్తమ ప్రతిభ కనబరిచి గెలుపొందిన సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగరాజుని అభినందించారు

## గ్రాడ్యుయేట్ ఎన్నికల నేపథ్యంలో పిజిఆర్ఎస్ రద్దు జిల్లా కలెక్టర్ ప్రశాంతి



**రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 3 ప్రజా జ్యోతి ప్రతినిధి** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మార్చి 8 వరకు పీ జీ ఆర్ ఎస్ రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ పీ. ప్రశాంతి వెల్లడించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి మధ్య పి జి ఆర్ ఎస్ సెషన్‌లకు సంబంధించిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించడం జరగదని, ప్రస్తుతం ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న జిల్లాల కోసం ఎన్నికల కమిషన్ సూచనలు చేసినట్లు జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ ఎత్తివేసే వరకు ఫిర్యాదులను సమర్పించడానికి "మీకోసం" ఆన్‌లైన్ పోర్టల్‌ని ఉపయోగించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు వ్యయ ప్రయాసలకు లోనుకాకుండా ఉండేందుకు, జిల్లా, డివిజన్, మండల స్థాయిలో పి జి ఆర్ ఎస్ నిర్వహించడం జరగనందున ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని అర్జీలు ఇవ్వడానికి కలెక్టిరేట్, డివిజన్, మండల కేంద్రాలకు రావద్దని కలెక్టర్ తెలిపారు.

## మైనర్లపై వికృత దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి..

వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాధరావు డిమాండ్..

ఆసుపత్రిలో మైనర్లను పరామర్శించిన జెట్టి ..



**జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 3 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** జంగారెడ్డిగూడెం లో మైనర్ బాలిక రజిత శ్రీ రేణుక,మైనర్ బాలుడు ఉదయ రాహుల్ పై వికృత దాడి కి వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావు తీవ్రంగా ఖండించారు. ఈ నేపథ్యంలో జంగారెడ్డిగూడెం స్థానిక వంద పడకల ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మైనర్ బాలుడు రాహుల్, బాలిక రేణుక లను పరామర్శించారు. అతి క్రూరంగా హింసించి బాధించి చిత్రహింసలకు గురిచేసి చిన్న బిడ్డలను చంపేయాలని చూసిన నల్ల వెలుగుల పవన్ కుమార్, గానాల శారద లపై చట్టపరమైన చర్యలు తీసుకొని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని జెట్టి గురునాథరావు డిమాండ్ చేశారు.అవసరమైతేచట్ట సవరణ చేసి ఇట్లాంటి వారికి కఠినమైన ఉరిశిక్ష విధించాలని వారు చేసింది క్షమించరాన్ని నేరమని వెంటనే వారి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. చిన్న బిడ్డలను ఎవరు హింసించి చిత్రహింసలు గురిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకునేలాగా శిక్షలు ఉండాలని ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేశారు. కార్యక్రమంలోమాజీ జెడ్పిటిసి ముప్పుడి శ్రీనివాసరావు,వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు బత్తిన చిన్న, జంగారెడ్డి వార్డు కౌన్సిలర్ అయినాల వెంకటరమణ,కేమిశెట్టి మల్లిబాబు, వీరవల్లి సోమేశ్వరరావు, అమీర్, గగ్గాల కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీనివాసుని వార్షిక కళ్యాణం..



**జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 3 (ప్రజా జ్యోతి ప్రతినిధి):** ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం గ్రామంలో తెల్ల మద్ది చెట్టు క్రింద స్వయంభువులై వెలిసిన శ్రీ మద్ది ఆంజనేయస్వామి వారి ఉప ఆలయం వద్ద ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామివారి వార్షిక కల్యాణం సందర్భంగా అర్చక స్వాములు ఆలయ ముఖ మండపంపై ప్రత్యేక పూలతో అలంకరించిన వేదికపై శ్రీ భూ సామెత వేంకటేశ్వర స్వామివార్లను ఆశీనులనుచేసి శాస్త్రోక్తంగా కల్యాణ క్రతువు నిర్వహించారు. కల్యాణం తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. కన్నుల పండుగగా నిర్వహించిన కల్యాణం అనంతరం ఆలయ సిబ్బంది భక్తులకు ప్రసాదాలు అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. శ్రీస్వామివారి దర్శనానికి విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలక్కుండా ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారిణి ఆర్వీ.చందన తెలిపారు.

## పలివెల కుటుంబాన్ని పరామర్శించిన ముదునూరి



**అన్నవరం ప్రజా జ్యోతి రిపోర్టర్ బి ఎస్ వి ప్రసాద్** ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం అన్నవరం గ్రామంలో పలివెల ఈశ్వరరావు అమ్మ ఇటీవల స్వర్గస్తులయ్యారు వారి కుటుంబాని పరామర్శించి 5000 ఆర్థిక సాయం చేసిన ఎం ఎం ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ సిపి నాయకులు ముదునూరి మురళీకృష్ణం రాజు ఈ కార్యక్రమం సీనియర్ నాయకులు కొండపల్లి అప్పారావు వైస్ సర్పంచ్ బొబ్బిలి వెంక్కన ఎంపీటీసీ దడాల సతీష్, వార్డ్ సభ్యులు కొల్లు చిన్న పలివెల కొండలరావు కోలా తాతబాబు బొల్లు నాగేశ్వరరావు బొల్లు సత్యాలు జువ్వల దొరబాబు మర్రి సుబ్బారావు గమరియు ముఖ్య నాయకులు శ్రేణులు పాల్గొన్నారు

## 18వ వార్షికోత్సవ ప్రజా జ్యోతి జర్నలిస్ట్ డైరీ ని ఆవిష్కరించిన కలెక్టర్



**బాపట్ల జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** ప్రజాజ్యోతి దినపత్రిక 18వ వార్షికోత్సవం సందర్భంగా బాపట్ల జిల్లాలో ప్రజాజ్యోతి జర్నలిస్ట్ 2025 నూతన సంవత్సరం డైరీని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఈ కార్యక్రమంలో ప్రజా జ్యోతి రాష్ట్ర కోఆర్డినేటర్ మార్పు అనంద్ పాల్గొన్నారు

## ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి అభ్యర్థిని గెలిపించేలా కృషి చేయాలని కార్యకర్తలకు నాయకులకు పిలుపునిచ్చిన ఎమ్మెల్యే



**బాపట్ల జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** ఉమ్మడి గుంటూరు కృష్ణ జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో సోమవారం బాపట్ల నియోజకవర్గంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు ఆధ్వర్యంలో నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో నాయకులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలసికట్టుగా పని చేసి కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ని భారీ మెజారిటీతో గెలిపించాలని బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే తెలిపారు గత ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు నాయకులు అత్యంత శ్రద్ధతో సమన్వయంతో కష్టపడి పనిచేసి కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు అదే స్ఫూర్తితో ఈ ఎమ్మెల్సీ ఎన్నికలను కూడా సమన్వయంతో పనిచేసి ఎక్కడ ఏ పొరపాటు జరగకుండా ఎమ్మెల్సీగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ ని గెలిపించే దిశగా కష్టపడి పని చేద్దామని కూటమి నాయకులకు కార్యకర్తలకు ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు పిలుపున్నిచ్చారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం జనసేన బిజెపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు

# పరిటాల ఘాట్ వద్ద నివాళి.. ఎమ్మెల్యే సునీతతో భేటి





- క్రీడా పరంగా నియోజకవర్గంలో సమస్యల్ని వివరించిన ఎమ్మెల్యే సునీత
- రామగిరి స్టేడియంను పరిశీలించిన శాప్ ఛైర్మన్ రవి నాయుడు
- చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి స్టేడియంలు నిర్మిస్తామన్న రవినాయుడు

**అనంతపురం ఫిబ్రవరి 3:** గత ఐదేళ్లలో క్రీడా వ్యవస్థ పూర్తిగా అధ్వాన్నంగా మారిందని.. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ రామగిరిలోని పరిటార రవీంద్ర స్టేడియం అని శాప్ ఛైర్మన్ రవినాయుడు అన్నారు. ఆయన సోమవారం వెంకటాపురంలో ఎమ్మెల్యే పరిటాల సునీతను మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా పరిటాల రవి ఘాట్ వద్ద నివాళులర్పించారు. అనంతరం పరిటాల నివాసంలో ఎమ్మెల్యే సునీతతో భేటి అయ్యారు. క్రీడా పరంగా నియోజకవర్గంలో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే సునీత వివరించారు. పాఠశాలల్లో క్రీడల పరంగా ఎలాంటి సౌకర్యాలు లేవన్నారు. గతంలో తాము ఏర్పాటు చేసిన వాటిని కూడా పర్యవేక్షణ లేక నిర్వీర్యం చేశారన్నారు. రామగిరి, చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి స్పోర్ట్స్ స్టేడియంల గురించి చర్చించారు. వైసీపీ హయాంలో అవి ఎలా మరుగున పడ్డాయన్నది ఎమ్మెల్యే సునీత వివరించారు. అనంతరం రామగిరి ఎంజేపీ పాఠశాలకు చెందిన జూడో టీం విద్యార్థులు శాప్ ఛైర్మన్ ను కలిశారు. ఇటీవల రాష్ట్రంలో సాధించిన పతకాలతో ఎమ్మెల్యే సునీత సమక్షంలో శాప్ ఛైర్మన్ ని కలిశారు. ఒక మారు మూల ప్రాంతం నుంచి వచ్చిన విద్యార్థులు ఇలా జూడో వంటి క్రీడల్లో రాణించడం అభినంద నీయమన్నారు. ఈ పాఠశాలలో క్రీడలు ఆడుతున్న వారిని ప్రోత్సహించాలని.. ఎలాంటి అవసరం ఉన్నా తనను సంప్రదించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అక్కడి నుంచే నేరుగా రవినాయుడు రామగిరిలోని పరిటాల రవీంద్ర మెమోరియల్ స్టేడియంకు వెళ్లారు. స్థానిక టీడీపీ నాయకులు, శాప్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులతో కలిసి స్టేడియంను పరిశీలించారు. టీడీపీ హయాంలో 2కోట్ల 20లక్షలతో స్టేడియం నిర్మిస్తే.. ఆతర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో దీనిని పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. రామగిరి ప్రాంతంలో విద్యార్థులు, క్రీడాకారులకు ఉపయోగపడే ఈ స్టేడియంను అధ్వాన్నంగా మార్చేశారని టీడీపీ నాయకులు వివరించారు. వెంటనే వీటి మరమ్మతులకు అంచనాలు సిద్ధం చేయాలని రవినాయుడు ఆదేశించారు. స్టేడియంకు పూర్వ వైభవం తెస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు గత టీడీపీ ప్రభుత్వంలో 2.20కోట్ల అంచనాలతో చేపట్టిన చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి స్టేడియంల నిర్మాణం కూడా వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిలిపివేశారన్నారు. అప్పటి వరకు చేసిన ఖర్చు.. వృథా అయిందన్నారు. ఈ రెండు స్టేడియంలు కచ్చితంగా నిర్మిస్తామని.. తాజాగా అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గత వైసీపీ ప్రభుత్వంలో అన్ని ప్రాంతాల్లో ఇలా క్రీడా వ్యవస్థను అధ్వాన్నంగా మార్చేశారని రవినాయుడు మండిపడ్డారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో క్రీడల పట్ల యువతకు చాలా ఆసక్తి ఉందని.. వారిని అన్ని విధాలు ప్రోత్సహిస్తామన్నారు...



## వైభవంగా కొమ్మనబోయిన - పెరుగు వారి వివాహ మహోత్సవ వేడుక



**గుంటూరు ఫిబ్రవరి 3:** సీనియర్ పోలీసు అధికారి నరసరావుపేట డిఎస్పి కొమ్మనబోయిన నాగేశ్వరరావు - శ్రీమతి సుబ్బాయమ్మ దంపతుల కుమారుడు చి. అభిలాష్ కుమార్..... శ్రీ పెరుగు భాస్కరరావు - శ్రీమతి జయలక్ష్మి దంపతుల కుమార్తె చి. ల. సౌ. ప్రవల్లిక ల వివాహం సోమవారం తెల్లవారుజామున నరసరావుపేట మెగా కన్వెన్షన్ హాలులో వైభవోపేతంగా జరిగింది. బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, పలు రంగాలు, పలు ప్రభుత్వ శాఖలకు చెందిన ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## తెలుగు వెలుగు సాహితీ నిర్వాహకులు టి.వి.రెడ్డి కి గౌరవ పురస్కారం!



**అనంతపురం ఫిబ్రవరి 3:** అనంతపురం తెలుగు వెలుగు సాహిత్య,సామాజిక సేవా సంస్థ నిర్వాహకులు శ్రీ టీ వి రెడ్డి కి అనంతపురం ఫిల్మ్ సోసైటీ దర్శకులు,ఫిల్మ్ మేకర్ చిత్ర ప్రముఖుల ఆధ్వర్యంలో గౌరవ సత్కారం అందుకున్న సందర్బంగా ఆయన మాట్లాడుతూ తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవా సంస్ద ని సాహితీ అభిమానులకు కృతజ్ఞతలు మరియూ ఈ పురస్కారం అందజేసిన వారికి తన సాహితీ ధన్యవాదములు తెలియజేసారు.

# జవాబు దారీతనంతో అధికారులు పరిష్కరించాలి





- ఏ ఒక్క అర్జీ రీఓపెన్ కాకుండా చెయ్యాలి.
- పి జి ఆర్ ఎస్ మీ కోసం"లో ప్రజల నుంచి 224 అర్జీలు స్వీకరించాం
- జిల్లా కలెక్టరు టీఎస్ చేతన్

**పుట్టపర్తి, ఫిబ్రవరి 3:** శ్రీ సత్య సాయి జిల్లా లోని అన్ని నియోజకవర్గాలప్రజల సమస్యలు జవాబు దారీతనంతో అధికారులు పరిష్కరించాలని జిల్లా కలెక్టరు టీఎస్ చేతన్ అన్నారు. శ్రీ సత్య సాయి జిల్లా లోని కలెక్టరేట్ లోని పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి 224 అర్జీలను స్వీకరించుచున్న జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ జిల్లా కలెక్టర్ తో పాటు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే కార్యక్రమంలోజాయింట్ కలెక్టర్, అభిషేక్ కుమార్, డిఆర్ఓ విజయ్ సారథి, డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి,పుట్టపర్తి ఆర్డిఓ సువర్ణ,వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలు మరింత వేగవంతం చేసే ఉద్దేశ్యంతో ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించే లక్ష్యంతో రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రతిష్టా త్మకంగా ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. పుట్టపర్తి రూరల్ పరిధిలోని, కర్ణాటక నాగేపల్లి లోవెంకటలక్ష్మి, అనే నేను నా పేరు మీద ఉన్న భూమి ఆన్లైన్లో తప్పుగా నమోదు అయిందని, సరి చేయించాలని అర్జీ సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జిఎం నాగరాజు, పట్టు పరిశ్రమ శాఖ పద్మావతి, సుదర్శన్, సిపిఓ విజయ్ కుమార్, హౌసింగ్ వెంకటరమణారెడ్డి, ల్యాండ్ సర్వే విజయశాంతి భాయ్ రమణ కుమార్, ఉద్యానవన శాఖ చంద్రశేఖర్, మత్స్యశాఖ చంద్రశేఖర్ రెడ్డి, తిపేంద్ర నాయక్, గిరిజన సంక్షేమ అధికారి మోహన్ రావు, సాంఘిక సంక్షేమ శాఖ ప్రతినిధి, శివరంగ ప్రసాద్, హ్యాండ్లూమ్స్ మరియు టెక్స్టైల్స్ శాఖ అధికారి రామకృష్ణ ఆర్డబ్ల్యూఎస్ ఎస్సి ఈ మల్లికార్జునయ్య, జిల్లా క్రీడల శాఖ అధికారి ఉదయ్ కుమార్, జెడ్ ఎమ్ సహాని సోని, గ్రామ వార్డు సచివాలయం నోడల్ ఆఫీసర్, సుధాకర్ రెడ్డి, డి ఎం అండ్ హెచ్ ఓ, ఫిరోజ్ బేగం , నాగమల్లేశ్వరి, స్కిల్ డెవలప్మెంట్ అధికారి హరి కిరణ్, పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ ప్రహల్లాద ఎస్ సి పి ఆర్ మురళి, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి సహదేవ, ఆర్ అండ్ బి ఎస్ సి ఈ సంజీవయ్య, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ధర్మవరం సామాజికవేత్త గడ్డం రాజగోపాల్ ఆరోగ్యం పై పరామర్శించిన ధర్మవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్

సీపీఐ రాష్ట్ర నాయకులు కె.రామకృష్ణ





**ధర్మవరం ఫిబ్రవరి 3:** హైదరాబాదులోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్లో వైద్య సేవలు పొందుతున్న విషయం తెలిసిన వెంటనే ధర్మవరపు రాజా హాస్పిటల్ వెళ్లి ఫోన్ ద్వారా సామాజికవేత్త గడ్డం రాజగోపాల్ ఆరోగ్యం గురించి ధర్మవరం నియోజవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పరిటాల శ్రీ రామ్ పరామర్శించారు. సోమవారం హాస్పిటల్ కు వెళ్లి గడ్డం రాజగోపాల్ గారి ఆరోగ్య పరిస్థితిలో అడిగి తెలుసుకున్నారు . బసవతారకం ఆస్పటల్ ప్రధానమైన డాక్టర్లను కలిసి.
గడ్డం రాజు గోపాల్ వైద్యం పై ప్రత్యేక చొరవ తీసుకొని మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు.అదేవిధంగా రాష్ట్ర సీపీఐ నాయకులు కె.రామకృష్ణ సైతం రాజగోపాల్ ఆరోగ్యం పరిస్థితి గురించి స్వయం గా అడిగి తెలుసుకున్నారు.

## ప్రజా ప్రతినిధులు సహకారంతో క్రీడాభివృద్ధి చేస్తాం

అనంతపురం అర్బన్, మడకశిర ఎమ్మెల్యేలతో శాప్ ఛైర్మన్ రవినాయుడు



**అనంతపురం, ఫిబ్రవరి 03 :** ఉమ్మడి అనంతపురం జిల్లాలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో క్రీడావసతులను నెలకోల్పేందుకు ప్రజాప్రతినిధుల సహకారం అవసరమని, దానిలో భాగంగానే సీఎం చంద్రబాబు నాయుడు గారి ఆదేశాల మేరకు ఆయా జిల్లాల్లోని శాసన సభ్యులను, పార్లమెంటు సభ్యులను సమన్వయం చేసుకుంటూ క్రీడల అభివృద్ధికి కృషి చేస్తున్నామని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు వివరించారు. స్థానిక ఆదర్శనగర్‌లోని మడకశిర ఎమ్మెల్యే నివాసంలో టిటిడి బోర్డు మెంబర్ మరియు ఎమ్మెల్యే ఎమ్ఎస్.రాజుతోపాటు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటటేశ్వర ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా శాప్ ఛైర్మన్ కలిశారు. ఈ సందర్భంగా వారిరువురితో శాప్ ఛైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ నియోజకవర్గంలోనూ క్రీడావికాస కేంద్రాల నిర్మాణానికి రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్రంలోని క్రీడాకారులందరికీ వారి ప్రాంతాల్లోనే అత్యుత్తమ ప్రమాణాలతో క్రీడాసౌకర్యాలను ఏర్పాటు చేయడమే సీఎం చంద్రబాబు నాయుడు సంకల్పమన్నారు. అలాగే విద్యాశాఖమంత్రి నారా లోకేష్ సూచనల మేరకు క్రీడల అభివృద్ధికి పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, క్రీడా ప్రోత్సాహకులతో సీఎస్ఆర్ నిధుల సమకూర్చాలని కోరుతున్నామన్నారు. దీనిపై వారు కూడా సానుకూలంగా స్పందిస్తూ క్రీడాకారుల అభివృద్ధికి తమవంతు సాయశక్తులా కృషి చేస్తామని హామీ ఇవ్వడం పట్ల శాప్ ఛైర్మన్ హర్షం వ్యక్తం చేశారు.

## పేద, మధ్య తరగతి కుటుంబాలకు అర్హులైన ప్రతి ఒక్కరికి కొత్త రేషన్ కార్డులు వెంటనే ఇవ్వాలి



ధర్మవరం ఆర్ డి ఓ కు వినతి

**ధర్మవరం ఫిబ్రవరి 3:** ధర్మవరం నియోజకవర్గం లో రేషన్ కార్డు లేని వారికి కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని సిపిఐ ఆధ్వర్యంలో ఆర్డిఓమహేష్ సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు తో పాటు పలువురు నాయకులు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రేసిడెంట్ కాటమయ్య సిపిఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్, సహాయ కార్యదర్శి ఎర్రం శెట్టి రమణ, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ,గౌరవ అధ్యక్షులు వెంకటస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు, సన్న పెద్దన్న పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముసుగు మధు మాట్లాడుతూ ధర్మవరం నియోజకవర్గ వ్యాప్తంగా చాలా గ్రామాల్లో కొత్త రేషన్ కార్డు ల కోసం ఎంతో మంది ఎదురుచూస్తున్నారు అని తెలిపారు. ఇప్పటికే స్టోర్ బియ్యంతో జీవనం గడుపుతున్న కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని తెలిపారు. గతం నుంచి ఈ సంక్షేమ పథకాల పేరుతో కొత్త రేషన్ కార్డులు ఆపడం సరైనది కాదు. అర్హత ఉన్న కూడా రేషన్ కార్డులు లేని వారు చాలా మంది వున్నారు అని గుర్తు చేశారు.అనేక సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారని, రేషన్ కార్డు ద్వారానే ఆదాయ,ధ్రువీకరణ,ద్వారా చదువుకున్న విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ వర్తిస్తుంది అన్నారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రేషన్ కార్డులకు అర్హులైన వారిని ఎంక్వయిరీ నిర్వహించి రేషన్ కార్డులను మంజూరు చేయాలని తద్వారా చదువుకున్న విద్యార్థులకు, రేషన్ బియ్యం తోనే పూట గడుపుతున్న కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమవుతున్న కుటుంబాలకు న్యాయం జరుగుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు, శ్రీధర్, శ్రీనివాసులు,బాలరంగయ్య, ఆదినారాయణ,శ్రీనివాసులు, చెన్న బుజంగం,కొండ, బాబు,గంగాధర్, రవీంద్ర, మల్లికార్జున,మరియు మహిళ సమాఖ్య తరపున లలితమ్మ, లింగమ్మ, ఈరమ్మ, ఆశా తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి

రోడ్డు పరిశీలనలపాటించాలిఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

రుద్రంపేట పంచాయితి బ్యాంకు కాలనీలో నూతనంగా సిమెంట్ రోడ్ల నిర్మాణం



**అనంతపురం ఫిబ్రవరి 3:** కూటమి ప్రభుత్వం వచ్చాకనే రాష్ట్రంలో రోడ్లకు మోక్షం వచ్చిందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అర్బన్ నియోజకవర్గ పరిధిలోని రుద్రంపేట పంచాయతీ బ్యాంక్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సిమెంట్ రోడ్లను ఆయన పరిశీలించారు. అక్కడి కాంట్రాక్టర్, స్థానిక నాయకులతో మాట్లాడారు. పనులు ఎప్పటిలోగా పూర్తవుతాయని ఆరా తీశారు. పనుల నాణ్యతలో ఎక్కడా లోపం ఉండకూడదన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ నియోజకవర్గంలో చాలా చోట్ల రోడ్ల సమస్య ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కొన్ని ప్రాంతాలను పూర్తిగా విస్మరించారన్నారు. అందుకే ఎక్కడ రోడ్డు అవసరం ఉన్నా వెంటనే అంచనాలు పంపుతున్నామన్నారు. నగరంతో పాటు నాలుగు పంచాయతీల్లో రోడ్లు, డ్రైనేజీ సమస్య లేకుండా చేస్తున్నామని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో నగారాభివృద్ధి వేగంగా జరుగుతోందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కొనంకి గంగారామ్, టీడీపి నగర ప్రధాన కార్యదర్శి ముక్తియార్, జిల్లా ఉపాధ్యక్షుడు డిష్ నాగరాజు, టిడిపి నాయకులు భక్తవత్సలం నాయుడు, గోపాల్ గౌడ్, సింగమనేని రామాంజినేయులు, కడియాల కొండన్న, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలి





**జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,**

**అనంతపురం, ఫిబ్రవరి 03 :** అనంతపురం జిల్లా వివిధ నియోజకవర్గాల ప్రజల నుంచి వచ్చే అర్జీలను వెంటనే నాణ్యతతో పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ అధికారులు ఆదేశించారుఅనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన “ప్రజా సమస్యల పరిష్కార వేదిక” (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ తో పాటు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డిఆర్ఓ ఎ.మాలోల, డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, ఆనంద్, శిరీష, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 418 అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఇందులో భాగంగా ప్రజల వద్దకే వెళ్లి జిల్లా కలెక్టర్ అర్జీలను స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... పిజిఆర్ఎస్ లో వచ్చిన సమస్యలను ఎలాంటి ఆలస్యం కాకుండా ఎప్పటికప్పుడు నాణ్యత కలిగిన పరిష్కారం చేయాలన్నారు. అర్జీల పరిష్కారంపై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అనంతరం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం, రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం 10.02.2025 మరియు మాప్ -అప్ 17.02.2025 పోస్టర్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, విడుదల చేశారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, అనంతపురము వారి ఆధ్వర్యంలో నులిపురుగులు సోకిన పిల్లలు, కిశోర బాలల కడుపులో నులిపురుగులు ఉన్నట్లయితే వివిధ ప్రమాదకరమైన అరోగ్య సమస్యలను ఎదుర్కొంటారన్నారు. రక్తహీనత ,పోషకాల లోపం, ఆకలి మందగించడం, నిరసం మరియు శరీరక,మానసిక ఎదుగుదల లోపాలను కలిగి ఉంటారని, జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమము రోజులలో డి వార్మింగ్ చేయబడిన పిల్లలకు రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా ఈనెల 10.02.2025 మరియు 17.02.2025 మాప్ -అప్ రోజుల్లో అల్బేండజోల్ 400 మి.గ్రా. మాత్రలు అన్ని అంగన్వాడీలు, పాఠశాలలు, కళాశాలలో ఉచితంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, అనంతపురము వారిచే పంపిణీ చేపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పి సిఈఓ ఆర్.రామచంద్ర రెడ్డి, సిపిఓ అశోక్ కుమార్, పశుసంవర్ధక శాఖ జెడి వెంకటస్వామి, డ్వామా పిడి సలీమ్ భాష, డిఆర్డిఏ పిడి ఈశ్వరయ్య, ఐసిడిఎస్ పిడి వనజా అక్కమ్మ, హార్టికల్చర్ డిడి నరసింహారావు, ఏపిఎంఐపి పిడి రఘునాథరెడ్డి, సైనిక సంక్షేమ శాఖ అధికారి తిమ్మప్ప, ఏపీఎస్పీడిసిల్ ఎస్ఈ సంపత్ కుమార్, ఆర్టీసీ ఆర్ఎం సుమంత్, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, డిసిహెచ్ఎస్ డా.పాల్ రవికుమార్, డిటిసి వీర్రాజు, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి రామసుబ్బారెడ్డి, హౌసింగ్ పిడి శైలజ, సర్వే ఏడి రూప్ల నాయక్, ఎల్డిఎం నర్సింగరావు, మైన్స్ డిడి వెంకటేశ్వర్లు, మార్కెటింగ్ ఎడి సత్యనారాయణ చౌదరి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీధర్, డిఐపిఆర్ఓ గురుస్వామి శెట్టి, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడి వినోద్,డీఈవో ప్రసాద్ బాబు, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ డా.కిరణ్ కుమార్ రెడ్డి, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ మాణిక్యరావు, పి జిఆర్ ఎస్ తహసీల్దార్ వాణిశ్రీ, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ లు యుగేశ్వరి దేవి, వసంతలత, తదితరులు వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ‘ఫీజు పోరు’కు తరలిరండి


- వైసీపీ అనంతపురం జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యులు బీసీ రమేష్‌గౌడ్
- మద్దతు తెలిపిన ఐక్య విద్యార్థి సంఘాలు
- స్వచ్ఛందంగా విద్యార్థులు, తల్లిదండ్రులు తరలిరావాలని పిలుపు




**అనంతపురం, ఫిబ్రవరి 3 :**కూటమి ప్రభుత్వంలో అన్యాయానికి గురవుతున్న విద్యార్థులకు అండగా ఉండేందుకు ఈనెల 5న (బుధవారం) వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టనున్న ‘ఫీజు పోరు’కు సిద్ధంగా ఉన్నామని ఆ పార్టీ అనంతపురం జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యులు, బీసీ సెల్ రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి రమేష్ గౌడ్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఏఐఎస్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాపిరెడ్డిపల్లి పృథ్వీ, పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు మంజుల నరేంద్ర, జీవీఎస్ఎస్ జాతీయ ఉపాధ్యక్షులు మల్లికార్జున నాయక్, గిరిజన విద్యార్థి నాయకులు లక్ష్మీపతి నాయక్, ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్షులు బిల్లే జగదీష్, ఎస్వీఎస్ఎఫ్ బీసీ చక్రధర్ యాదవ్, హర్ష, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జెన్నే చిరంజీవి, బీసీ ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కేశవ గౌడ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ సభ్యులు రమేష్‌గౌడ్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం రూ.3900 కోట్ల ఫీజు రీఎంబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ.. ఈనెల 5న అనంతపురంలోని జెడ్పీ కార్యాలయం వద్ద నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. సప్తగిరి సర్కిల్, సూర్య నగర్ మీదుగా కలెక్టరేట్ వరకు చేరుకుని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందివ్వనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం విద్యను కూటమి ప్రభుత్వం రద్దు చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం వద్దంటూ తెలుగు మహాసభల్లో కూటమి నేతలు, మేధావులు అని చెప్పుకునే మాజీ సుప్రీంకోర్టు జడ్జి ఎంవీ రమణ, రామోజీరావు కోడలు శ్కైలజా కిరణ్ తదితరులు మాట్లాడటం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. కేవలం ఇలాంటి తెలుగు మహాసభల్లో మాత్రమే తెలుగు ముద్దు.. ఇంగ్లీష్ వద్దు.. అంటారు కానీ, స్వయానా రామోజీరావు కోడలు శ్కైలజా కిరణ్ నడుపుతున్న రమాదేవి పబ్లిక్ స్కూలులో తెలుగు సబ్జెక్టు లేకుండా జర్మన్, ఫ్రెన్స్, రష్యన్ మొత్తం ఇంగ్లీష్‌లోనే మాట్లాడేలా నడుపుతున్నది నిజం కాదంటారా.. ధనవంతుల పిల్లలు ఇంగ్లీషులో మాట్లాడాలి.. పేద పిల్లలు ఇంగ్లీషులో చదవకూడదా అంటూ రమేష్ గౌడ్ ప్రశ్నించారు. కేవలం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణాలకు చెందిన పేద పిల్లలు ఇంగ్లీష్ మీడియంలో చదువుకోకుండా.. డబ్బున్నటువంటి, మీలాంటి ఇళ్లలో పాచి పనులు చేయాలా.. అంటూ నిలదీశారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం రూ.1780 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టిపోతే వైఎస్ జగన్ సీఎం కాగానే ఆ బకాయిలను విడుదల చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా 37 వేల పైచిలుకు పాఠశాలలను నాడు– నేడు పథకం కింద అభివృద్ధి చేసి.. కార్పొరేట్ దీటుగా ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టి పేద విద్యార్థులకు పెద్దపీట వేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు అవుతున్నా ఒక్క రూపాయి కూడా చెల్లించ లేదన్నారు. తాజాగా ఫీజులు చెల్లించాలని కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. లేకపోతే పరీక్షలకు సైతం అనుమతించేది లేదని తేల్చి చెబుతున్నారన్నారు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నట్లు చెప్పారు. కొన్ని చోట్ల ఫీజుల ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి తరుణంలోనే విద్యార్థులకు అండగా వైఎస్ఆర్ సీపీ ఆధ్వర్యంలో ‘ఫీజు పోరు’ నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, స్వచ్ఛందంగా తరలిరావాలని కోరారు. సమావేశంలో వైసీపీ నాయకులు బెస్త వెంకటేష్, చంద్ర, నరసింహులు, నాగేంద్ర, వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు లబ్బె రాఘవ, వంశీ, మోహన్, గణేష్, మారుతి, బాలాజీ, వినీత్, రోహిత్ కుమార్, చిన్న, హరీష్, మణికంత, విద్యార్థి విభాగం నగర అధ్యక్షులు కైలాష్, వైసీపీ నాయకులు, విద్యార్థి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గోవిందునికి అరుదైన విరాళం

- వెంకన్నకు కానుకగా ఆదా చేసిన ప్రతి పైసా
- ఎస్వీ సర్వ శ్రేయాస్ ట్రస్ట్‌కు రూ.50 లక్షలు విరాళం
- దాత శ్రీమతి మోహనను అభినందించిన టీటీడీ అదనపు ఈవో



**తిరుమల ఫిబ్రవరి 3:** ఏడుకొండల్లో కొలువైన వెంకన్నకు ప్రపంచవ్యాప్తంగా భక్తులు ఉన్నారు. వారు టీటీడీకి చెందిన వివిధ ట్రస్టులు, పథకాలకు విరాళాలు ఇస్తారు. అలాగే పేదల కోసం టీటీడీ నిర్వహించే దాతృత్వ కార్యకలాపాలల్లోనూ భాగస్వాములుగా ఉంటారు. అయితే సోమవారం శ్రీవారికి అందిన విరాళం చాలా అరుదైనదిగా నిలిచిపోయింది. భారత్ సహా పలు దేశాల్లో విపత్తు అధికారిగా సేవలు అందించిన ఓ మహిళ, తన జీవితంలో ఆదా చేసిన ప్రతి పైసాను వెంకన్నకు కానుకగా సమర్పించారు. టీటీడీ విద్యా సంస్థల్లో చదువుతున్న అనాథ, పేద పిల్లల సంక్షేమం కోసం ఈ విరాళాన్ని వినియోగించనున్నారు. రేణిగుంటకు చెందిన శ్రీమతి సి.మోహన భారతదేశంతో పాటు కాసావో, అల్బేనియా, యెమెన్, సౌదీ అరేబియాలలో అభివృద్ధి – విపత్తు నిర్వహణ రంగాలలో వివిధ హోదాల్లో పనిచేశారు. ఉద్యోగరీత్యా ఆమె ఎక్కడ పనిచేస్తున్నా, గోవిందుని నామస్మరణను మాత్రం మర్చిపోలేదు. అంతేకాదు, తన వృత్తిజీవితంలో ఆదా చేసిన ప్రతి రూపాయిని శ్రీవారికి కానుకగా ఇవ్వాలని నిర్ణయించారు. ఆ విధంగా ఆదా చేసిన రూ.50 లక్షలను టీటీడీకి చెందిన వెంకటేశ్వర సర్వ శ్రేయాస్(ఎస్వీ బాలమందిర్) ట్రస్ట్‌కు ఇచ్చారు. ఆ మొత్తాన్ని డీడీ రూపంలో తిరుమలలోని టీటీడీ అదనపు ఈవో శ్రీ సిహెచ్.వెంకయ్య చౌదరికి అప్పగించారు. ఆమె దాతృత్వాన్ని వెంకయ్య చౌదరి కొనియాడారు. మూడున్నర దశాబ్దాలకుపైగా తన వృత్తి జీవితంలో సంపాదించిన ధనాన్ని, గోవిందుడి కృపతో అనాథలు, పేదలకు ఉపయోగపడాలనే ఆమె నిర్ణయం ప్రశంసనీయమని అన్నారు. సునామీ విధ్వంసం సమయంలో శ్రీమతి మోహన ధైర్యసాహసాలతో తన సేవలు అందించారు. 1982–94 మధ్య పలు దేశాలలో అనేక భూకంపాలు, తుఫానులు కలిగించిన కష్టాల్లో కూడా ఐక్యరాజ్యసమితి, అమెరికా, బ్రిటిష్ ఛారిటీలతో కలిసి పనిచేసి ప్రజలకు తన వంతు సాయం అందించారు. ఇప్పుడు కూడా శ్రీవారి ద్వారా పేద ప్రజలకు తన సంపాదన ఉపయోగపడాలని భావించి, అరుదైన విరాళాన్ని అందించారు.

## శోభాయాత్ర సిక్కోలు
## చరిత్రలో నభూతో నభవిష్యత్

- ఊహించనంతగా జనం కదలివచ్చారు
- శోభాయాత్రలో జిల్లా వాసుల మోముల్లో ఆనందం కన్పించింది
- సామాన్య భక్తులకు వీఐపీల కంటే ముందే దర్శనం కావాలి
- ఇదే లక్ష్యంతో ఏర్పాట్లు పూర్తి చేశాం
- రాష్ట్ర వ్యవసాయశాఖమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు




**శ్రీకాకుళం ఫిబ్రవరి 3:** అరసవల్లి రథసప్తమి సందర్భంగా నిర్వహించిన శోభాయాత్ర ఓ జైత్రయాత్రను తలపించిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నగరంలోని అంబేద్కర్ కూడలి నుంచి అరసవల్లి ఆలయం వరకు భారీగా శోభాయాత్ర కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు అరసవల్లి సూర్యనారాయణస్వామి ఈ యాత్రలో పాల్గొన్నారు. జిల్లా ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే విధంగా శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని అరసవల్లి రథసప్తమి ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించాలని సీఎం చంద్రబాబునాయుడును కోరడం జరిగిందన్నారు. ఆయన రథసప్తమిని రాష్ట్ర పండుగగా గుర్తించడంతో ఈ ఏడాది మూడు రోజుల పాటు పండుగ నిర్వహించాలని నిర్ణయించామన్నారు. దీంతో యుద్ధప్రాతిపదికన పాలకొండ, కళింగ రోడ్డులో ఆధునీకరణ పనులను చేపట్టామని వివరించారు. అదే విధంగా ఆలయ నిర్మాణ పనులను కూడా పూర్తి చేయగలిగామని తెలిపారు. మూడు రోజుల ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు చేపట్టిన శోభాయాత్రకు జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఊహించినంతగా తరలిరావడం ఆనందంగా ఉందని చెప్పారు. జిల్లాలో ఉన్న కళారూపాలను, రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధి పొందిన ఆలయాల నమూనాలను, జిల్లాలోని పర్యాటక కేంద్రాలు, పుణ్యక్షేత్రాల నమూనాలను ప్రదర్శించారని తెలిపారు. గతంలో తానెప్పుడూ ఆలయ స్వరూపాన్ని పూర్తిగా చూడలేదని ఇప్పుడు ఇంద్రపుష్కరిణి నుంచి చూస్తే ఆలయం పూర్తిగా కన్పిస్తోందని వివరించారు. భవిష్యత్‌లో రూ.100 కోట్ల కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ పథకం నిధులతో ఆలయంతో పాటు నగరాన్ని సుందరీకరణ చేపడతామని చెప్పారు. అధికారం శాశ్వతం కాదని, ఇటువంటి మంచి పనులు చేస్తే ప్రజలు తమ గుండెల్లో పెట్టుకుంటారని తెలిపారు. భక్తులు రెండు రోజుల పాటు ఆనందంగా మెలిగి రథసప్తమి రోజు స్వామి వారిని ప్రశాంతంగా దర్శించుకోవాలని తెలిపారు. వీఐపీల కంటే పది నిమిషాల ముందు సామాన్య భక్తులు స్వామి వారిని దర్శించుకోవాలని ఇదే తమ లక్ష్యమని అచ్చెన్నాయుడు వివరించారు. గతంలో ఆలయానికి ఐదు కిలోమీటర్ల ముందే జనాలను నిలిపి వేసి నడిచే పరిస్థితి ఉండేదని, కానీ నేడు ఆలయం నలుమూలలా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసి భక్తులకు సౌకర్యాలను ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం ఉదయం చరిత్రలో నిలిచిపోయేలా సూర్యనమస్కారాలు ఐదు వేల మందితో నిర్వహించామని వివరించారు. ఎపీకి కేంద్ర ప్రభుత్వం ఏం ఇవ్వలేదని కొందరు అవాకులుచవాకులు మాట్లాడుతున్నారని అన్నారు. సీఎం చంద్రబాబునాయుడుకు కేంద్రం వద్ద ఎప్పుడు వెళ్లాలన్నా క్లీన్‌చీట్ ఉందని అన్నారు. ఈ ఏడు నెలల కాలంలో చంద్రబాబు 70 సార్లు కలిశారని వివరించారు. ఈ ఏడు నెలల్లో పోలవరానికి రూ.12,500 కోట్లు, అమరావతికి రూ.15వేల కోట్లుతో రైల్వేజోన్ ప్రకటించిందని తెలిపారు. విశాఖ ఉక్కును ఆదుకునేందుకు రూ.12,500 కోట్లు మంజూరు చేసి ఊపిరి పోశారన్నారు. గతంలో జలజీవన్ పథకాన్ని కేంద్రం మంజూరు చేసి ఒక్క పైసా కూడా ఖర్చు చేయకుండా ప్రజలను మోసగించారని వివరించారు. 2025తో ఈ పథకం ముగుస్తుందని తెలుసుకున్న చంద్రబాబునాయుడు అధికారం చేపట్టిన తరువాత 2028 వరకు ఈ పథకాన్ని పొగిడించారని గుర్తు చేశారు. ప్రతీ ఇంటికి 24 గంటల పాటు తాగునీరు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి, చౌదరి బాబ్జి, మాదరపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం నేతన్నల నిరసన!

## 4 నెలలుగా జీతాలు
## రాని స్వీపర్స్ కు వేతనాలు ఇవ్వండి



**ధర్మవరం ఫిబ్రవరి 3:** ధర్మవరం మున్సిపల్ పాఠశాలలందు పనిచేస్తున్న స్వీపర్స్ కు గతనాలుగు నెలలుగా వేతనాలు రాకపోవడంతో సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కమిషనర్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జే.వి రమణ సిఐటియు మండల కన్వీనర్, టీ.అయూబ్ ఖాన్. మాట్లాడుతూ ప్రభుత్వ మున్సిపల్ పాఠశాలలందు పనిచేస్తున్న కంటెంజెంట్ ఆయాలకు అక్టోబర్ నెల నుంచి ఇప్పటివరకు వేతనాలు రాకపోవడంతో వారి కుటుంబాలు అనేక రకాల ఇబ్బందులకు గురి అవుతున్నారని, చాలీచాలని వేతనాలతో ఆర్థికంగా చాలా వెనుకబడి ఉన్నారని, వారి కుటుంబాలు పోషించుకోవడానికి అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని. ప్రభుత్వ రంగాలలో పనిచేస్తున్న అతి తక్కువ వేతనం కేవలం 4000 రూపాయలతో వారు చాలా కష్టాల పాలవుతున్నారని ఇటువంటి చిరు ఉద్యోగులకు ప్రతినెల ఐదో తారీకు లోపు వేతనాలు మంజూరు చేయాలని వారు ఈ సందర్భంగా కమిషనర్ గారికి విన్నవించడం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీ ప్రమోద్ గారు మాట్లాడుతూ రెండు రోజులలోపు వారి వేతనాలను మంజూరయ్యేటట్లు చర్యలు చేపడతానని హామీ ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎల్ ఆదినారాయణ, ఎస్. హైదర్ వలీ, స్కూలు ఆయాల కమిటీ నాయకులు. చౌడమ్మ, జయమ్మ, ప్రమీల, నాగలక్ష్మి ,నాగరత్న, నాగమ్మ, గంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## చలికాలం గుండెపోటు వచ్చేది అందుకేనట

గుండెపోటు సైలెంట్ కిల్లర్‌గా మారుతోంది.. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా.. చాలా మంది గుండె జబ్బుల బారిన పడుతున్నారు. అయితే.. సాధారణంగా వేసవి, వర్షాకాలంతో పోలిస్తే.. శీతాకాలంలో గుండెపోటు ప్రమాదం మరింత పెరుగుతుంది.. ముఖ్యంగా చల్లని గాలులు, పెరుగుతున్న కాలుష్యం గుండె జబ్బుల ప్రమాదాన్ని మరింత పెంచుతుంది. అయితే.. చలికాలంలో మన శరీరం వెచ్చగా ఉండేందుకు ప్రయత్నిస్తుంది.. దీని కారణంగా గుండె మరింత ఎక్కువగా పంపు చేయవలసి ఉంటుంది.. ఇంకా అనేక ఇతర కారణాల వల్ల కూడా గుండెపోటు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. కావున శీతాకాలంలో మన గుండె ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. చలికాలంలో గుండెపోటు రాకుండా చేసే కొన్ని చర్యలు.. జాగ్రత్తల గురించి ఈ కథనంలో తెలుసుకోండి.. వీటిని క్రమం తప్పకుండా పాటించడం ద్వారా ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చు.

**శీతాకాలంలో గుండెపోటును ఎలా నివారించాలి?**

శారీరక వ్యాయామం: సరైన మొత్తంలో వ్యాయామం చేయడం వల్ల గుండెకు బలం చేకూరుతుంది. రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. రోజూ కనీసం 30 నిమిషాల వ్యాయామం చేయాలి. చలికాలంలో బద్ధకం ఎక్కువగా ఉంటుంది. దానిని నివారించండి.. శారీరక శ్రమను పెంచుకోండి. హెల్తీ డైట్: చలికాలంలో సరైన ఆహారం చాలా ముఖ్యం.. గుండె ఆరోగ్యం కోసం, మీ ఆహారంలో తక్కువ మొత్తంలో నూనె, ధాన్యాలు, పండ్లు, కూరగాయలు, పాలు తీసుకోండి. మీరు ఎక్కువగా వేయించిన, జంక్, ఫాస్ట్ ఫుడ్ తింటే.. మీకు గుండెపోటు వచ్చే అవకాశం ఉంది. ఒత్తిడిని నివారించండి: అధిక ఒత్తిడి గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతుంది. ధ్యానం, యోగా ఒత్తిడిని తగ్గించడంలో మీకు సహాయపడతాయి. శీతాకాలంలో వీలైనంత సంతోషంగా ఉండటానికి ప్రయత్నించండి. రెగ్యులర్ చెకప్‌లు: మీరు మీ వైద్యునిచే నిర్ణీత వ్యవధిలో చెకప్‌లు చేయించుకోవాలి. రోజువారీ రొటీన్ కోసం అవసరమైన పరీక్షలు మీ ఆరోగ్యాన్ని అదుపులో ఉండేలా చేస్తాయి.. దీంతో ఎలాంటి ప్రమాదం జరిగినా ముందుగానే పసిగట్టవచ్చు.

మద్యపానం: సిగరెట్, బీడీ, హుక్కా, గంజాయి లాంటి దురలవాట్లు ఆరోగ్యానికి కూడా చాలా హానికరం. ప్రజలు శీతాకాలంలో వీటిని ఎక్కువగా తీసుకుంటారు.. ఇది గుండెపోటు ప్రమాదాన్ని మరింత పెంచుతుంది.. ఇలాంటి దురలవాట్లతోపాటు.. మద్యపానానికి పూర్తిగా దూరంగా ఉండటం మంచిది.



## హిమాలయన్ సాల్ట్ అంటే ఏమిటి..? ఇది మనకు ఉపయోగపడుతుందా?



ఈమధ్య కాలంలో మనం రహదారుల పక్కన ఎక్కడ చూసినా పెద్దవైన పింక్ రంగు స్ఫటికాలను పెట్టుకుని విక్రయిస్తున్నారు. మీరు చూసే ఉంటారు కదా. అయితే అవి ఏంటా.. అని ఆశ్చర్యపోతున్నారా..? అవి హిమాలయన్ పింక్ సాల్ట్ స్ఫటికాలు. హిమాలయ పర్వత ప్రాంతాల్లోని నదుల నుంచి సేకరించిన స్ఫటికాలు అవి. దీన్నే రాక్ సాల్ట్ అంటారు. దీన్నుంచే సైంధవ లవణాన్ని కూడా తయారు చేస్తారు. అయితే చాలా కంపెనీలు హిమాలయన్ సాల్ట్‌ను కూడా విక్రయిస్తున్నాయి. మరి దీనికి, రోజూ మనం తినే సాధారణ ఉప్పుకు అసలు తేడా ఏమిటి..? రెండింటిలో ఏది మంచిది..? దీనిపై నిపుణులు ఏమని సమాధానాలు చెబుతున్నారు..? అన్న వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం.

**84 రకాల మినరల్స్‌కు నిలయం..**

కొన్ని లక్షల ఏళ్ల కిందట నుంచే ఏర్పడ్డ స్ఫటికాలను హిమాలయ నదీ ప్రాంతం నుంచి సేకరించి వాటిని ఉప్పుగా చేసి మనకు విక్రయిస్తున్నారు. అందువల్ల ఈ ఉప్పుకు హిమాలయన్ సాల్ట్ అనే పేరు వచ్చింది. మార్కెట్‌లో మనకు ఎక్కడ చూసినా పింక్ రంగులో ఉండే ఈ స్ఫటికాలు కనిపిస్తుంటాయి. వీటినే శుద్ధి చేసి మనకు ఉప్పు విక్రయిస్తున్నారు. అయితే పింక్ సాల్ట్‌లో ఉండే 84 రకాల మినరల్స్ కారణంగానే వాటికి ఆ రంగు వచ్చింది. సాధారణ ఉప్పులో ఉండని అనేక రకాల మినరల్స్ ఈ హిమాలయన్ సాల్ట్‌లో ఉంటాయని తేలింది. కనుకనే ఈ ఉప్పు మన ఆరోగ్యానికి మేలు చేస్తుందని చాలా మంది విశ్వసిస్తున్నారు. దీన్ని ఆహారంలో భాగం చేసుకుంటున్నారు.

**సోడియం సమానమే..**

హిమాలయన్ సాల్ట్ ను ఒక టీస్పూన్ తీసుకుంటే 2200 మిల్లీగ్రాముల మేర సోడియం లభిస్తుంది. అదే సాధారణ ఉప్పులో అయితే ఒక టీస్పూన్ మోతాదులో సుమారుగా 2300 మిల్లీగ్రాముల సోడియం ఉంటుంది. అంటే సాధారణ ఉప్పుతో పోలిస్తే హిమాలయన్ ఉప్పులో సోడియం కాస్త తక్కువ. ఇక ఇతర మినరల్స్ కూడా హిమాలయన్ సాల్ట్‌లోనే ఉంటాయి. అందువల్ల ఈ ఉప్పు మన ఆరోగ్యానికి మేలు చేస్తుందని అంటున్నారు. హిమాలయన్ ఉప్పును తీసుకోవడం వల్ల శరీరంలోని టాక్సిన్లు బయటకు పోతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. సాధారణ ఉప్పు కన్నా హిమాలయన్ ఉప్పు మంచిదని వారు అంటున్నారు. హిమాలయన్ ఉప్పుతో చేసిన దీపాలను వెలిగిస్తే చుట్టూ ఉండే గాలి కూడా శుద్ధి అవుతుందట.

**మోతాదుకు మించవద్దు..**

అయితే సాధారణ ఉప్పుకు, హిమాలయన్ ఉప్పుకు సోడియంలో పెద్ద తేడా లేదు. కానీ మినరల్స్‌లో తేడా ఉంటుంది. కనుక మినరల్స్ పొందాలని అనుకునేవారు సాధారణ ఉప్పుకు బదులుగా హిమాలయన్ ఉప్పు తినవచ్చని అంటున్నారు. అయితే ఏ ఉప్పు అయినా కూడా ఒక వ్యక్తి రోజుకు 5 గ్రాములు లేదా ఒక టీస్పూన్‌కు మించి తినకూడదని, అధికంగా తింటే శరీరంలో సోడియం స్థాయిలు పెరిగిపోతాయని, దీంతో కిడ్నీలపై భారం పడుతుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. దీని వల్ల కిడ్నీలు చెడిపోయే ప్రమాదం ఉంటుందట. అలాగే బీపీ కూడా పెరుగుతుందని అంటున్నారు. కనుక హిమాలయన్ ఉప్పు ఆరోగ్యానికి కాస్త మేలు చేసినప్పటికీ దీన్ని కూడా మోతాదులో తింటేనే ప్రయోజనం ఉంటుందని అంటున్నారు. అధికంగా తింటే ఇబ్బందులు తప్పవని హెచ్చరిస్తున్నారు.

## రోజూ ఒక కప్పు చెర్రీ పండ్లను తింటే ఇన్ని లాభాలు కలుగుతాయా?



చెర్రీ పండ్లు చూసేందుకు ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తాయి. వీటిని ఎక్కువగా తీపి వంటకాల తయారీలో ఉపయోగిస్తుంటారు. చెర్రీ పండ్లను స్వీట్లు లేదా కేకులపై పెట్టి ఇస్తుంటారు. కేవలం ఆ సమయంలో మాత్రమే ఈ పండ్లను తింటుంటారు. అయితే వాస్తవానికి తీపిగా ఉన్నప్పటికీ ఈ పండ్ల ద్వారా మనకు లభించే క్యాలరీలు చాలా తక్కువే. చెర్రీ పండ్లను రోజువారి ఆహారంలో కచ్చితంగా భాగం చేసుకోవాలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. చెర్రీ పండ్లతో అనేక లాభాలు ఉంటాయని వారు అంటున్నారు. చెర్రీ పండ్లలో మన శరీరానికి ఉపయోగ పడే అనేక పోషకాలు ఉంటాయి. ముఖ్యంగా విటమిన్ సి, పొటాషియం, ఫైబర్ వంటి పోషకాలు చెర్రీ పండ్లలో సమృద్ధిగా ఉంటాయి. ఇవి మనకు రోగాలు రాకుండా చూస్తాయి. శరీరానికి పోషణను అందిస్తాయి. దీంతో పోషకాహార లోపం ఏర్పడకుండా చూసుకోవచ్చు.

**గౌట్, యూరిక్ యాసిడ్ నుంచి విముక్తి..**

చెర్రీ పండ్లు మనకు మార్కెట్‌లో ఏడాది పొడవునా అందుబాటులో ఉంటాయి. అయితే ఇవి ఎక్కువగా వేసవి సీజన్‌లో వస్తాయి. ఈ సీజన్‌లో మనకు బయట రహదారుల పక్కన బండ్లపై ఈ పండ్లు ఎక్కువగా కనిపిస్తుంటాయి. అందువల్ల ఈ పండ్లను మనం ఎప్పుడు కావాలంటే అప్పుడు కొని తినవచ్చు. ఇక చెర్రీ పండ్లలో ఆంథో సయనిన్స్ అనే యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. వీటి వల్లే ఈ పండ్లు అంత ఎర్రని రంగులో ఆకర్షణీయంగా కనిపిస్తాయి. అందువల్ల చెర్రీ పండ్లను తింటుంటే శరీరంలోని వాపులు తగ్గిపోతాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్, గౌట్ వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. శరీరంలో యూరిక్ యాసిడ్ అధికంగా ఉన్నవారికి చెర్రీ పండ్లు ఎంతగానో మేలు చేస్తాయి. ఈ పండ్లను రోజూ తింటుంటే యూరిక్ యాసిడ్ లెవల్స్ తగ్గుతాయి. దీంతో గౌట్ నుంచి ఉపశమనం లభిస్తుంది.

**నిద్రలేమి సమస్యకు..**

చెర్రీ పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. అలాగే పొటాషియం, ఫైబర్ కూడా సమృద్ధిగానే ఉంటాయి. ఇవి రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తాయి. పొటాషియం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హైబీపీ తగ్గుతుంది. జీర్ణక్రియ మెరుగు పడుతుంది. రోజూ విరేచనం సాఫీగా అవుతుంది. మలబద్దకం తగ్గుతుంది. చెర్రీ పండ్ల ద్వారా మనకు మెలటోనిన్ అనే హార్మోన్ సహజసిద్ధంగా లభిస్తుంది. ఇది నిద్రను ప్రేరేపిస్తుంది. కనుక రాత్రి పూట చెర్రీ పండ్లను తింటున్నా లేదా వాటి జ్యూస్‌ను తాగినా చక్కగా నిద్రపోవచ్చు. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్రలేమి నుంచి బయట పడవచ్చు.

**గుండె ఆరోగ్యానికి..**

ఈ పండ్లలో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి శారీరక శ్రమ లేదా వ్యాయామం చేసేవారికి ఎంతో మేలు చేస్తాయి. ఈ పండ్లను తింటే ఒళ్లు నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే కండరాల నొప్పులు, వాపులు తగ్గుతాయి. శారీరక శ్రమ నుంచి త్వరగా రికవరీ అవుతారు. మళ్లీ చురుగ్గా పనిచేసేందుకు కావల్సిన శక్తి లభిస్తుంది. చెర్రీ పండ్లలో గుండెకు ఎంతగానో మేలు చేసే అనేక సమ్మేళనాలు ఉంటాయి. ముఖ్యంగా ఆంథో సయనిన్స్, ఫ్లేవనాయిడ్స్ ఈ పండ్లలో ఉంటాయి. ఇవి గుండె జబ్బులు వచ్చే అవకాశాలను గణనీయంగా తగ్గిస్తాయి. కొలెస్ట్రాల్, బీపీని అదుపులో ఉంచుతాయి. దీంతో గుండె సంబంధ వ్యవస్థ మెరుగ్గా పనిచేస్తుంది. ఇలా చెర్రీ పండ్లను రోజువారి ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.



## బరువు తగ్గాలనుకుంటున్నారా..? అయితే ఇలా చేయండి..!

పాలు ఆరోగ్యకరమైనవి పైగా పోషకాలతో కూడా నిండి ఉంటుంది. అందుకే వైద్యులు అందరికీ రోజుకు ఒక కప్పు పాలు తాగాలని సూచిస్తారు. పిల్లల నుండి పెద్దవాళ్ల వరకు అందరికీ పాలు అవసరం. కొందరు సాధారణ పాలు తాగుతారు. మరికొందరు దానికి చక్కెర కలుపుతారు. కొంతమంది పాలలో పసుపు కలిపి తాగుతారు. అదే విధంగా పాలలో తేనె కలిపి తాగేవారు కూడా ఉన్నారు. పాలలో చక్కెరకు బదులుగా తేనె కలపడం ఆరోగ్యానికి మంచిది. దీని వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి.



**బరువు తగ్గడానికి ఎలా సహాయపడుతుంది..?**

పాలు ఆకలిని నియంత్రించడంలో సహాయపడుతుంది. తేనె సహజ చక్కెరను అందించి తీపి పదార్థాల పట్ల ఉన్న ఆసక్తిని తగ్గిస్తుంది.

తేనెలో ఉన్న ప్రత్యేక పదార్థాలు మెటాబాలిజాన్ని కొంచెం పెంచగలవని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

చక్కెర ఉన్న డ్రింక్స్ కు బదులుగా పాలు, తేనెను తీసుకోవడం వల్ల మొత్తం కేలరీలు తీసుకోవడం తగ్గుతుంది.

**ఆరోగ్య ప్రయోజనాలు**

మనం ఆరోగ్యంగా ఉండాలంటే మంచి రోగనిరోధక శక్తి ఉండాలి. పాలు, తేనె కలిపి తాగడం వల్ల ఈ శక్తి పెరుగుతుంది. పాలలో ఉన్న ప్రోటీన్, కాల్షియం, తేనెలో ఉన్న యాంటీఆక్సిడెంట్లు అనేక రకాల రోగాల నుండి మనల్ని రక్షిస్తాయి. ప్రస్తుత రోజుల్లో బరువు పెరగడం చాలా మందికి సమస్యగా మారింది. దీన్ని తగ్గించడానికి చాలా మంది వివిధ మార్గాలు ప్రయత్నిస్తున్నారు. పాలు, తేనెను కలిపి తాగడం వల్ల కొవ్వు కరగడంలో సహాయపడుతుంది. కొద్ది రోజుల్లోనే బరువు తగ్గినట్లు అనిపిస్తుంది. తేనెలో ఉన్న యాంటీఆక్సిడెంట్లు కొవ్వును కరిగించడంలో సహాయపడతాయి.

ప్రస్తుత జీవన విధానంలో పలు కారణాల వల్ల చాలా మంది మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. మీరు ఒత్తిడిలో ఉంటే పాలు, తేనె మంచి సహజ ఔషధంగా పనిచేస్తాయి. ఈ రెండింటినీ కలిపి తాగడం వల్ల ఒత్తిడి తగ్గుతుంది. పైగా మనసుకు ప్రశాంతత లభిస్తుంది. పాలలో ఉన్న కాల్షియం ఎముకలను బలపరుస్తుంది. తేనె నరాల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. మీకు శ్వాస సంబంధిత సమస్యలు ఉంటే. పాలు, తేనె కలిపి తాగడం వల్ల ఉపశమనం లభిస్తుంది. ఇది దగ్గు, శ్వాసకోశ సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. చర్మం మసకబారితే పాలు, తేనెను కలిపి తాగడం వల్ల చర్మం ప్రకాశవంతంగా మారుతుంది. ఇది చర్మానికి సహజమైన కాంతిని అందిస్తుంది.

ఇలా పాలు, తేనెను కలిపి తాగడం వల్ల ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలు ఉన్నాయి. బరువు తగ్గడం, రోగనిరోధక శక్తి పెరగడం, మానసిక ఒత్తిడి తగ్గడం వంటి లాభాలు లభిస్తాయి. కాబట్టి మీ ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడానికి ప్రతిరోజూ పాలలో తేనె కలిపి తాగండి.

## బిజినెస్

### ఆకర్షిస్తున్న అల్ట్రావైలెట్ నయా బైక్.. సూపర్ ఫీచర్ల వివరాలివే!

ఎఫ్-77 సూపర్ స్ట్రీట్ అనేది బెంగళూరు ఆధారిత ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల తయారీ స్టార్టప్ అల్ట్రావైలెట్ ఆటోమోటివ్ రిలీజ్ చేసిన సూపర్ బైక్. పేరులో పేర్కొన్నట్లుగానే ఎఫ్-77 సూపర్ స్ట్రీట్ అల్ట్రావైలెట్ ఎఫ్-77 మ్యాక్ 2 పై ఆధారపడి పని చేస్తుంది. ఈ ఎలక్ట్రిక్ స్పోర్ట్స్ బైక్ భారతదేశంలో రూ.2.99 లక్షలు (ఎక్స్-షోరూమ్) వద్ద అందుబాటులో ఉంటుంది. అయితే ఈ బైక్ కోసం బుకింగ్లు ఫిబ్రవరి 1న ప్రారంభమయ్యాయి.అల్ట్రావైలెట్ ఎఫ్-77 సూపర్ స్ట్రీట్ డెలివరీలు మార్చి 2025లో ప్రారంభం కానున్నాయి. ఇక డిజైన్ విషయానికి వస్తే అల్ట్రావైలెట్ ఎఫ్-77 సూపర్ స్ట్రీట్ బైక్ మ్యాక్-2తో సమానంగా వస్తుంది. ఈ బైక్ ఎల్ఈడీ హెర్ల్యాంప్, పెద్ద సైడ్ ప్యానెల్స్‌తో ఆకట్టుకుంటుంది. ఈ ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్‌కు సంబంధించిన ఎర్గోనామిక్స్ ఇప్పుడు మార్చారు. అందువల్ల రైడర్ నిటారుగా కూర్చోవడానికి కొత్త హ్యాండిల్ బార్ సెటప్‌తో వస్తుంది. అల్ట్రావైలెట్ ఎఫ్-77సూపర్ స్ట్రీట్ బైక్ నాలుగు విభిన్న రంగుల్లో అందుబాటులో ఉంటుంది. ఈ బైక్‌ను మనం టర్బో రెడ్, ఆఫ్టర్ బర్నర్ ఎల్లో, స్టెల్లార్ వైట్, కాస్మిక్ బ్లాక్ కలర్స్‌లో కొనుగోలు చేయవచ్చు. అల్ట్రావైలెట్ ఎఫ్-77 సూపర్ స్ట్రీట్ ఫీచర్ల విషయానికి వస్తే ఈ బైక్‌లో ఎల్ఈడీ లైట్లు ఆకట్టుకుంటాయి. అలాగే స్మార్ట్ ఫోన్ కనెక్టివిటీతో కలర్ టీఎఫ్‌టీ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్‌తో పాటు 10 లెవెల్ బ్రేకింగ్ సిస్టమ్, మల్టీ రైడ్ మోడ్లు, ట్రాక్షన్ కంట్రోల్ వంటి ఫీచర్లు యువత అమితంగా ఇష్టపడతారు. అల్ట్రావైలెట్ ఎఫ్-77 బైక్ 10.3 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ప్యాక్‌తో వస్తుంది. అలాగే ఈ బైక్ 30 కేడబ్ల్యూ ఎలక్ట్రిక్ మోటార్‌తో రావడం వల్ల అల్ట్రావైలెట్ ఎఫ్-77 బైక్‌ను ఒక్కసారి ఛార్జ్ చేస్తే గరిష్టంగా 323 కిలోమీటర్ల పరిధిని అందిస్తుంది. అలాగే ఈ బైక్ గరిష్టంగా 155 కిలో మీటర్ల వేగంతో దూసుకుపోతుంది. అల్ట్రావైలెట్ ఎఫ్-77 సూపర్ స్ట్రీట్ బైక్ మ్యాక్-2 మాదిరిగానే సస్పెన్షన్ డ్యూటీ కోసం అప్ సైడ్ ఫ్రంట్ ఫోర్క్స్, మోనోషాక్ అబ్జార్బర్‌తో వస్తుంది అలాగే బ్రేకింగ్ విషయానికి వస్తే ఈ బైక్ ముందు, వెనుక టైర్స్ డిస్క్ బ్రేక్ కంట్రోల్‌తో వస్తుంది.

### భారీ నష్టాలతో మొదలైన స్టాక్ మార్కెట్లు.. టాప్ ఫైవ్ స్టాక్స్ ఇవే..

అంతర్జాతీయ మార్కెట్లలో బలహీన సంకేతాలు, శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్ నేపథ్యంలో దేశీయ సూచీలు సోమవారం ఉదయం భారీ నష్టాలతో ప్రారంభమయ్యాయి. ఈ వారంలో 5,6 తేదీలలో ఆర్బీఐ ద్రవ్యపరపతి మీటింగ్ జరగనుంది. కీలక వడ్డీ రేట్లను 0.25 శాతం తగ్గించవచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తత పాటిస్తున్నారు. ఆదాయపు పన్ను తగ్గింపు కారణంగా ఏఫ్ఎమ్‌సీజీ, బడ్జెట్ కేటాయింపుల వల్ల వ్యవసాయ ఆధారిత స్టాక్స్ మాత్రమే లాభాల్లో కొనసాగుతున్నాయి. శనివారం ముగింపు (77, 505)తో పోల్చుకుంటే సోమవారం ఉదయం 500 పాయింట్లకు పైగా నష్టంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత మరింత నష్టాల్లోకి జారుకుంది. ఒక దశలో దాదాపు 750 పాయింట్లు కోల్పోయి 76, 756 వద్ద కనిష్టానికి చేరుకుంది. ప్రస్తుతం ఉదయం 10:00 గంటల సమయంలో 672 పాయింట్లు కోల్పోయి 76, 833 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదులుతోంది. ప్రస్తుతం 239 పాయింట్ల నష్టంతో 23, 243 వద్ద కొనసాగుతోంది. సెన్సెక్స్‌లో పీఐ ఇండస్ట్రీస్, నైకా, యూపీఎల్, టీవీఎస్ మోటార్స్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. హుడ్కో, మదర్సన్, సైమన్స్, భారత్ ఎలక్ట్రానిక్స్ షేర్లు భారీ నష్టాల్లో ఉన్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 725 పాయింట్ల నష్టాంతో కొనసాగుతోంది. బ్యాంక్ నిఫ్టీ 479 పాయింట్ల నష్టంతో ఉంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ ప్రస్తుతానికి 87.16గా ఉంది.

## ఈవీ రంగానికి బడ్జెట్ బూస్ట్..

# భారీగా తగ్గనున్న ధరలు

ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీల తయారీకి కీలకమైన ఖనిజాలపై ప్రాథమిక కస్టమ్స్ డ్యూటీ (బీసీడీ)ని తొలగించాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించడంతో ఎలక్ట్రిక్ వాహనాలు మరింత సరసమైన ధరకు అందుబాటులోకి రానున్నాయి. లిథియం-అయాన్ బ్యాటరీలు, సంబంధిత రంగాల స్థానిక తయారీని పెంచడానికే కేంద్ర ప్రభుత్వం ఇలాంటి కీలకమైన చర్యలను తీసుకుంది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన ప్రసంగంలో కోబాల్ట్ పౌడర్, లిథియం-అయాన్ బ్యాటరీ వ్యర్థాలు, స్క్రాప్, సీసం, జింక్ మరియు ఇతర పన్నెండు కీలకమైన ఖనిజాల పై బీసీడీ నుంచి పూర్తి మినహాయింపును ప్రకటించారు. అంతేకాకుండా అవసరమైన బ్యాటరీ ఉత్పత్తి పరికరాలపై దిగుమతి సుంకాలను తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. కేంద్రం తాజా నిర్ణయంతో బ్యాటరీ తయారీ ఖర్చులు తగ్గి ఎలక్ట్రిక్ వాహనాలు మరింత తక్కువ ధరకే వినియోగదారులకు అందుతాయని నిపుణులు భావిస్తున్నారు. భారతదేశంలో బ్యాటరీలు, బ్యాటరీ సెల్లను ఉత్పత్తి చేయడంలో చురుకుగా పనిచేస్తున్న టాటా మోటార్స్, ఓలా ఎలక్ట్రిక్, లాగ్9 మెటీరియల్స్, రిలయన్స్ ఇండస్ట్రీస్ వంటి వాటితో స్థానిక



ఉత్పత్తిదారులకు కేంద్రం చర్యలు మరింత ప్రోత్సాహకంగా మారనున్నాయి. భారతదేశంలో బ్యాటరీలకు ప్రధాన సరఫరాదారులుగా కొనసాగుతున్న చైనా, దక్షిణ కొరియాతో సహా ఇతర మార్కెట్లపై ఆధారపడడాన్ని తగ్గించడానికి స్థానిక తయారీ ఊతం ఇవ్వడానికి కేంద్రం ఈ చర్యలు తీసుకుందని నిపుణులు చెబుతున్నారు. భారతదేశానికి సంబంధించిన బ్యాటరీ రీసైక్లింగ్, తయారీ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి బడ్జెట్ 2025 కీలకంగా మారుతుందని వివరిస్తున్నారు. బ్యాటరీ రీసైక్లింగ్, ఈవీ సరఫరా విషయాల్లో పెట్టుబడిని పెంపొందించడంతో పాటు ఈవీ మొబైల్ బ్యాటరీల తయారీ పెరుగుతుందని తద్వారా స్థానికులకు ఉద్యోగాలు కూడా లభిస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఈవీ బ్యాటరీ రంగం ప్రధానంగా పన్ను మినహాయింపు నుంచి ప్రయోజనం పొందుతుంది. ముఖ్యంగా కేంద్రం చర్యల కారణంగా ఎలక్ట్రిక్ వాహనాలను మరింత సరసమైనవిగా మారతాయి. ముఖ్యంగా ముడి చమురు దిగుమతులు, టెయిల్ పైప్ ఉద్గారాలను తగ్గించడానికి ఎలక్ట్రిక్ వాహనాలను ప్రజలు కొనుగోలు చేసేలా చేయడానికి కీలక అడుగు అని నిపుణులు భావిస్తున్నారు. 2030 నాటికి దేశంలో మొత్తం వాహన విక్రయాల్లో 30 శాతం ఈవీ ఉండాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# డాలర్‌తో పోలిస్తే ఆల్ టైం కనిష్టానికి రూపాయి

అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల పలు దేశాలపై సుంకాల విధింపు నిర్ణయాల కారణంగా కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ క్రమంలోనే ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య యుద్ధం ఆందోళనలు మొదలయ్యాయి. ఈ క్రమంలోనే భారత స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో కొనసాగుతున్నాయి. ఇదే సమయంలో 2025 ఫిబ్రవరి 3న భారత రూపాయి డాలర్‌తో పోలిస్తే 87.29కి పతనమైంది. ఈ క్రమంలో అత్యంత కనిష్ట స్థాయికి చేరుకుంది. ట్రంప్ అధిక సుంకాల విధింపులు, అమెరికా డాలర్‌కు ఉన్న అధిక డిమాండ్ వల్ల ఇది జరిగిందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.



**ట్రంప్ బెదిరింపులు..**

ట్రంప్ సుంకాల బెదిరింపులు ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల కరెన్సీలను ప్రభావితం చేశాయి. దీంతో డాలర్‌కు పెరిగిన డిమాండ్ కారణంగా రూపాయి మరింత పతనమైంది. ముఖ్యంగా చమురు దిగుమతులు, డాలర్ క్రయవిక్రయాల నేపథ్యంలో అమెరికా డాలర్ సూచిక వృద్ధి చెందడం వల్ల భారత రూపాయి మరింత బలహీనంగా మారింది. రూపాయి విలువ 87.29 వద్ద ప్రారంభమైంది. ఇది శుక్రవారం ముగింపుతో పోలిస్తే 67 పైసలు తగ్గింది. ఇక డాలర్ విషయానికి వస్తే ఇండెక్స్ 109.77 వద్ద ట్రేడవుతోంది, ఇది గతంతో పోలిస్తే 1.30 శాతం పెరిగింది.

**ఇతర దేశాల కరెన్సీలు కూడా..**

ఈ పరిణామాలు యూరో, యెన్, ఇతర ఆసియా కరెన్సీలపై కూడా ప్రభావం చూపించాయి. యూరో 1.0224, 1.2261, జపాన్ యెన్ 155.54కి పడిపోయాయి. ఈ సమయంలో బ్రెంట్ క్రూడ్ చమురు ధరలు 0.71 శాతం పెరిగి 76.21కి చేరుకున్నాయి. ఇది ప్రపంచవ్యాప్తంగా చమురు మార్కెట్‌లో మరిన్ని మార్పులను సూచిస్తుంది. దీంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, కెనడా, మెక్సికో, చైనాపై సుంకాలు విధించి, అంతర్జాతీయ వాణిజ్య సంబంధాల్లో ఉద్రిక్తతను సృష్టించారని నిపుణులు చెబుతున్నారు.

**ఈ సుంకాల విషయంలో..**

ఇప్పటికే కెనడా, మెక్సికో తమపై విధించిన సుంకాలకు ప్రతీకారంగా సమాధానమిచ్చే ప్రయత్నాలు చేశాయి. అయినప్పటికీ ఈ పరిస్థితులు ప్రపంచ ఆర్థిక మార్కెట్లలో అనిశ్చితిని పెంచి, భారత రూపాయిపై ఒత్తిడి తెచ్చాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ నిర్ణయాల విషయంలో వెనక్కి తగ్గుతారా లేదా ఇలాగే కొనసాగిస్తారా లేదా అనేది చూడాలి. ఇలాగే కొనసాగితే ప్రపంచ మార్కెట్లకు ఇబ్బంది తప్పదని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## ఒక్క ఇన్నింగ్స్‌తో 8 క్రేజీ రికార్డులు..

# అభిషేక్ అన్నింటా అసాధ్యుడే

రికార్డులు ఉన్నవి బ్రేక్ చేయడానికేనని కొందరు ఆటగాళ్లు నిరూపిస్తుంటారు. అద్భుతమైన ఆటతో పాత రికార్డులకు పాతర వేసి సరికొత్త చరిత్రకు నాంది పలుకుతారు. టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ అదే పని చేశాడు. ఇంగ్లండ్‌తో ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా జరిగిన ఆఖరి టీ20లో 54 బంతుల్లో 135 పరుగుల విధ్వంసక బ్యాటింగ్‌తో హోరెత్తించాడీ కుర్రాడు. ఇంగ్లండ్ బౌలర్లను ఊచకోత కోశాడు. 7 బౌండరీలు, 13 సిక్సులతో మెరుపులా వాళ్ల మీద విరుచుకుపడ్డాడు. ఒకే ఒక్క ఇన్నింగ్స్‌తో 8 అన్‌బ్రేకబుల్ రికార్డ్స్‌ను అతడు బద్దలుకొట్టాడు. అవేంటో ఇప్పుడు చూద్దాం.. టీ20 క్రికెట్‌లో టీమిండియా తరఫున అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన బ్యాటర్‌గా అభిషేక్ చరిత్ర సృష్టించాడు. నిన్నటి మ్యాచ్‌లో 135 పరుగులు చేశాడీ ఓపెనర్. పొట్టి ఫార్మాట్‌లో భారత్ తరఫున ఓ బ్యాటర్ ఇన్ని పరుగులు ఎప్పుడూ చేయలేదు. ఈ లిస్ట్‌లో మరో యంగ్ క్రికెటర్ శుబ్‌మన్ గిల్ (63 బంతుల్లో 126 నాటౌట్) రెండో స్థానంలో ఉన్నాడు. 2023, ఫిబ్రవరి 1వ తేదీన న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లో గిల్ ఈ స్కోరు బాదాడు. ఈ లిస్ట్‌లో రుతురాజ్ గైక్వాడ్ (123 నాటౌట్), విరాట్ కోహ్లీ (122 నాటౌట్), రోహిత్ శర్మ (121 నాటౌట్) వరుసగా మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో ఉన్నారు. టీ20 క్రికెట్‌లో భారత్ తరఫున అత్యంత వేగంగా సెంచరీ బాదిన రెండో బ్యాటర్‌గా అభిషేక్ (37 బంతుల్లో) నిలిచాడు. ఈ లిస్ట్‌లో రోహిత్ శర్మ (35 బంతుల్లో) టాప్‌లో ఉన్నాడు.



**గురువు తర్వాత శిష్యుడే!**

పొట్టి ఫార్మాట్‌లో అత్యంత తక్కువ బంతుల్లో హాఫ్ సెంచరీ బాదిన టీమిండియా ఆటగాళ్ల జాబితాలోనూ అభిషేక్ స్థానం దక్కించుకున్నాడు. ఈ లిస్ట్‌లో అతడి గురువు యువరాజ్ సింగ్ (12 బంతుల్లో) అగ్రస్థానంలో ఉన్నాడు. శిష్యుడు అభిషేక్ నిన్నటి మ్యాచ్‌లో 17 బంతుల్లో అర్ధ శతకం మార్క్‌ను చేరుకొని ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీస్ లిస్ట్‌లో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు.

**ఫాస్టెస్ట్ హండ్రెడ్స్**

టీ20 క్రికెట్‌లో అత్యంత వేగంగా 100 పరుగుల మార్క్‌ను చేరుకున్న ఆటగాళ్ల జాబితాలో ఓవరాల్‌గా మూడో స్థానంలో నిలిచాడు అభిషేక్. డేవిడ్ మిల్లర్ (35 బంతుల్లో), రోహిత్ శర్మ (35 బంతుల్లో) వరుసగా ఒకటి, రెండు స్థానాల్లో ఉన్నారు. అభిషేక్ (37 బంతుల్లో) థర్డ్ ప్లేస్‌లో నిలిచాడు.

**సిక్సర్ కింగ్**

టీ20 క్రికెట్‌లో ఒక ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సులు బాదిన భారత బ్యాటర్‌గానూ అభిషేక్ చరిత్ర సృష్టించాడు. ఇంగ్లండ్‌తో ఆఖరి టీ20లో అతడు 13 సిక్సులు కొట్టాడు. అతడి తర్వాతి స్థానంలో రోహిత్ ఉన్నాడు. నిన్నటి మ్యాచ్‌లో 10.1 ఓవర్‌లో సెంచరీ మార్క్‌ను చేరుకున్నాడు అభిషేక్. దీంతో అతి తక్కువ ఓవర్లలో శతకం మార్క్‌ను అందుకున్న ఆటగాడిగానూ నిలిచాడు.

**పార్ట్‌నర్‌షిప్‌లోనూ రికార్డే!**

ఇంగ్లండ్‌తో టీ20లో తిలక్ వర్మతో కలసి రెండో వికెట్‌కు ఏకంగా 115 పరుగుల భారీ భాగస్వామ్యం నమోదు చేశాడు అభిషేక్. 16.04 రన్‌రేట్‌తో ఈ జోడీ పరుగులు చేసింది. పొట్టి క్రికెట్‌లో భారత్ తరఫున హయ్యెస్ట్ రన్‌రేట్‌తో పరుగులు చేసిన జోడీగా తిలక్‌తో కలసి అభిషేక్ మరో రికార్డు క్రియేట్ చేశాడు.

కోహ్లీ సరసన అభిషేక్!

నిన్నటి మ్యాచ్‌లో అభిషేక్ స్కోరు 135. అదే ఇంగ్లండ్ టీమ్ స్కోరు 97. ప్రత్యర్థి జట్టులోని మొత్తం 11 మంది బ్యాటింగ్ చేసినా అభిషేక్ స్కోరుకు దరిదాపుల్లోకి రాలేదు. టీ20 క్రికెట్‌లో ఓ ఇన్నింగ్స్‌లో ఒక భారత బ్యాటర్ చేసిన స్కోరు కంటే అవతలి జట్టు తక్కువ స్కోరు చేయడం ఇది నాలుగోసారి. గతంలో విరాట్ కోహ్లీ, శుబ్‌మన్ గిల్, సూర్యకుమార్ యాదవ్ విషయంలో ఇలాగే జరిగింది.

### ఇకపై 4 రోజుల టెస్ట్‌లే.. వన్డే, టీ20 రూల్స్‌తో మరింత మజా..



ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2023-25 సీజన్ తర్వాత, కీలక మార్పులు జరగనున్నాయి. నాలుగు రోజుల టెస్టు మ్యాచ్‌లు, కొత్త ఫార్మాట్‌లు చర్చనీయాంశంగా ఉన్నాయి. ఐదు రోజుల టెస్టులు యాషెస్ వంటి ప్రధాన సిరీస్‌లకు మాత్రమే పరిమితం కావొచ్చు అని తెలుస్తోంది. ఈ మార్పులు టెస్ట్ క్రికెట్‌ను మరింత ఉత్కంఠభరితంగా మార్చే అవకాశం ఉందని అంటున్నారు. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2023-25 ??చివరి దశలో ఉంది. జూన్ 11న ఆస్ట్రేలియా-దక్షిణాఫ్రికా జట్ల మధ్య టైటిల్ పోరు జరగనుంది. అయితే, దీనికి ముందు, అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ కొత్త సీజన్ కోసం రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేయడం ప్రారంభించింది. వన్డే, టీ20 లాంటి ఉత్కంఠ ఇప్పుడు టెస్టు క్రికెట్‌లోనూ కనిపిస్తోంది. ఒక నివేదిక ప్రకారం, టెస్ట్ క్రికెట్‌లో కీలక మార్పును చూడొచ్చు. దీని కారణంగా తదుపరి సీజన్ ఉత్కంఠ గరిష్టంగా ఉంటుంది. పూర్తి 5 రోజుల పాటు టెస్ట్ మ్యాచ్ జరగదని తెలుస్తోంది. ఈసీబీ అధ్యక్షుడు జైషాతో భేటీ: ది టెలిగ్రాఫ్ నివేదిక ప్రకారం, జులైలో కొనసాగుతున్న సైకిల్ ముగిసిన తర్వాత, భారత జట్టు ఇంగ్లాండ్ పర్యటనకు ముందు ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ లో కీలక మార్పులు చేయబోతున్నారు. నివేదిక ప్రకారం, ఇంగ్లాండ్ వేల్స్ క్రికెట్ బోర్డు చైర్మన్ రిచర్డ్ థాంప్సన్ ఈ చొరవను తీసుకున్నారని తెలుస్తోంది. ఛాంపియన్‌షిప్ భవిష్యత్తుపై చర్చించేందుకు థాంప్సన్ ఇటీవల ఐసీసీ అధ్యక్షుడు జై షాను కలిశారు. తదుపరి సీజన్ జూన్ 20న హెడ్డింగ్లీలో జరిగే ఇంగ్లండ్-భారత్ టెస్ట్‌తో ప్రారంభమవుతుంది. దానికంటే ముందే పలు కీలక నిర్ణయాలు ఖరారు చేయవచ్చు అని తెలుస్తోంది. థాంప్సన్ ఏం చెప్పాడంటే? థాంప్సన్ మాట్లాడుతూ, 'ప్రస్తుత రూల్స్ సరిగ్గా పనిచేయడం లేదని పూర్తిగా అర్థమైంది. మేం మెరుగైన పోటీని కనుగొనాలని చూస్తున్నాం. కానీ, ఈ దశలో ఎటువంటి సిఫార్సులు వెలువడలేదు. దీనిపై ఐదు నెలల సమయం ఉంది.

## స్పోర్ట్స్

### రాత్రంతా విరాట్ ఇంటిముందు ఇద్దరు యువకులు! కోహ్లీ వాళ్ళని ఏం చేశాడంటే?



ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానులకు విరాట్ కోహ్లీ అంటే ఒక ప్రత్యేకమైన అభిమానం ఉంటుంది. కేవలం గ్రౌండ్‌లో కాదు, వ్యక్తిగత జీవితంలో కూడా తన మంచితనంతో అభిమానుల గుండెల్లో స్థానం సంపాదించుకున్నాడు. కోహ్లీ తాజాగా మరోసారి తన నిస్వార్థ ప్రేమను చాటుకున్నాడు. రాత్రంతా చలిలో తన కోసం ఎదురు చూసిన అభిమానులకు అతడు ఇచ్చిన గిఫ్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తాజాగా విరాట్ కోహ్లీ తన సొంత ఊరు దిల్లీలోని అరుణ్ జెట్లీ స్టేడియంలో దేశవాళీ క్రికెట్ రంజీ మ్యాచ్‌లో పాల్గొన్నాడు. అతడి ఆట అంచనాలకు తగ్గట్టుగా లేకపోయినా, కోహ్లీని చూడటానికి అభిమానులు భారీ సంఖ్యలో స్టేడియానికి తరలివచ్చారు. అంచనా ప్రకారం, దాదాపు 16 వేల మంది ఈ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించారు. మ్యాచ్ అనంతరం స్టేడియంలో ఉన్న ఫ్యాన్స్‌కు ఆటోగ్రాఫ్‌లు ఇస్తూ, కొంతమందితో ఫోటోలు కూడా తీసుకున్నాడు. ఆ తర్వాత కోహ్లీ తన నివాసానికి వెళ్లిపోయాడు. అయితే ఇద్దరు యువకులు మాత్రం విరాట్ కోహ్లీని దగ్గరగా కలవాలని ఆశించి, అతడి నివాసం దగ్గర రాత్రంతా చలిలోనే వేచి ఉండిపోయారు. వీరి గురించి సమాచారం తెలుసుకున్న కోహ్లీ తానే స్వయంగా ఇంటి తలుపులు తెరిచి వారిని తన ఇంటికి ఆహ్వానించాడు. కేవలం కలవడం మాత్రమే కాకుండా, వారితో ముచ్చటిస్తూ, ఆటోగ్రాఫ్ ఇచ్చి, మరింత ప్రత్యేకమైన జ్ఞాపకాలను అందించాడు.

**ఫ్యాన్స్‌కు మర్చిపోలేని అనుభూతి**

విరాట్ ఫ్యాన్స్‌ను తన ఇంటికి పిలిచి మాట్లాడటం, ఆటోగ్రాఫ్ ఇవ్వడం చూసి నెటిజన్లు అతడి గొప్ప మనసుపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. ఈ అపూర్వమైన క్షణాలకు సంబంధించిన ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. కోహ్లీ ఇచ్చిన ఆశ్చర్యకరమైన గిఫ్ట్‌తో ఆ అభిమానులు ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. విరాట్ కోహ్లీ కేవలం గ్రేట్ ప్లేయర్ మాత్రమే కాదు, గొప్ప హృదయమున్న వ్యక్తి అని మరోసారి నిరూపించుకున్నాడు! ఈ ఘటన మరోసారి అతడి వ్యక్తిత్వాన్ని బయటపెట్టింది. సాధారణంగా అంతటి క్రికెట్ లెజెండ్ అయిన వ్యక్తి తన ఫ్యాన్స్ కోసం ప్రత్యేకంగా సమయం కేటాయించడం చాలా అరుదైన విషయం. కానీ కోహ్లీ మాత్రం తన అభిమానం చూపించే ప్రతి ఒక్కరికీ విలువ ఇస్తాడు. అతడి ఈ జెస్టర్ సోషల్ మీడియాలో అందరినీ విపరీతంగా ఆకట్టుకుంటోంది. అభిమానులను గౌరవించే అతడి స్వభావమే విరాట్‌ను అభిమానుల మనసుల్లో చిరస్థాయిగా నిలిపేస్తుంది!

# సరికొత్త రికార్డ్స్ సృష్టించిన వెంకీమామ..

## భారీ మైల్డ్ స్టోన్ దాటేసిన సంక్రాంతికి వస్తున్నాం

విక్టరీ వెంకటేశ్ హీరోగా నటించిన లేటేస్ట్ మూవీ సంక్రాంతికి వస్తున్నాం. డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 14న థియేటర్లలో విడుదలైంది. మొదటి రోజే భారీ విజయాన్ని అందుకున్న ఈ సినిమా ఇప్పటికీ బాక్సాఫీస్ ను షేక్ చేస్తుంది. అడియన్స్ ఊహలకు మించి సూపర్ హిట్ టాక్ తో దూసుకుపోతుంది. ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా వచ్చిన ఈ సినిమాలో వెంకటేశ్ జోడిగా ఐశ్వర్య రాజేశ్, మీనాక్షి చౌదరి హీరోయిన్లుగా నటించారు. ఇప్పటికే వెంకీమామ కెరీర్ లోనే హాయ్యేస్ట్ కలెక్షన్స్ రాబట్టిన సినిమాగా సంక్రాంతికి వస్తున్నాం నిలిచిపోయింది. తాజాగా ఈ సినిమా భారీ మైల్ స్టోరీ దాటింది. దీంతో ఇప్పటివరకు సంక్రాంతి బరిలో నిలిచిన హీరోలలో వెంకటేశ్ రికార్డ్ సృష్టించారు. తాజాగా సంక్రాంతికి వస్తున్నాం సినిమా రూ.300 కోట్ల క్లబ్ లోకి అడుగుపెట్టేసింది. ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా రూ.303 కోట్ల గ్రాస్ రాబట్టిందని చిత్రయూనిట్ అధికారికంగా ప్రకటించింది. రీజనల్ చిత్రాల్లో ఆల్ టైమ్ ఇండస్ట్రీ హిట్ అంటూ పేర్కొంది. 20 రోజుల్లోనే దాదాపు రూ.303 కోట్లు సాధించి బాక్సాఫీస్ షేక్ చేసింది ఈ మూవీ. కేవలం రూ.50 కోట్ల లోపు బడ్జెట్ తోనే రూపొందించిన ఈ సినిమా.. అందరి అంచనాలను తలకిందులు చేస్తూ భారీ వసూళ్లు కొల్లగొట్టేసింది.

**మిర్చి సినిమా బ్యూటీ గుర్తుందా.. ?**

ఇదిలా ఉంటే.. సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో అటు మేకర్స్.. ఇటు డిస్ట్రిబ్యూటర్లకు సైతం లాభాలు వచ్చినట్లుగా తెలుస్తోంది. ఇటీవలే డిస్ట్రిబ్యూటర్స్ ప్రెస్ మీట్ సైతం నిర్వహించారు. ఈ చిత్రంతో భారీ లాభాలను గడించామని వెల్లడించారు. ఈ వేడుకలో నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ సైతం పాల్గొన్నారు.



### పెళ్లి తరువాత

## ఫస్ట్ ప్రాజెక్ట్ స్టార్ట్ చేసిన మెగా కోడలు

మెగా హీరో వరుణ్ తేజ్ అందాల భామ లావణ్య త్రిపాఠిని ప్రేమించి పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. హీరోయిన్ లావణ్య అందాల రాక్షసి సినిమాతో హీరోయిన్ గా అడుగుపెట్టింది. హనురాఘవపుడి దర్శకత్వం వహించిన ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సినిమాలో లావణ్య తన అందం, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది.ఇక ఈ సినిమా తర్వాత వరుసగా అవకాశాలు అందుకుంది ఈ చిన్నది. కానీ అనుకున్నంత గుర్తింపు తెచ్చుకోలేకపోయింది. ఇక ఈ అమ్మడు మెగా హీరో వరుణ్ తేజ్ ను ప్రేమించి పెళ్లాడింది. ఈ ఇద్దరూ కలిసి మిస్టర్, అంతరిక్షం సినిమాలు చేశారు. మిస్టర్ సినిమా సమయంలో ఈ ఇద్దరూ ప్రేమలో పడ్డారు. చాలా కాలం ఈ ఇద్దరూ తమ ప్రేమను సీక్రెట్ గా ఉంచారు. ఎంగేజ్ మెంట్ కూడా సైలెంట్ గానే చేసుకున్నారు. అలాగే పెళ్లి కూడా విదేశంలో చేసుకున్నారు. ఆ తర్వాత సుమారు ఏడాదిపాటు సినిమాలకు గ్యాప్ ఇచ్చింది లావణ్య. అయితే ఈ చిన్నది సినిమాలకు గుడ్ బై చెప్పేసిందని అంతా అనుకున్నారు. కానీ ఇప్పుడు పెళ్లి తర్వాత తొలి సినిమాను అనౌన్స్ చేసింది. లావణ్య ప్రధాన పాత్రలో తెరకెక్కనున్న సినిమా 'సతీ లీలావతి'. దుర్గాదేవి పిక్చర్స్, ట్రియో స్టూడియోస్ పతాకాల సంయుక్త నిర్మాణ సారథ్యంలో ప్రొడక్షన్ నెం.1గా ఈ సినిమా రూపొందనుంది. తాజగా ఈ సినిమా పూజాకార్యక్రమాలతో మొదలైంది. ఈ సినిమాకు తాతినేని సత్య దర్శకత్వం వహిస్తున్నారు. గతంలో ఆయన భీమిలీ కబడ్డీ జట్టు, ఎస్.ఎం.ఎస్(శివ మనసులో శృతి) వంటి సినిమాలను తెరకెక్కించాడు. ఈ సినిమాలో లావణ్యకు జోడిగా దేవ్ మోహన్ నటిస్తున్నాడు. ఈ సినిమా రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కుతుంది. మరి ఈ సినిమా లావణ్యకు ఎలాంటి హిట్ ఇస్తుందో చూడాలి.



## నేను సినిమాల్లోకి రావడానికి కారణం ఆమె..


**నిధి అగర్వాల్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్**

అందాల భామ నిధి అగర్వాల్ ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉంది. బాలీవుడ్ నుంచి టాలీవుడ్ కు వచ్చిన ఈ చిన్నది ఇప్పుడు తెలుగులో క్రేజీ ఆఫర్స్ ఆ అందుకుంటుంది. యంగ్ హీరోలతో మొదలు పెట్టి ఇప్పుడు స్టార్ హీరోలతో సినిమాలు చేసే రేంజ్ కు ఎదిగింది ఈ వయ్యారి భామ. నాగ చైతన్య నటించిన సవ్యసాచి సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది.తొలి సినిమా ఫ్లాప్ అయినా కూడా ఈ అమ్మడు మంచి మార్కులు కొట్టేసింది. ఆతర్వాత అక్కినేని హీరో అఖిల్ సరసన సినిమా చేసింది. అఖిల్ నటించిన మిస్టర్ మజ్ను సినిమాలో నటించింది. ఈ సినిమా కూడా ఆశించిన స్థాయిలో సక్సెస్ అవ్వలేదు. వరుస ఫ్లాప్స్ పలకరిస్తున్న సమయంలోనే పూరి సినిమాలో ఛాన్స్ అందుకుంది. పూరిజగన్నాథ్ దర్శకత్వలో తెరకెక్కిన ఇస్మార్ట్ శంకర్ సినిమాలో ఛాన్స్ అందుకుంది. ఈ సినిమా లో నటనతో పాటు అందంతోనూ ఆకట్టుకుంది ఈ వయ్యారి. ఓ రేంజ్ లో అందాలు ఆరబోస్తూ అభిమానులను కవ్వించింది. ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమా తర్వాత క్రేజీ ఆఫర్స్ అందుకుంది. ఇక ఇప్పుడు ప్రభాస్ రాజా సాబ్, పవన్ కళ్యాణ్ హరిహరవీరమల్లు సినిమాలో నటిస్తుంది. ఈ రెండు సినిమాల షూటింగ్స్ శరవేగంగా జరుగుతున్నాయి. ఈ రెండు సినిమాల షూటింగ్స్ లో బిజీగా గడుపుతున్న ఈ అమ్మడు తాజాగా చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్ బీగా మారాయి. నిధి అగర్వాల్ అంత ఈజీగా హీరోయిన్ అవ్వలేదు. ఎన్నో కష్టాలు భరించింది ఈ అమ్మడు. మొదటి సినిమా సమయంలో దాదాపు రెండేళ్లు సినిమా ఆఫీసుల చుట్టూ తిరిగిందట. తన కష్టాల గురించి ఓ ఇంటర్వ్యూలో నిధి అగర్వాల్ మాట్లాడుతూ.. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె చూసి తాను కూడా సినిమాల్లోకి రావాలనుకున్నా.. ఆమెను ఇన్స్పిరేషన్‌గాతీసుకున్నా.. మొదట్లో ఇంట్లో ఒప్పుకోలేదు. ఆతర్వాత నన్ను ఎంకరేజ్ చేశారు. దాదాపు రెండేళ్ల పాటు ఆఫీసుల చుట్టూ తిరిగాను. ఆఫీసుల చుట్టూ తిప్పించుకొని ఆతర్వాత అవకాశం లేదు అంటూ పంపించేశారు. మైఖేల్ మున్నా సినిమా ఆడిషన్‌కి వెళ్తే దాదాపు 300 మందిలో అదృష్టం బాగుండి నేను సెలక్ట్ అయ్యాను.



## చూస్తున్నంత సేపూ కన్నీళ్లు వచ్చాయి

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన పుష్ప 2 ఎంత పెద్ద విజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన ఆవరసం లేదు. ఇండియన్ షేక్ చేసింది ఈ సినిమా. ఇండియన్ మూవీ మూవీస్ రికార్డ్స్ ను బ్రేక్ చేసింది ఈ సినిమా ఏకంగా రూ . 18వందల కోట్లకు పైగా వసూల్ చేసింది పుష్ప 2. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో రష్మిక మందన్న హీరోయిన్ గా నటించింది. గతంలో వచ్చిన పుష్ప సినిమా మంచి విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. పుష్ప భారీ విజయం సాధించడంతో పుష్ప 2 పై భారీ ఆ అంచనాలు క్రియేట్ అయ్యేయి ఊహించినట్టే పుష్ప 2 సినిమా విడుదలై సంచలనం సృష్టించింది. థియేటర్స్ లో దుమ్మురేపిన పుష్ప 2 సినిమ ఇప్పుడు ఓటీటీలో అదరగొడుతుంది. పుష్ప 2 సినిమాకు సంక్రాంతి కానుకగా రీ లోడెడ్ వర్షన్ ను విడుదల చేశారు. కొన్ని సీన్స్ యాడ్ చేసి రీలోడెడ్ వర్షన్ ను రిలీజ్ చేశారు. ఇక ఇప్పుడు ఓటీటీలో కూడా పుష్ప 2 రీ లోడెడ్ వర్షన్ రిలీజ్ అయ్యింది. పుష్ప 2 సినిమాలో అల్లు అర్జున్ నటన పై అభిమానులతో పాటు సినీ ప్రముఖులు కూడా ప్రశంసలు కురిపిస్తున్నారు. తాజాగా అల్లు అర్జున్ సోదరుడు, నటుడు శిరీష్ కూడా పుష్ప 2 సినిమా పై స్పందించాడు. సోషల్ మీడియాలో ఆసక్తికర పోస్ట్ షేర్ చేయాడు శిరీష్. పుష్ప 2 సినిమాను ఓటీటీలో చూసి తన అభిప్రాయాన్ని పంచుకున్నాడు శిరీష్. థియేట్రికల్ వెర్షన్ లో మిస్సయిన లింక్స్ అన్నిటినీ కవర్ చేసారని శిరీష్ చెప్పుకొచ్చాడు. 'పుష్ప 2' క్లైమాక్స్ లో పుష్పరాజ్ తన ఇద్దరు సోదరులను పట్టుకొని ఏడుస్తున్న సన్నివేశాన్ని ఫోటో తీసి అల్లు శిరీష్ ఇన్స్టా స్టోరీలో పోస్ట్ చేశాడు. దాని కింద "రీలోడెడ్ వెర్షన్ చాలా హై ఇచ్చింది. సినిమా చివరి వరకూ కన్నీళ్లు వచ్చాయి. థియేట్రికల్ వెర్షన్ లో మిస్



# ఓటీటీలోకి వచ్చిన తర్వాత థియేటర్స్‌లోకి సిద్దు సినిమా



స్టార్ బాయ్ సిద్దూజొన్నల గడ్డ ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నాడు. బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైనప్ చేసి ఆయా షూటింగ్స్ తో జోరుమీదున్నాడు. సిద్దు నటించిన డీజే టిల్లు , టిల్లు స్క్వేర్ సినిమాలు భారీ హిట్స్ గా నిలిచాయి. దాంతో సిద్దు పేరు మారుమ్రోగింది. అంతే కాదు యూత్ లో సిద్దు క్రేజ్ విపరీతంగా పెరిగింది. సిద్దు త్వరలోనే జాక్ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. ఈ సినిమాలో హీరోయిన్ గా బేబీ బ్యూటీ వైష్ణవి చైతన్య హీరోయిన్ గా నటిస్తుంది. ఇదిలా ఉంటే డీజే టిల్లు సినిమా కంటే ముందు సిద్దు కొన్ని సినిమాలో చిన్న చిన్న పాత్రలు చేశాడు. అలాగే హీరోగానూ కొన్ని సినిమాలు చేశాడు. కానీ ఆ సినిమాలు ఈ యంగ్ హీరోకి అంతగా గుర్తింపు తీసుకురాలేదు. లైఫ్ బిఫోర్ వెడ్డింగ్ అనే సినిమాతో సిద్దు హీరోగా పరిచయం అయ్యాడు. బాయ్ మీట్స్ గర్ల్, గుంటూర్ టాకీస్, కృష్ణ అండ్ హిజ్ లీలా, మా వింత గాథ వినుమా వంటి సినిమాల్లో నటించాడు. ఇక ఇప్పుడు ఈ సినిమాల్లో ఓ సినిమా రీ రిలీజ్ కు రెడీ అవుతుంది. సినిమాఓటీటీలోకి వచ్చిన ఐదేళ్ల తర్వాత థియేటర్స్ లో పలకరించడానికి వస్తుంది. ఆ సినిమానే కృష్ణ అండ్ హిజ్ లీలా. ఈ సినిమా ఆసక్తికర కథతో తెరకెక్కింది. ఈ చిత్రాన్ని రవికాంత్ పేరేపు దర్శకత్వం వహించగా సురేశ్ ప్రొడక్షన్స్, వయాకామ్ 18 స్టూడియోస్, సంజయ్ రెడ్డి సంయుక్తంగా నిర్మించారు. ఈ సినిమాలో శ్రద్ధా శ్రీనాథ్, షాలిని వడ్నికట్టి, సీరత్ కపూర్ హీరోయిన్స్ గా నటించారు. ఈ సినిమా అందమైన ప్రేమ కథగా తెరకెక్కింది. ఈ చిత్రానికి శ్రీ చరణ్ పాకాల సంగీతం అందించాడు. కాగా ఈ సినిమా కరోనా కారణంగా లాక్ డౌన్ ప్రకటించడంతో 'ఆహా' ఓటీటీలో 2020, జూలై 4న డైరెక్ట్ గా విడులైంది. ఇక ఇప్పుడు ఈ సినిమాను థియేటర్స్ లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇట్స్ కాంప్లికేటెడ్ అనే పేరుతో ఈ సినిమాను విడుదల చేయనున్నారు. ఫిబ్రవరి 14న ప్రేమికుల దినోత్సవం పురస్కరించుకొని ఈ సినిమాను థియేటర్స్ లో విడుదల చేయనున్నారు.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com